# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

బుధవారం, జూన్ 10, 2009

ఎనిమిదవ సమావేశము, సంపుటము III, నంబరు 2

విరోధినామ సంవత్సర జ్యేష్ఠ 20

**WEDNESDAY, THE 10th JUNE, 2009**

**EIGHTH SESSION, VOLUME III, NO.2**

**20 JYESHTHA, 1931 S.E.**

* * * * *


శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | డా. ఎ. చక్రపాణి |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ మహ్మద్ జానీ |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ వి. భూపాల్‌రెడ్డి |
| | | శ్రీ వాసిరెడ్డి వరద రామారావు |
| | | డా. రాయపాటి శ్రీనివాస్ |
| | | డా. మసాల పద్మజ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ప్రత్యేక కార్యదర్శి | : | శ్రీ కె. గోపాల కృష్ణయ్య |
| సంయుక్త కార్యదర్శి | : | శ్రీ డి. శివరావు |
| | | శ్రీ ఎం.వి.వి. సత్యానందం |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎం. పాండురంగాచార్య |
| | | శ్రీ పి. సీతారాములు |
| | | శ్రీ డి. నర్శింహులు |
| | | శ్రీ పి. సత్యనారాయణ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ కె. సుభాష్ చంద్రబోస్ |
| | | శ్రీ ఎ. రాంరెడ్డి |
| | | శ్రీ టి. రాంచందర్ |
| | | శ్రీమతి వి. గిరిజాసుందరి |
| | | శ్రీ ఎస్. జయరాం |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |
| | | శ్రీమతి ఎ. సాయి లక్ష్మి |
| | | శ్రీమతి ఎస్.ఎ. జ్యోతి |
| | | శ్రీ జి. వెంకట కృష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| | | శ్రీ జి.ఎల్. నరసింహారావు |
| మార్షల్ | : | శ్రీ ఆర్. సీతారామారావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఎల్. తిరుమలరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు
## అధికార నివేదిక
## బుధవారం, జూన్ 10, 2009

### విషయ సూచిక

1. సభా కార్యక్రమము ః

విషయము: శాసన పరిషత్తు సభానాయకునిగా నియమితులైన ఆర్థిక మరియు శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి శ్రీ కె. రోశయ్య గారిని అభినందించటం గురించి.

2. సభా సమక్షంలో ఉంచిన పత్రము ః

3. సంతాప ప్రతిపాదన ః

విషయము: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్ మాజీ సభ్యులు శ్రీ రావు వేంకట గోపాల కృష్ణ రంగారావుగారి మృతి పట్ల సంతాప తీర్మానం.

4. సభా కార్యక్రమము ః

విషయము: కొత్త మంత్రుల, కొత్త సభ్యుల స్వపరిచయ కార్యక్రమము (కొనసాగింపు) ః

5. గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ (కొనసాగింపు) ః

6. గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ముఖ్యమంత్రి ప్రత్యుత్తరం ః

7. 8వ సమావేశపు గణాంక వివరముల పట్టిక ః

* * * * *

**ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు**
**2009, జూన్ 10వ తేది, బుధవారం**
**ఎనిమిదవ సమావేశపు రెండవరోజు**

**(శాసనమండలి ఉ.10.00 గంటలకు సమావేశమయింది)**
**(గౌరవ శాసనమండలి ఛైర్మన్ అధ్యక్షస్థానంలో ఉన్నారు)**

## సభా కార్యక్రమము

## శాసన పరిషత్ సభా నాయకునిగా నియమితులైన ఆర్థిక మరియు శాసన సభా వ్యవహారాల శాఖమంత్రి శ్రీ కె. రోషయ్యగారిని అభినందించటం గురించి

మిస్టర్ ఛైర్మన్ : గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు, గౌరవనీయులైన ఆర్థిక మరియు శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి శ్రీ కె. రోశయ్యగారిని ఈ శాసన పరిషత్తు నాయకునిగా నియమించారు. ఈ సభను వారి సహకారంతో, మీ అందరి అభిమానంతో సక్రమంగా నిర్వహిస్తున్నాను. ఈ సందర్భంలో దేవుడు వారికి మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలని సభ తరఫున భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ కె. రోశయ్య (ఆర్థిక శాఖమంత్రి) : అధ్యక్షా, మీకు సభకు కూడా కృతజ్ఞతాపూర్వకమైన వందనాలు. ముఖ్యమంత్రిగారు ............

మిస్టర్ ఛైర్మన్ : అందరూ చెప్పిన తరువాత ఒకేసారి మీరు మాట్లాడండి.

శ్రీ పువ్వాడ నాగేశ్వర రావు (అసెంబ్లీ) : అధ్యక్షా, గత రెండు సంవత్సరాలుగా శాసనమండలి ఏర్పడినప్పటి నుండి కూడా ఒక వెలితి కనిపిస్తున్నది. మీరు ఉన్నారు, మేము ఉన్నాము. వారు కూడా వస్తున్నారు. కానీ ఈ హౌస్‌కు లీడర్ లేరు. నేను తమద్వారా పోయినసారి ప్రభుత్వాన్ని ప్రశ్నించాను. ఆనాడు సరైన సమాధానం రాలేదు. అదృష్టవశాత్తు, మనందరి కోరిక ప్రకారం, రోశయ్యగారు ఈ హౌస్‌లో లీడరుగా ఉండి ఉంటే బాగుంటుందని ఏదయితే కోరుకున్నామో దానిని ముఖ్యమంత్రిగారు కన్సిడర్‌చేసి ఈ సభను సరైన దృష్టితో నడిపించడానికి సంప్రదాయాలను, ప్రజాస్వామ్యాన్ని ఇనుమడింపజేసేవిధంగా ఆయనను లీడరుగా నియమించారు. నిన్ననే మీరు గార్డియన్ అని అన్నారు. హౌస్‌కు గార్డియన్‌గా మీరు ఉంటారు. మీ ఆధ్వర్యంలో మా కర్తవ్యాలను నిర్వర్తిస్తాము. రోశయ్యగారు ఇప్పుడు ఉన్న సంప్రదాయాలలో ప్రజాస్వామ్య యుతంగా విమర్శలు, అట్లాగే తర్కం వితర్కం చేస్తూ, సరైన మార్గంలో ఈ హౌస్‌ను నడిపించిన అనుభవాలు మనకు ఉన్నాయి. ఇంతకుపూర్వం రద్దయిన శాసనమండలిలో మనం ఉన్నాము. ఒక రకంగా వారు మేము కలిసి టిడిపి కొత్తగా వచ్చిన టైంలో ప్రతిపక్ష పార్టీలో మా పాత్ర నిర్వహించిన రోజులు గుర్తుకు వస్తున్నాయి. లాన్స్‌లో ప్రభాకర రావుగారు, ఆయన, నేను మాజీ ముఖ్యమంత్రి జనార్థన రెడ్డిగారు మాట్లాడుకునేవారం, అట్లాగే సభ ఔన్నత్యాన్ని కాపాడడానికి ప్రయత్నం చేశాము. ఉభయసభలు సరైన మార్గంలో నడవడానికి ఒకదానికి ఒకటి కాంప్లిమెంటరీగా నడవాల్సిన పరిస్థితి. ఈ సభ ఉన్నత సంప్రదాయాలతో, రోశయ్యగారి

నాయకత్వంలో, మీ ఆదేశాలకు అనుగుణంగా నడవాలని ప్రజాస్వామ్య బద్ధంగా మా కోర్కెలు నిన్ననే చెప్పాము. ప్రమోషన్ కావాలి, ఈక్వాలిటి రావాల్సిందే. రెండుకళ్లు కూడా సమానంగా ఉండేవిధంగా బై కామరల్ సిస్టం ద్వారా ఈ ఉన్నత విలువలు కాపాడడానికి, రోశయ్యగారు సభా నాయకుడుగా ఉండడం చాలా హుందాగా ఉంటుంది, చాలా సంతోషంగా ఉంది. ఒక పాత స్నేహితుడు, నాకంటే సీనియర్ ఆయన, అయినాసరే రద్దయిన పాత కౌన్సిల్ సభ్యులం కాబట్టి ఆనాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి. ఆ సాంప్రదాయాలను ముందుకు తీసుకుని పోవడానికి, ఆయన నాయకత్వంలో ఈ హౌస్ మరిన్ని ఉత్తమ సంప్రదాయాలు నెలకొల్పడానికి మేము సహకరిస్తామని హామీఇస్తూ మీద్వారా రోశయ్యగారిని మరొకసారి అభినందిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చుక్కా రామయ్య (నల్గొండ, వరంగల్, ఖమ్మం) : అధ్యక్షా, రోశయ్యగారు చక్కటి పార్లమెంటేరియన్, ఈ కౌన్సిల్‌ను రివైవ్ చేయడానికి చాలా ప్రముఖపాత్ర వహించారు. అలాంటి మనిషి ఈనాడు సభకు నాయకత్వం వహించడం మా అందరికీ సంతోషమని మనవిచేస్తున్నాను. వారికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఇప్పటికి కౌన్సిల్ ఏర్పడి రెండు సంవత్సరాలయినా చాలామందికి ఈ విషయం తెలియదు. మేము చెప్పుకోవలసిన అవసరం వస్తున్నది. కాబట్టి ఆ సభకు ఈ సభకు మధ్య ఉన్న వివక్ష తొలగించి మేము కూడా లెజిస్లేచర్‌లో ప్రముఖమైన పాత్ర వహిస్తున్నామని గుర్తింపజేయడానికి ప్రయత్నంచేస్తారనీ, దానికి మేమంతా సహకరిస్తామని తెలుపుతూ మీరు ఆదర్శప్రాయంగా, స్ఫూర్తిదాయకంగా మమ్ములను గైడ్ చేయాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి (మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) :అధ్యక్షా, పెద్దలు రోశయ్యగారిని సభా నాయకుడుగా నియమించినందుకు డా. వై. ఎస్. రాజశేఖర రెడ్డిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, రోశయ్యగారిని అభినందిస్తున్నాను. రోశయ్యగారి గురించి చెప్పాలంటే ఒక రోజు చెబితే సరిపోదు. ఆయన కంఠం భగవంతుడు ఆయనకు ఇచ్చిన వరం. అవతలి వారిని ఎట్రాక్ట్ చేయడం ఆ కంఠంతో మాట్లాడుతూ, ఎటువంటి పరిస్థితినయినా తన ఆధీనంలోకి తెచ్చుకుని వారిని కన్విన్స్ చేసే శక్తి భగవంతుడు వారికి వరంగా ఇచ్చాడు. ఆర్థిక శాఖమంత్రి మన కౌన్సిల్ సభ్యుడు కావడం మనకందరికి గర్వకారణంగా చెప్పక తప్పదు. కౌన్సిల్‌కు రోశయ్యగారికి అవినాభావ సంబంధం ఉంది. వారికి విడదీయరాని సంబంధం ఉంది. యూనియన్ లీడర్‌గా నేను ఉన్నపుడు గ్యాలరీల నుండి వారు విమర్శలకు ప్రతిస్పందించే విధానం గమనించడం జరిగేది. ఆయన ప్రభుత్వానికి ఒక ఎసెట్. ఇప్పటికి రెండు సంవత్సరాల నుండి నాయకులు ఈ సభకు లేకున్నా కూడా వారిని నాయకుడు లాగానే మేము గౌరవించాము. ఇప్పటికి వారిని సభా నాయకుడుగా గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రకటించడం సంప్రదాయం ప్రకారం ప్రకటించడమే తప్ప ఇంకొకటి కాదు. ఇది అభినందించదగిన విషయం. వారి ద్వారా ఈ సభకు గౌరవం వచ్చిందని భావిస్తున్నాను. శాసనసభ మెంబరుకు ప్రెస్‌లో కానివ్వండి, మరొకరకంగా కానివ్వండి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. శాసనమండలి సభ్యునికి అటువంటి స్థానం లేదు. రోశయ్యగారు దానిని కల్పించవలసిన బాధ్యత ఉందని వారిదృష్టికి తెస్తూ, నిండుహృదయంతో వారిని అభినందిస్తూ, ముగిస్తున్నాను.

శ్రీ ముండ్ల వెంకట శివా రెడ్డి (కడప, అనంతపుర్, కర్నూలు) : అధ్యక్షా, పెద్దలు రోశయ్యగారిని లీడరాఫ్ హౌస్‌గా చేయడం ఇక్కడ ఉండే కౌన్సిల్ సభ్యులందరం గర్వకారణంగా భావిస్తున్నాము. టిడిపి తరఫున ధన్యవాదాలు ముఖ్యమంత్రి గారికి తెలియజేసుకుంటున్నాము. ఎందుకంటే ఆయన లెజిస్లేటర్స్‌కు ఒక

మోడల్‌గా ఉన్నారని ప్రతి ఒక్కరు చెప్పాల్సిన విషయం. ఆయన దగ్గర నుండి నేర్చుకోవలసిన విషయాలు, మాలాంటి కొత్తవారికి, భవిష్యత్తులో లెజిస్లేటర్స్‌కు ఎన్నో ఉన్నాయి. ఆయన క్లారిటీ ఆఫ్ థాట్, క్లారిటీ ఆఫ్ యాక్షన్ ఆయన సహనం ఇవన్నీ ఖచ్చితంగా నేర్చుకోవలసిన విషయాలు, గ్రహించవలసిన విషయాలు కూడా. ఇంత వయసులో కూడా మనం చెప్పేది ఓపికగా విని ఆయన చేసే ఆన్సరింగ్, అందులోని క్లారిటీ తప్పకుండా ప్రశంసించే అంశాలు.

ఉ. 10.10

పెద్దలు, వారిని ప్రశంశించే వయస్సు నాకు లేకపోవచ్చును కాని, ఫ్యూచర్ జనరేషన్స్ వారికి ఆయన ఒక రోల్ మోడల్‌గా మిగిలిపోతారని ఈ సభకు తెలియజేసుకుంటూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బొమ్మిడి నారాయణ రావు (అసెంబ్లి) : అధ్యక్షా, కౌన్సిల్ వున్నంత కాలం గుర్తుంచుకోవలసిన పెద్దలు కొందరు వుంటారు. అందులో ప్రముఖులు మన రోశయ్య గారు. నిజానికి నేను రాజకీయాలలోకి రాకముందు రోశయ్య గారి అభిమానిని. ఆంధ్రుల అదృష్టం కొద్దీ ఆయన ఆ రోజులలో ప్రతిపక్ష స్థానంలో వున్నారు. నాకు ఇప్పటికీ గుర్తు, భీమవరంలోని మావుళ్లమ్మ దేవస్థానంలో ఆయన చేసిన ప్రసంగం నాకు స్ఫూర్తిని ఇచ్చింది. ఆ తరువాత నా అదృష్టం కొద్దీ ఇక్కడకు వచ్చిన తరువాత పరిచయాలు జరిగాయి. ఆయన రాజకీయంగా అజాత శతృవు. ముఖ్యంగా ఆయనకు ఒక పదం వర్తిస్తుంది. ఉభయ సభలలో కూడా ఆయన అపర భీష్మాచార్యులు. కౌరవ పక్షాన అప్పుడప్పుడు ఆయన వున్నా పాండవులను కూడా సమ దృష్టితో చూసి, ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా ఆశీర్వదించే లక్షణం వున్న వ్యక్తి. దానికి నా అభినందనలు.

శ్రీ దాడి వీరభద్రరావు (విశాఖపట్నం) : అధ్యక్షా, ఎట్టకేలకు మనకు లీడర్ ఆఫ్ ది హౌజ్ పోస్ట్ ఫిలప్ చేసినందుకు చాలా సంతోషిస్తున్నాను. గౌరవనీయులైన రోశయ్య గారు సీనియర్ శాసన మండలి సభ్యులు. శాసన మండలి అంటే, జ్ఞాపకం వచ్చేది రోశయ్య గారు, రోశయ్య గారు అంటే జ్ఞాపకం వచ్చేది శాసన మండలి. విలువలు కోల్పోతున్న ఈ కాలంలోను, ముందు నుంచి కూడా, శాసన సభలో కాని, బయట కాని విలువలను కాపాడుతూ, విలువలకు విలువనిస్తూ, విలువల కోసం పోరాటం చేసిన వ్యక్తి రోశయ్య గారు. వారు ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి అయినా కూడా -- గతంలో ప్రతిపక్షంలో వుండేవారు, తరువాత అధికార పక్షంలో వున్నారు -- నిజాలు మాట్లాడడంలో ఏ మాత్రమూ జంకరు. అయితే అప్పుడప్పుడు అధికార పక్షాన్ని సమర్థించడం వారి తాలూకు బాధ్యత. వాటిని కూడా మేము హృదయ పూర్వకంగా స్వీకరిస్తాము. మాకు జ్ఞాపకం వుంది, గతంలో చెన్నారెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్నపుడు తులాభారం తీసుకుంటే, దాని మీద రోశయ్య గారు ప్రతిపక్ష నాయకులుగా అద్భుతమైన ప్రసంగం చేసి రాష్ట్ర ప్రజలను ఉర్రూతలూగించారు.

అటువంటి సన్నివేశాలు చాలా వున్నాయి. ఆ విధంగా ప్రతిపక్షంలో వున్నపుడు ప్రతిపక్ష నాయకుడిగా సమర్ధవంతంగా వ్యవహరించారు. అధికారంలో వున్నపుడు ఆర్థిక శాఖామంత్రిగా 14 బడ్జెట్‌లను ప్రెజెంట్ చేసారు. ప్రపంచం మొత్తం మీదే ఇన్ని బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖా మంత్రి గారు రోశయ్య గారు ఒక్కరే. నేను ఛైర్మెన్ గారిని రిక్వెస్ట్ చేస్తున్నాను, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో రోశయ్య గారి పేరును నమోదు చేసేందుకు మనం రికమండ్ చేస్తే బాగుంటుందని. ఈ రకమైన గౌరవం వారివల్ల మన రాష్ట్ర ప్రజలకు వచ్చింది, మన అందరికీ కూడా రావడం జరిగింది. వారు మాట్లాడేటప్పుడు అసెంబ్లీలో ఒక రకంగా మాట్లాడతారు, కౌన్సిల్‌లో ఒక రకంగా మాట్లాడతారని బయట నన్ను చాలా మంది అడుగుతున్నారు. వారికి కౌన్సిల్ మీద వున్న

అభిమానం అలాంటిది. మన ఛైర్మన్ చక్రపాణి గారు కూడా కౌన్సిల్‌ను పునరుద్ధరించడంలో విశేషమైన కృషిని జరిపారు. ఒక ఆదర్శమైన ఛైర్మన్‌గా సభను నిర్వహించడం జరుగుతోంది. ఈ సభ నిర్వహణలో సభా నాయకుడిగా రోశయ్య గారిని నియమించినందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారికి తెలుగుదేశం పార్టీ తరపున ప్రత్యేకమైన అభినందనలు తెలియజేస్తున్నాను. రోశయ్య గారి సలహాలు, సంప్రదింపులు, రోశయ్య గారి ఆశీస్సులు, శాసన మండలికి, శాసన మండలి సభ్యులందరికీ వుంటాయని ఆశిస్తూ, వారికి విధులను నిర్వర్తించడంలో భగవంతుడు సరియైన శక్తిని ప్రసాదించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణ రావు (కృష్ణా, గుంటూరు) : అధ్యక్షా, ఆనాడు సభలో పుచ్చలపల్లి సుందరయ్య గారు, తరిమెళ్ల నాగిరెడ్డి గారు, వావిలాల గోపాల కృష్ణయ్య గారు, తెన్నేటి విశ్వనాథం గారు ఎటువంటి విలువలను నెలకొల్పారో, ఆ విలువలకు రోశయ్య గారు ప్రతినిధి అని నేను భావిస్తున్నాను. తరాల మధ్య వున్న అంతరాన్ని కూడా వారు పూరిస్తున్నారు. ప్రత్యేకించి వారు గుంటూరు జిల్లాకు చెందిన వారు కావడం, నేను పనిచేసిన హిందూ కళాశాలకు వారు పూర్వ విద్యార్థి కావడం కూడా నేను గర్వకారణంగా భావిస్తూ, సభకు నాయకుడిగా వారిని ఎంచుకున్నందుకు రోశయ్య గారికి నేను అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు (అసెంబ్లీ) : అధ్యక్షా, ఈ సభకు నాయకుడిగా పెద్దలు రోశయ్య గారిని ప్రభుత్వం నియమించడమనేది చాలా సంతోషించదగ్గ విషయం. రోశయ్య గారి గురించి చాలా మంది మాట్లాడారు. నాకు కూడా వారిని చూడగానే వారి దగ్గర ఏమైనా నేర్చుకుంటే బాగుండును అనే ఆత్రుత వుంటుంది. ఎందుకంటే రోశయ్య గారు చాలా అనుభవం, పరిజ్ఞానం కలిగిన వ్యక్తి. అందువల్ల వారిపట్ల ఆ విధంగా ఆకర్షితులవడం చాలా సహజం. అధ్యక్ష స్థానంలో వున్న తమరు సభను సజావుగా నడపకపోతే ఆ బాధ్యత వారిది అవుతుందని నేను అనుకుంటున్నాను. మమ్మల్ని సక్రమంగా వుంచి సభను సజావుగా నడపడానికి కూడా మీరు బాధ్యత తీసుకోవలసిన అవసరం వుంది. మావి ఎక్కడైనా లోపాలు జరిగితే, వాటిని ఎత్తిచూపి ఈ సభాసాంప్రదాయాలను ఇనుమడింపచేసే విధంగా వుండాలని కోరతున్నాను. మా వైపు నుంచి మేము ఖచ్చితంగా సహకార భావంతో, నమ్రతగా వుంటాము. విషయాలను సూటిగా చెప్పడానికి ప్రయత్నిస్తాము. ఈ సందర్భంగా రోశయ్య గారు వయస్సు రీత్యా, అనుభవం రీత్యా గురువు లాంటి వారని చెప్పక తప్పదు. వారికి నా ధన్యవాదాలు తెలియజేస్తూ, కొత్త ప్రభుత్వం కూడా వచ్చింది కాబట్టి, ఈ ప్రభుత్వానికి కూడా మా శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ. 10.20

శ్రీ షేక్ హుస్సేన్ (నామినేటెడ్) : అధ్యక్షా, రోశయ్య గారు అపారమైన అనుభవజ్ఞులు, ఉభయ సభలలో ఎప్పుడైనా ఏదైనా సమస్య లేవనెత్తినప్పుడు తన ప్రజ్ఞాపాటవాలతో ఆ సమస్యకు దారి చూపించి ప్రశాంతంగా పరిష్కరించే ధీరచిత్తులు. కేవలం ఇప్పుడు మాట్లాడిన వారు అందరూ పెద్దలు, పూజ్యులు రోశయ్యగారి రాజ కీయ అనుభవం గురించి మాత్రమే చెప్పడం జరిగింది. నాకు మరొక కోణంలో పరిచయం ఉంది. ప్రముఖ సాహితీ సభలలో నేనూ ఆయన కలిసి ప్రసంగించిన సందర్భాలు ఉన్నాయి. సాహిత్యంలో కూడా ఆయన ఆరితే రిన దిట్ట. అటువంటి పెద్దలు, పూజ్యులు అయిన రోశయ్యగారికి ఆయురారోగ్యాలు ఇచ్చి పది కాలాలపాటు మనకు మార్గదర్శకంగా ఉంచాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్‌ః అందరిదీ అదే అభిప్రాయము. అందరి అభిమానము వారిపైన పొంగి పొరలుతోంది.

శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడ్డి (కడప, అనంతపూర్, కర్నూలు) ః అధ్యక్షా, చాలా మంది మాట్లాడిన తీరును చూసినప్పుడు ఈ మొత్తం రాజకీయ వ్యవస్థకి ఈనాడు రోశయ్య గారు శాసనసభకు, శాసనమండలికి ఒక రాజకీయ గురువుగా ఉన్నట్లుగా భావిస్తున్నాను. ఇంతకుముందు దాడి వీరభద్రరావుగారు మాట్లాడారు. మంచి మంచి ఛలోక్తులు విసిరేవారన్నారు. సాహితీప్రియలన్నారు. వారు తమ ఛలోక్తులతో మనస్సును రంజింపచేసే విధంగా సమస్యలను పరిష్కరిస్తూ అందరిని ఆకట్టుకునే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఆ నేప థ్యంలో గౌరవ ముఖ్యమంత్రిగారు శాసన మండలి నాయకుడిగా కోణిజేటి రోశయ్యగారిని నియమించి నందుకు ముఖ్యమంత్రిగారికి, రాష్ట్ర ప్రభుత్వానికి అంటే నూతన ప్రభుత్వానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియ చేస్తున్నాను. రోశయ్యగారు ఆరోగ్యంగా ఉంటే వారు మనందరికి స్ఫూర్తిదాయకంగా ఉంటారు. ఆయన ఆయు రారోగ్యాలతో మనగలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాదె వెంకటరెడ్డి (దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి) ః ప్రథమంగా ఇంతవరకూ కౌన్సిల్‌కి సభానా యకుడిగా ఎవరూ లేరు. అనుభవజ్ఞులు, అన్ని రంగాలలో ప్రాధాన్యత కలిగి ప్రావీణ్యం కలిగిన రోశయ్య గారిని నియమించడం మనందరికి గర్వకారణం. మొత్తం శాసనమండలి సభ్యులందరూ సభలో వారిని అభినందించ డానికి తహతహపడుతున్నారు. తగిన సామర్థ్యం, విజ్ఞానం కలిగినవారు ఆయన. అన్ని విధాలుగా అవసరం వచ్చినప్పుడు ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ ఉండడం గొప్ప విషయమని మనవిచేస్తున్నాను. మండలిలో సభ్యులుగా ఉన్నారు. శాసనసభలో ఆర్థిక శాఖామాత్యులుగా 14 సార్లు బడ్జట్‌ను ప్రవేశపెట్టారు. దాడి వీరభద్రరావుగారు చెప్పినట్లు గిన్నీస్ బుక్‌లో వారి పేరును చేర్చవలసిన విషయం మనవిచేస్తూ, భగవంతుడు వారికి ఇంకా ఆరో గ్యాన్ని ప్రసాదించాలని, భవిష్యత్తులో శాసనమండలి, శాసనసభలో వారు ప్రభుత్వం తరఫున రాష్ట్రానికి అన్ని విధాలా సహాయం చేయవలసిందిగా కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ (డెప్యూటీ ఛైర్మెన్) ః రోశయ్యగారి గురించి అందరూ చెప్పారు. నేను మాట్లాడడం తప్పు. నేను వారికి జూనియర్‌ని. వారి వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకున్నవాడిని. వారు సభలో లీడర్‌గా ఉంటే, ఈ సభ సవ్యంగా, సజావుగా, ప్రశాంతంగా నడుస్తుందనే నమ్మకం నాకు ఉంది. ఆ విధంగా నేను భావి స్తున్నాను. వారు 14 సార్లు బడ్జట్‌ను ప్రవేశపెట్టారు. ఆ విషయం గిన్నీస్‌బుక్‌లో నమోదు కావాలని కూడా నేను భావిస్తున్నాను.

డా. జె. గీతారెడ్డి (సమాచార, జన సంభంధాల శాఖమంత్రి) ః అధ్యక్షా, నేను మంత్రులందరి తరఫున వారు ఒప్పుకుంటే మాట్లాడాలని అనుకుంటున్నాను. పెద్దలు గౌరవనీయులైన రోశయ్యగారు ఇక్కడ సభా నాయకులుగా నియమించబడడం చాలా చాలా సంతోషదాయకమైన విషయం. చాలా హర్షించదగ్గ విషయం. వారికన్నా ఆ స్థానానికి సరిపోయే నాయకులు ఎవరూ లేరు. వారి పేరు, ఆ స్థానానికి ఒక విధమైన ప్రిస్టేజ్‌ని తెచ్చిపెట్టింది. ప్రతిపక్ష పార్టీల వారు చక్కగా వారి గురించి వివరాలు చెబుతూ ఉంటే, కాంగ్రెస్‌పార్టీ సభ్యులుగా మేమంతా కూడా గర్విస్తున్నాము. అపారమైన అనుభవంతో, ఎన్నో సేవలు అందించిన వ్యక్తి వారు. ఈ రాష్ట్రంలో రోశయ్యగారు అంటే తెలియని వ్యక్తి ఉండరు. చిన్న బిడ్డ నుండి అందరికి వారు తెలుసు. ముఖ్యమంత్రిగారికి చేదోడువాదోడుగా ఉంటూ ఎన్నో ఆర్థిక సమస్యలు వచ్చినా ఆ సమస్యలన్నింటిని పరిష్కరిస్తూ ఈ రోజు మన రాష్ట్రం ముందంజలో ఉందంటే, రోశయ్యగారి పాత్ర ఉందని సభా ముఖంగా తెలియచేయదలచుకున్నాను.

రోశయ్యగారంటే నాకు రాజకీయంగానే కాదు. దాదాపు 25 సంవత్సరాల నుండి వ్యక్తిగత పరిచయం ఉంది. మా అమ్మగారి నుండి తెలుసు. మరొక విషయం సభలో తెలియదు. నేను గైనకాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నప్పటి నుండి వారు నాకు తెలుసు. నేను వారి కుటుంబానికి డాక్టర్‌గా ఉన్నాను. ఆ అదృష్టం నాకు దక్కింది. ఆ స్పెషల్ కనెక్షన్ నాకు వారితో ఉంది. వారి అమ్మాయిని, కోడలిని, భార్యను చూడడానికి వారు ఆసుపత్రికి వచ్చే వారు. వారు ఆసుపత్రి అంటే ఇష్టపడేవారు కాదు. ఆసుపత్రి అంటే, ఇంజక్షన్స్ అంటే నేను దూరంగా ఉంటాను అన్న వారి మాటలు నాకు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. నిజంగా పెద్దలందరూ చెప్పినట్లు ఆర్థిక శాఖామాత్యులుగా వారు రికార్డ్ సృష్టించారు. ఆర్థిక శాఖామాత్యులుగా వారి పేరు గిన్నీస్ బుక్‌లో ఎక్కాలని నేను కోరుకుంటున్నాను. మాలాంటివారికే కాకుండా, కొత్తగా యువకులు ఎంఎల్‌ఏలు కానీ, ఎంఎల్‌సీలు కానీ చాలా మంది వచ్చారు. ప్రతి ఒక్కరికి మీరు ఒక రోల్ మోడల్‌గా ఆదర్శంగా ఉన్నారు. He is a role model for all of us. కౌన్సిల్‌కి మళ్లీ వారు వచ్చారు. I can only request the Chairman you must try to write a book which will be useful for all the younger generations. We have received greatest contribution in the politics. I will share this happiness with everybody. Thank you very much for giving me this opportunity.

శ్రీ సిహెచ్. గంగాభవాని (పశ్చిమగోదావరి) : అధ్యక్షా, పెద్దలు, పూజ్యులు రోశయ్యగారిని అభినందించే అవకాశం కల్పించినందుకు అధ్యక్షులవారికి నమస్కారాలు తెలియచేస్తున్నాను. రోశయ్యగారు పెద్దలు, మాలాంటి కొత్త శాసన సభ సభ్యులకు, శాసన మండలి సభ్యులకు ఎన్‌సైక్లోపీడియా వంటి వారు. తప్పకుండా వారి అనుభవాలు, రాజకీయాల్లో హుందాతనం, విలువలు మొదలైనవి వారిని చూసి నేర్చుకోవాలి. వారు తప్పకుండా పుస్తకం వ్రాస్తే అది అందరికి బాగా ఉంటుంది. రాజశేఖరరెడ్డిగారుచేసే సంక్షేమ కార్యక్రమాలకు ఆర్థిక ప్రణాళిక చక్కగా రూపొందించి ఆయన పథకాలు విజయవంతం కావడానికి వెనక ఉండి నడిపించిన అపరచాణుక్యులు మీరు. మాఖియవెల్లి, చాణుక్యులు వీరిద్దరిని కలిపితే రోశయ్యగారు. ఆ విధంగా రోశయ్యగారు మనకు ఇక్కడ ఉన్నారు.

ఉ. 10.30

అధ్యక్షా, నిజంగా he is a proud son of Andhra Pradesh Sir. Not only Andhra Pradesh, I can say India. రోశయ్య గారు తప్పకుండా గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించకోవాలని మా అందరి ఆకాంక్ష. ప్రతిపక్ష నాయకులందరి మన్ననలు కూడా పొందారు. దాడి వీరభద్రరావు గారి లాంటి వారు కూడా దాడి చేయకుండా ప్రశంసల జల్లులు కురిపించడం చాలా ఆనందదాయకం. రాజకీయాలలో వున్నటువంటి మా లాంటి కొత్త తరంవారందరికి స్వపక్ష అభిమానాన్నే కాదు ప్రతిపక్ష పార్టీ సభ్యుల అభిమానాన్ని కూడా చూరగొనే విధంగా మా క్యారెక్టర్ వుండేటట్లు ఆదేశించడానికి వీలుగా ఒక పుస్తకం వ్రాస్తే బాగుంటుందని కోరుతూ ఈ అవకాశం కల్పించిన పెద్దలకు నా నమస్కారములు.

శ్రీ కొణిజేటి రోశయ్య: అధ్యక్షా, గౌరవ సభ్యులందరూ నా గురించి ఎంతో ప్రేమతో, అభిమానంతో నా వ్యవహార సరళి గురించి నాలుగు మంచి మాటలే చెప్పారు. నేను కూడా ఒక మనిషిని కాబట్టి కొన్ని కొన్ని సందర్భాలలో ఆవేశకావేశాలకు లోను కావడం జరిగింది. వాటి జోలికెళ్ళకుండా అందరూ మంచి మాటలే చెప్పినందులకు వారందరికి మనః పూర్వకంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

(సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, 1958 లో స్థాపించబడినటువంటి లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఒక ప్రత్యేకమైనటువంటి గౌరవం వుంది. ఎందరో మహనీయులైనటువంటి వ్యక్తులు దీనిలో సభ్యులుగా వున్నారు. 1968 లో శాసన మండలికి తొలిసారిగా సభ్యుడనయ్యాను. వరుస క్రమంలో స్వర్గీయ జూపూడి యజ్ఞనారాయణ గారు, పెద్దలు రాఘవాచారి గారు, సిక్కిం గవర్నర్‌గా పనిచేసి రిటైరయినటువంటి రామారావు గారు, మోటూరు హనుమంతరావు గారు, వై.వి. కృష్ణారావు గారు, సింగం బసవ పున్నయ్య గారు ఇంకా మరెందరితోనో కలసి పనిచేసేటటువంటి సద్భాగ్యం కలిగింది. శాసన మండలి సభ్యుడుగా ఎన్నికైన తొలి రోజుల్లో ఇప్పటి లాగే మొట్ట మొదట ఉ.8.30 లకు శాసన సభ ప్రారంభమయ్యేది. విజిటర్స్ గ్యాలరీలో ఎం.పిలకు, ఎం.ఎల్.సి లకు ఒక భాగముండేది. శాసనసభా సమావేశాలు జరిగేంతవరకు ప్రతిరోజూ విధిగా - మెంబర్లు ఎవ్వరైనా ఐదు నిమిషాలు లేట్‌గా వచ్చావారేమో నాకు తెలియదు కాని - నేను మాత్రం ఖచ్చితంగా ఉ. గం.8.30 లకు కుర్చీలో కూర్చొనేవాడిని. మామూలుగా ఎవ్వరైనా ఆ కుర్చీలో కూర్చోబోతే అది రోశయ్య గారి కుర్చీ అని అక్కడుండే వాళ్లు అనేవారు. అంటే అంత పంక్చువల్ గా కూర్చోనేవాడిని. పెద్దలు మాట్లాడుతున్నటువంటి తీరుతెన్నులు, వాదప్రతివాదాలు గమనించేవాడిని. ప్రతిపక్ష పార్టీ నాయకులైన స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య గారు, తరిమెళ్ళ నాగిరెడ్డి గారు, తెన్నేటి విశ్వనాథం గారు, గౌతు లచ్చన్న గారు, వావిలాల గోపాలకృష్ణయ్య గారు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గారు ఇంకా చాలా మంది హేమాహేమీలు మాట్లాడుతున్న తీరును గమనించేవాడిని. సంజీవ్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు వారి సమాధానాలు విన్నాను. బ్రహ్మానంద రెడ్డి గారి చతురతతో కూడిన సమాధానాలు వింటుండే వాడిని. ఆనాడు సభ్యుల ప్రసంగాలు ఎంతగానో ఆకట్టుకునేవి. అక్కడి నుండి ఉ. 10.00 గంటలకు ముందు వీలైతే ఒక ఐదు నిమిషాలు లైబ్రరీలో కూర్చోనే వాడిని. ఇప్పుడున్న చాలా మంది సభ్యులకు లైబ్రరీ ఎక్కడుందో కూడా తెలియదు. పాత రోజుల్లో పైన చెప్పిన మహానాయకులందరూ క్వశ్చన్ అవర్ కాగానే ఖచ్చితంగా లైబ్రరీకి వెళ్ళి కూర్చోనేవారు. నాలాంటి యువకులు వాళ్ల ప్రక్కన కుర్చీ ఖాళీ వున్నా కూడా కూర్చోవడానికి సాహసం చేసే వాళ్లం కాదు. వాళ్లు లేచి బయటకు వెళ్ళేంత వరకు కూడా వేచి చూచేవాళ్లం. అంత పెద్ద ఎత్తున అధ్యయనం చేసే వారు. వాళ్లను చూచి నాలుగు మాటలు మాట్లాడడం నేర్చుకున్నాను. అంతకు తప్ప నాలో ప్రత్యేకత ఏమీ లేదు. శాసనమండలి మొట్టమొదట ఎలా వుండేదో తమకు కూడా తెలుసు. మీరూ, కేశవరావు గారు చాలా మంది ఇక్కడ సభ్యులుగా పనిచేసినటువంటి వారే. 1968 లో అందరం చేరేంతవరకు కూడా శాసన మండలి ఉపాధ్యాయ ప్రతినిధులకే పరిమితమై వుండేది. శాసనమండలి అంటే టీచర్స్ రిప్రజెంటేటివ్స్‌కు సంబంధించిన హౌస్ అని మాత్రమే ప్రజలు అనుకొనే వారు. క్రమక్రమంగా ప్రజలందరి సమస్యలను ప్రస్తావించేటటువంటి ఒక స్వరూపాన్ని సంతరించుకుంది. కొన్ని కొన్ని సందర్భాలలో ప్రభుత్వం ప్రవేశ పెట్టినటువంటి బిల్లులను శాసనసభలో త్వరత్వరగా ఆమోదించేవారు. అంత జాగ్రత్తగా పరిశీలన జరిగేది కాదక్కడ. ఒకటి, రెండు బిల్లులు ఇక్కడకు వచ్చిన తరువాత తప్పులను చూచి ఎత్తి చూపించి మరల క్రిందకు పంపితే శాసనసభ పునరాలోచించి తప్పులను సవరించుకొని అంగీకరించినటువంటి రోజులు నాకు గుర్తున్నాయి.

అధ్యక్షా, అప్పర్ హౌస్ ఎందుకనే వాదన కూడా ఒకటి ఉన్నది. భారత దేశ స్థాయిలో లోక్‌సభ, రాజ్యసభ అనే రెండు సభలున్నట్లే, 294 మంది శాసనసభ సభ్యులను కలిగినటువంటి మన రాష్ట్రంలో కూడా అప్పర్ హౌస్ వుండాలని మొట్టమొదటి నుండి నాకు వ్యక్తి గత అభిప్రాయం వుంది. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆదే అభిప్రాయముంది. 1985 వ సంవత్సరంలో ఏ పరిస్థితుల్లో శాసన మండలి రద్దు అయిందో మనందరికి తెలుసు. తరువాత మరల శాసన మండలిని పునరుద్ధరించాలన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టో ప్రకారం

దానిని అమలుపరచడానికి ప్రయత్నం మొదలుపెట్టి ఎట్టకేలకు రాజశేఖర రెడ్డి గారి ప్రత్యేక శ్రద్ధతో కేంద్ర ప్రభుత్వం యొక్క ఆమోద ముద్ర వేయించడం ద్వారా ఇది సాధ్యమైంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

రెండు సంవత్సరాల క్రితం మరల శాసన మండలి పునరుద్ధరణ జరగడం, ఫస్ట్ బ్యాచ్‌లో లాటరీ ద్వారా రెండు సంవత్సరాలు సర్వీసు చేసిన వారు రిటైరవ్వడం మరల కొత్తవారు రావడం వంటి అనుభవాలున్నాయి. శాసనసభలో కాని, శాసన మండలిలో కాని ప్రతి ఒక్క సభ్యుడు గమనించాల్సింది ఏమిటంటే ఈయన పొట్టిగా వున్నారా పొడవుగా వున్నారా అనేది కాకుండా వారు మాట్లాడేటటువంటి మాటల్లో వున్న ప్రాధాన్యతను గుర్తిస్తుంటే నా లాంటి వారికి విజ్ఞానం పెరుగుతోంది. నేను ఆ విధంగా నేర్చుకున్న వాడినే. ఇటీవల కాలంలో శాసనమండలికి తగినంత ప్రాచుర్యం, ప్రాధాన్యత మీడియా ఇవ్వడం లేదని నిన్న, మొన్న మాట్లాడిన గౌరవ సభ్యులు ఒక మాట అన్నారు. బహుశా ఈ విషయాన్ని మీడియా నోట్ చేసుకోవడం వల్లనేమో ఈ రోజు మీడియాలో మొన్నటి కంటె నిన్నటి రోజున ఎక్కువ స్పేస్ కనపడుతోంది. ఏమైనా, మనం ఇక్కడ జరిపే చర్చల తీరును బట్టి వార్తలకు ప్రాధాన్యత వస్తుంది. తప్పకుండా ఇక్కడ మంచి హై స్టాండర్డులో డిస్కషన్ జరుగుతుందని భావిస్తున్నాను. కొన్ని సమస్యల మీద విభేదాలు వస్తుంటాయి. అలా విభేదించకుండా వుంటే ప్రజాస్వామ్య విలువలకే అర్థం లేదు. విభేదాలు అంతవరకే పరిమితంగా వుండాలని నా భావన. నేను చిన్నప్పటి నుండి అనుకరించేది అదే. రాజకీయాలలో ఒక వాదానికి నేను ప్రతినిధిగా వున్నాను. వీరభద్రరావు మరొక వాదానికి ప్రతినిధిగా వున్నారు. సీతారాములు గారు ఇంకొక వాదానికి ప్రతినిధిగా వున్నారు. ఏదైనా సందర్భం వచ్చినప్పుడు నేను మాట్లాడినా, వారు మాట్లాడినా అది అంత వరకే పరిమితం కావాలి. వ్యక్తిగతంగా పొలం గట్ల దగ్గర తగాదా కాని, ఆస్థి పంపకాల దగ్గర తగదా కాని, పిల్లనిచ్చి పుచ్చుకోవడంలో తగాదా కాని ఏమీ లేవు కాబట్టి రాజకీయపరమైన విభేదాలు రాజకీయాల వరకే పరిమితమై వుండాలి తప్ప అవి శతృత్వంగా మారకూడదని నా అభిమతం. కాబట్టి, మా వాళ్ళు ఎంత స్నేహితులో ప్రతిపక్ష సభ్యులు కూడా అంతే స్నేహితులు. ఏమైనా, రాబోయే రోజుల్లో సభ్యులందరి సహకారంతో అందరు అభిలషిస్తున్నట్లే తాము కూడా ఆశిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి గౌరవాన్ని పెంచుకునే విధంగా ప్రయత్నం చేద్దామనే మాటను మనవి చేస్తూ, మీరందరు నా పట్ల చూపిన అభిమానానికి, చెప్పిన మంచి మాటలకు మరొకసారి కృతజ్ఞతలు చెపుతూ సభ్యులు ఆశించిన స్థాయికి పెరిగేదానికి ప్రయత్నం చేస్తాను.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఉ. 10.40

డా. కె. నాగేశ్వర్ (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు) : అధ్యక్షా, రోశయ్యగారి గురించి గంగాభవాని గారు అభిమానంతో మాట్లాడుతూ ఆయనను మాఖియవెల్లి తో పోల్చారు. దయచేసి దానిని రికార్డులనుండి తొలగించవలసిందిగా కోరుతున్నాను. ఎందుకంటే ఆయన క్రూడ్ పాలిటిక్స్‌కు ప్రతినిధి.

(శ్రీమతి సి.హెచ్. గంగాభవాని నుంచి అంతరాయం)

MR. CHAIRMAN: No discussion on this. Ganga Bhavani garu please take your seat. సభ్యులందరి తరపున మరొక్కసారి పెద్దలు రోశయ్యగారిని అభినందిస్తున్నాము. ప్రత్యేకించి

గౌరవనీయులు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు ఈ నిర్ణయం చేసినందుకు వారికి ప్రత్యేకంగా సభ తరఫున అభినందనలు తెలియచేస్తున్నాము.

(సభ్యులందరూ బల్లలు చరిచి తమ తమ హర్షధ్వానాలు వ్యక్తం చేశారు)

MR. CHAIRMAN: All the papers are deemed to have been laid on the Table of the House.

**సభా సమక్షంలో ఉంచిన పత్రము**

A copy of the 39th Annual Report of the Andhra Pradesh State Agro Industries Development Corporation Limited for the year ended 31st March, 2008, as required under Section 619-A (2) of the Companies Act, 1956.

**సంతాప ప్రతిపాదన**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్తు మాజీ సభ్యులు శ్రీ రావు వేంకట గోపాల కృష్ణ రంగారావు గారి మృతి పట్ల సంతాప తీర్మానం**

మిస్టర్ ఛైర్మెన్ : "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్తు మాజీ సభ్యులు శ్రీ రావు వేంకట గోపాలకృష్ణ రంగారావు గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది."

శ్రీ రావు వేంకట గోపాల కృష్ణ రంగారావు గారు 1926 అగష్టు 8 తేదీన విజయనగరం జిల్లాలో జన్మించారు. వీరు విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నియోజక వర్గం నుండి 1962-1967 సంవత్సరంలో పార్లమెంట్ సభ్యునిగా ప్రాతినిధ్యం వహించారు. వీరు 1974-1980 సంవత్సరములలో స్థానిక సంస్థల నుండి శాసన పరిషత్తు సభ్యునిగా ఎన్నికైనారు. వీరు వ్యవసాయ రంగానికి మరియు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు.

వీరు 2009 సంవత్సరము మే 19 వ తేదీన మరణించారు. వీరి వయస్సు 82 సంవత్సరములు.

వీరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిముషాల పాటు మౌనం పాటిద్దాము.

(గౌరవ సభ్యులందరూ తమ తమ స్థానాలలో నిలబడి రెండు నిముషాలపాటు మౌనం పాటించారు.)

**సభా కార్యక్రమము**

**కొత్త మంత్రుల, కొత్త సభ్యుల స్వపరిచయ కార్యక్రమము (కొనసాగింపు)**

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, నిన్న ఇక్కడ 'బి' గ్రూపు వారున్నారు. ఇవాళ 'ఏ' గ్రూపు వారున్నారు. ఒక్కళ్లు మినహా మిగతావారంతా కొత్తవారు ఉన్నారు కనుక కొత్త మంత్రుల స్వీయ పరిచయ కార్యక్రమం కొనసాగించవలసిందిగా ఛైర్మన్ గారి అనుమతి కోరుతున్నాను.

(అనంతరం ఛైర్మన్ అనుమతితో నూతన మంత్రుల కొత్త మంత్రుల స్వీయ పరిచయ కార్యక్రమం కొనసాగింది.)

శ్రీ జూపల్లి కృష్ణారావు (ఆహార, పౌర సరఫరాల శాఖమంత్రి) : అధ్యక్షా, మహబూబ్‌నగర్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాను. పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రిగా రాజశేఖర రెడ్డిగారు తమ మంత్రివర్గంలో అవకాశమిచ్చారు. అందుకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీ మహ్మద్ అహ్మదుల్లా సయిద్ (అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖమంత్రి) :అందరికీ నమస్కారం. కడప నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాను. మైనారిటీ వెల్ఫేర్ మరియు సర్వశిక్షా అభియాన్ మంత్రిగా ఉన్నాను.

శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి (ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ శాఖమంత్రి) : అందరికీ నమస్కారం. నల్గొండ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాను. నేను గౌరవ ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖరరెడ్డిగారి మంత్రివర్గంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మినిష్టరుగా ఉన్నాను.

శ్రీ దానం నాగేందర్ (ఆరోగ్య శాఖమంత్రి) : అందరికీ నమస్కారం. నేను ఖైరతాబాదు నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాను. ప్రస్తుత మంత్రివర్గంలో హెల్త్ మినిష్టరుగా ఉన్నాను.

శ్రీ డి. శ్రీధర్‌బాబు (ఉన్నత విద్యా శాఖమంత్రి) : ఛైర్మన్ గారికి, ప్రత్యేకించి ఇంతకు పూర్వమే శాసన మండలి సభా నాయకునిగా ఎన్నికైన పూజ్యులు రోశయ్య గారికి, గౌరవ శాసన మండలి సభ్యులందరికీ నమస్కారములు. నేను మంథని నుండి శాసనసభకు మూడవ సారి ఎన్నికయ్యాను. ప్రస్తుత మంత్రివర్గంలో హయ్యర్ ఎడ్యుకేషన్ మరియు ఎన్ఆర్ఐ సర్వీసులకు మంత్రిగా బాధ్యత తీసుకునే అవకాశం కల్పించారు గౌరవ ముఖ్యమంత్రిగారు. మీ అందరి సహకారం కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

డా. జె. గీతారెడ్డి (సమాచార జన సంబంధాల శాఖమంత్రి) : అందరికీ నమస్కారములు. జహీరాబాద్ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు నాకు ఐ అండ్ పి ఆర్ శాఖను మరియు టూరిజం శాఖను కేటాయించారు.

శ్రీమతి డి. కె. అరుణ (చిన్న తరహా పరిశ్రమల శాఖమంత్రి) : అందరికీ నమస్కారం. నేను మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రెండవసారి ఎమ్ఎల్ఏగా ఎన్నికయ్యాను. స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్, షుగర్, ఖాదీ మరియు విలేజ్ ఇండస్ట్రీస్ మినిష్టరుగా ఉన్నాను.

శ్రీమతి వి. సునీతా లక్ష్మారెడ్డి (మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి) : గౌరవ సభ్యులందరికి హృదయపూర్వక నమస్కారాలు. నేను నరసాపూర్ నియోజక వర్గం నుండి మూడవసారి శాసనసభకు ఎన్నికయ్యాను. మైనర్ ఇరిగేషన్ శాఖా మంత్రిత్వ బాధ్యతలు గౌరవ ముఖ్యమంత్రిగారు నాకు అప్పగించడం జరిగింది. మీ అందరి సహకారం కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి (హోం శాఖమంత్రి) : సభకు నమస్కారము. గతంలో చేవెళ్ల నియోజకవర్గంకు ప్రాతినిధ్యం వహించిన నేను మొదటిసారిగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం నుండి పోటీచేసి శాసనసభకు ఎన్నికయ్యాను. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఒక మహిళకు హోంశాఖను ఇచ్చిన గౌరవ ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖరరెడ్డి గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. హోంశాఖ మగవారికి కూడా ఒక సవాల్‌గా ఉంటుంది. అటువంటి శాఖను గౌరవ ముఖ్యమంత్రిగారు మహిళల యొక్క శక్తి సామర్థ్యాల మీద నమ్మకం ఉంచి ఇచ్చినందుకు ఈనాడు మన రాష్ట్రంలో మహిళలకు ఎంతో గౌరవం పెరిగింది. ఈ శాఖను సమర్థవంతంగా నిర్వహించేందుకు గౌరవ సభ్యులందరి సహాయసహకారాలు కోరుకుంటూ నమస్కారాలు.

శ్రీ పి. సుదర్శన్ రెడ్డి (వైద్య విద్యా శాఖమంత్రి) : గౌరవనీయులు ఛైర్మన్ గారికి, పెద్దలు రోశయ్య గారికి సభ్యులందరికీ నమస్కారములు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం నుండి మూడవసారి ఎమ్‌ఎల్‌ఏగా ఎన్నికయ్యాను. ముఖ్యమంత్రిగారు నాకు వైద్య విద్య శాఖను కేటాయించారు. నేను నా శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెబుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బాలినేని శ్రీనివాసరెడ్డి (గనుల శాఖమంత్రి) : పూజ్యులు ఛైర్మన్‌గారికి, పెద్దలు, సభానాయకులు రోశయ్యగారికి, గౌరవ శాసనమండలి సభ్యులందరికీ నా నమస్కారములు. నేను ఒంగోలు నియోజకవర్గం నుండి మూడవసారి శాసనసభకు ఎన్నిక కావడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రిగారు భూగర్భ, గనులు, చేనేత మరియు జౌళి శాఖా బాధ్యతను నాకు ఇవ్వడం జరిగింది. వారికి నా ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

శ్రీ పితాని సత్యనారాయణ (ఆరోగ్య శ్రీ, వైద్య మౌలిక సదుపాయాల శాఖ మంత్రి) : గౌరవ ఛైర్మన్ గారికి నమస్కారములు. శాసనమండలి సభ్యులందరికీ శుభాభినందనలు. ఆచంట నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాను. గౌరవ ముఖ్యమంత్రిగారు నాకు ఆరోగ్యశ్రీ, ఆరోగ్యబీమా, 104,108 సేవలు, వైద్య మౌలిక సదుపాయాల శాఖా బాధ్యతలు అప్పగించారు. అందుకు వారికి నా ధన్యవాదాలు. ఈ రాష్ట్ర ప్రజలయొక్క ఆరోగ్యాన్ని మరింత జాగ్రత్తగా కాపాడడానికి గౌరవ సభ్యుల సలహాలను సూచనలు పాటించి, నాకు అప్పగించిన శాఖకు వన్నె తెస్తానని చెబుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ (భారీ పరిశ్రమల శాఖమంత్రి) : గౌరవ ఛైర్మన్‌గారికి, పెద్దలు రోశయ్య గారికి, గౌరవ శాసనమండలి సభ్యులందరికీ నమస్కారం. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి ఎన్నికైన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు నాకు భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పజెప్పారు. గౌరవ శాసనమండలి సభ్యులందరి సహకారం కోరుకుంటూ, ముఖ్యమంత్రిగారికి మరొక్కసారి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

శ్రీ పొన్నాల లక్ష్మయ్య (భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖమంత్రి) : గౌరవ సభాధ్యక్షులకు, సభ్యులకు నమస్కారాలు. జనగాం నియోజకవర్గం నుండి ఎన్నికైన నేను భారీ, మధ్యతరహా నీటిపారుదల శాఖను నిర్వహిస్తూ మీ అందరి సహకారం, సూచనలు తీసుకుని నా విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడానికి ప్రయత్నిస్తానని తెలియచేసుకుంటున్నాను.

శ్రీ గాదె వెంకటరెడ్డి (దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి) : గౌరవ అధ్యక్షులవారికి, శాసన మండలి సభ్యులందరికీ నమస్కారం. నేను గతంలో ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం నుండి మూడుసార్లు శాసనసభకు ఎన్నిక కావడం జరిగింది. ఆ సమయంలోనే శ్రీ విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాను. 2004 వ సంవత్సరంలో బాపట్ల నియోజకవర్గం నుండి పోటీ చేయవలసిందిగా పార్టీ అధిష్టానం నన్ను ఆదేశించడం జరిగింది. ఇప్పుడు కూడా అదే నియోజకవర్గం నుండి పోటీచేసి శాసనసభ్యునిగా గెలుపొందిన నాకు గౌరవ ముఖ్యమంత్రిగారు దేవాదాయ, ధర్మాదాయ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ బాధ్యతలు అప్పగించారు. నాకు అప్పగించిన శాఖను సమర్థవంతంగా నిర్వహించడానికి గౌరవ సభ్యులందరి సలహాలు, సహకారం అందించవలసిందిగా కోరుతున్నాను.

ఉ. 10.50

శ్రీ ధర్మాన ప్రసాదరావు (రెవిన్యూ శాఖమంత్రి) : గౌరవ ఛైర్మన్ గారికి, సహచరులైనటువంటి సభ్యులకు నమస్కారములు. నేను శ్రీకాకుళం జిల్లా నుంచి శాసన సభకు తిరిగి ఎన్నికయ్యాను. గతంలో రెవెన్యూ బాధ్యతలు నిర్వర్తించినప్పుడు మీ అందరికీ సుపరిచితుడినే. రెండవసారి రెవెన్యూ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం నాకు లభించింది. మీ అందరినీ నేను కలుసుకోవడం సంతోషం. ధన్యవాదములు.

శ్రీ డి. మాణిక్య వరప్రసాదరావు (మాధ్యమిక విద్యా శాఖమంత్రి) : సభకు నమస్కారములు. గుంటూరు జిల్లా తాడికొండ నియోజక వర్గం నుంచి రెండవసారి ఎన్నికయ్యాను. పాఠశాలలలో మాధ్యమిక విద్యాశాఖా మంత్రిగా అనగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాధ్యతలు నిర్వర్తించే అవకాశం నాకు లభించింది. ధన్యవాదములు.

<u>గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ (కొనసాగింపు)</u>

శ్రీ చేరుపల్లి సీతారాములు : అధ్యక్షా, ఈ రోజు ఐదు సంవత్సరములు దాటిన తరువాత మళ్ళీ క్రొత్త ప్రభుత్వం వచ్చినటువంటి సందర్భములో మన కౌన్సిల్ సమావేశాలు నడుస్తున్నాయి. క్రొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నాము. అదేవిధంగా మా పార్టీ వైపు నుంచి నిర్మాణాత్మకమైనటువంటి పాత్ర, సద్విమర్శలు చేయడానికి ప్రయత్నం చేస్తాము. గతంలో కూడా సద్విమర్శలు చేశాము. దురదృష్టం ఏమిటంటే సద్విమర్శలను కూడా ఇంకొక రకంగా అర్థం చేసుకోవడం వలన ఇబ్బందులు వచ్చాయి. ఏది ఏమైనా సద్విమర్శలను పరిశీలించవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యంగా గవర్నరుగారి ప్రసంగంలో ప్రభుత్వ కొనసాగింపు, సుస్థిరత, పనితీరుకోసం నిర్ణయాత్మకంగా ఓటు చేయడంలోను, అన్ని రకాల ప్రలోభాలను, వేర్పాటు వాద, వ్యతిరేక వాద రాజకీయాలు సంపూర్ణంగా నిరాకరించటంలోను సామాన్య ప్రజలకు సంబంధించినటువంటి అంశం. సంపూర్ణం అనే పదం కరెక్టు కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ప్రభుత్వం ఐదు సంవత్సరముల పరిపాలన తరువాత ప్రజల దగ్గరకు పోవడం అనేది జరిగింది. ప్రజల దగ్గర ఓటింగ్, సీట్లు దానికి సంబంధించిన విషయాలు అన్నీ కూడా నిన్న సభలో మాట్లాడిన పెద్దలు చాలా విషయాలు చెప్పారు. నేను దానిజోలికి పోదలచుకోలేదు. కానీ ముఖ్యమంత్రిగారి మాటలు మాత్రం చాలా ఆత్మవిమర్శనా పద్ధతిలో ఉన్నాయని నేను భావిస్తున్నాను. వారు మాట్లాడేటప్పుడు చెప్పారు 14 మంది మంత్రులు ఓడిపోయారు. ఇది చిన్న విషయం కాదు, ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం ఉన్నదని. అదేవిధంగా కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్నప్పుడు కూడా చెప్పారు మన పనితీరు, నిర్వహణ సక్రమంగా ఉండి ఉంటే, ఇంకా మంచి

ఫలితాలు వచ్చేవి, ఆ లోపాన్ని మీరు పరిశీలించవలసిన అవసరం ఉన్నదని స్పష్టంగా మాట్లాడడం జరిగింది. 'ఎదిగిన కొద్దీ ఒదగమని' అనేటటువంటి మాటలు చాలా ఉపయోగకరమైనటువంటివి. అందరూ ఆచరించవలసినటువంటి విషయం. అయితే మాటలలో కాకుండా చేతలలో ఋజువు చెయ్యవలసిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. గవర్నరుగారి ప్రసంగంలో వ్రాసుకున్నదానికి, ముఖ్యమంత్రిగారు మాట్లాడిన దానికి డిఫరెన్స్ కనపడుతున్నది. నా అభిప్రాయం ఏమిటంటే గవర్నరుగారి ప్రసంగం మరింత ఆత్మ విమర్శనా పద్ధతిలో ఉండి ఉంటే బాగుండేది. ఉన్నది ఉన్నట్లుగా చెప్పుకోవడానికి అవకాశం ఉండేదని నేను అభిప్రాయపడుతున్నాను. అదేవిదంగా ఇందులో కొన్ని ముఖ్యమైనటువంటి విషయాలు ప్రస్థావించలేదు.

అవినీతికి సంబంధించిన విషయానికి వస్తే – గతంలో అవినీతి గురించి చర్చోపచర్చలు జరిగినాయి. ఇప్పుడు ముఖ్యమంత్రిగారు అంటున్నారు. ఏసీబీ దాడులు ధైర్యంగా చెయ్యండి, ఎంతటివారికైనా వదిలిపెట్టకండి అని. చాలా సంతోషం. ఆ పని చేయవలసిన అవసరం ఉంది. గవర్నరుగారి ప్రసంగంలో అవినీతి ప్రస్థావన ఎక్కడా లేదు, దానిని కూడా నేను లోపంగా భావిస్తున్నాను. ఏసీబీ దాడులు అధికారుల వరకే పరిమితమౌతున్నాయేమోనని అనిపిస్తున్నది. మంత్రులు, మాజీ మంత్రులు, ఛైర్మన్లు, అక్రమ వ్యాపారుల మీద ఏసీబీ దాడులు ఎందుకు చేయకూడదు? అక్రమ సంపాదన కలిగినటువంటి వారి మీద ఇలాంటి దాడులని చేయవలసిన అవసరం ఉన్నది. అవినీతిని అరికట్టవలసిన అవసరం ఉంది. ఆ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలి.

స్థానిక సంస్థలకి నిధులు, అధికారాల గురించి – ఇది చాలా మేజర్ ఇష్యూ. చాలా సందర్భాలలో చర్చలు జరిగాయి. బదలాయింపు చేస్తామన్నారు. కానీ అది అన్ని శాఖలకి బదలాయింపు జరగలేదు. కానీ ఈ ప్రసంగంలో స్థానిక సంస్థల నిధులు, అధికారాల ప్రస్థావన లేకపోవడం బాధాకరమైన విషయం. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి స్థానిక సంస్థల అధికారాలమీద, నిధుల మీద ఆధారపడి ఉన్నది. ఆ విషయం కూడా ప్రస్తావించలేదు.

కోనేరు రంగారావుగారి సిఫారసుల గురించి – భూ పంపిణీకి సంబంధించినటువంటి అంశాలు. ఆ ప్రస్తావన లేదు. భూ పంపిణీ చేయదలచుకున్నారా లేదా? దానికి సంబంధించిన విషయాలు తెలియజేవలసిన అవసరం ఉన్నది.

ఎన్నికల సంస్కరణల గురించి – ఎన్నికలు ఎంత దారుణమంటే మామూలు వాళ్లు నిలబడి పోటీ చేయగలిగేటటువంటి పరిస్థితులు లేవు. బహుశా రోశయ్యగారు 'ఈ కంపు ఎందుకురా నాయనా' అనుకోక మన కౌన్సిల్‌కు రావడం మన అదృష్టం. మామూలు వాళ్లు నిలబడి గెలిచే పరిస్థితి లేదు. ఇక సామాజిక న్యాయానికి అర్థమే లేకుండా పోయేటటువంటి పరిస్థితి ఉన్నది అధ్యక్ష. ఎంతో కీలకమైనటువంటి ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావించలేదు. ఇప్పటికైనా ప్రస్తావించవలసిన అవసరం, దాని గురించి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. లేకపోతే మన ప్రజాస్వామ్యానికే అర్థం లేనటువంటి పరిస్థితి అగుపడుతున్నది. కావున ఈ అంశాన్ని కూడా ప్రస్తావించవలసిందిగా కోరుతున్నాను.

ప్రాంతీయ బోర్డుల విషయానికి వస్తే – ఆంధ్ర రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరగాలంటే, ప్రాంతీయ బోర్డులు అవసరమని అనుకున్నాము, వేశారు. అసలు ఆ ప్రస్తావన లేదు. అవి ఉన్నాయా, పోయినాయా, దాని సంగతి

తెలియదు. పురుషోత్తమరెడ్డిగారు ప్రాంతీయ బోర్డు తెలంగాణ పెట్టారు. ఇప్పుడు ఆ బోర్డే పీకేశారు. అసలు ఇప్పుడు ఆ పదాలే తీసివేశారు. దీనికి సంబంధించినటువంటి విషయాలు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

సెజ్‌ల విషయానికి వస్తే – కొన్ని లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రాజెక్టులకోసంగాని, సెజ్‌లకు గాని. నిర్వాసితులకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావన లేదు. దాని ప్యాకేజీ, సక్రమంగా అమలుచేస్తారా లేదా ఆ విషయాన్ని కూడా ప్రస్తావించలేదు. ఈ విషయాన్ని కూడా ప్రస్తావించాలని కోరుతున్నాను.

అదే విధంగా ఉద్యోగులకు సంబంధించినటువంటి పీఆర్‌సిల గురించి – ఏకీకృత సర్వీసులకు సంబంధించిన విషయం కూడా ప్రస్తావించలేదు. చాలా ముఖ్యమైన విషయం.

ఉ. 11. 00

ఎన్నికల్లో పెద్ద చర్చలు జరిగిన అంశాలు ఇవి. అదే విధంగా ఎస్సీ వర్గీకరణ. ఈ అంశాన్ని ఎప్పుడూ ఎన్నికల్లో వాడుకోవడం, ఆ తర్వాత వదిలివేయడం జరుగుతోంది. దళితుల యొక్క వర్గాల మధ్యనే చిక్కులు తెచ్చి రాజకీయాలకు ఉపయోగించుకునే పరిస్థితి. ఆ సమస్య పరిష్కారం కావాలి. ఉభయులకు న్యాయం జరిగే విధంగా ఒక న్యాయమైన పద్ధతిలో అది పరిష్కారం అయితే మంచిది. లేకపోతే అట్లాగే నాన్చుకుంటూ పోతే, మన రాష్ట్రానికి, దేశానికి మంచిది కాదు. దాని గురించి కూడా గవర్నరుగారి ప్రసంగంలో ప్రస్థావన లేదు. అదే విధంగా అనేక చేతి వృత్తులకు చెందిన కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆకలి చావులకు గురవుతున్నారు. వారికి సంబంధించి చాలా సమస్యలున్నాయి. ఆ విషయం కూడా ఇందులో ప్రస్థావించలేదు. దాన్ని గురించి ప్రస్థావించవలసిన అవసరం ఉంది. అదే విధంగా ప్రపంచ బ్యాంకు విధానాలు. నాగార్జునసాగర్ ప్రాజక్టు కాలువను ఆధునీకరించడం కోసం ప్రపంచ బ్యాంకు వాళ్ల దగ్గర అప్పు తీసుకుని రావడానికి ప్రయత్నిస్తున్నారు. వారు కొన్ని కండిషన్స్ పెట్టారు. నీటిపారుదలకు మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇది చాల డేంజర్. ఇదివరకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇటువంటి ప్రతిపాదన వస్తే తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. అసలు ప్రపంచ బ్యాంకు విధానాల్ని అమలు చేయడానికి ఈ ప్రభుత్వం ఒప్పుకున్నదా? ఒప్పుకుంటే మాత్రం మన రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలుగుతుంది. ఈ విషయాల గురించి కూడా గవర్నరుగారి ప్రసంగంలో ప్రస్థావన లేదు.....

మిస్టర్ ఛైర్మన్ : నిన్న ప్రెస్‌లో వచ్చింది. దాన్ని ఖండిస్తూ వార్త వచ్చింది..

శ్రీ చేరుపల్లి సీతారాములు : వేరే అంశం గురించి వచ్చింది. నేను చెప్పిన దాని గురించి కాదు.

అదే విధంగా మన రాష్ట్ర పరిపాలనా సామర్థ్యం అసాధారణంగా ఉందని చెప్పారు. కాని మొన్న ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ మన నిర్వహణ తీరు లోపభూయిష్టంగా ఉందని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చెప్పడం జరిగింది. ఒకవైపేమో అసాధారణం అంటున్నారు, మరో పక్క లోపభూయిష్టం అంటున్నారు. ముఖ్యమంత్రిగారే స్వయంగా కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ సరిగా పని చేయాలని అధికారుల్ని

హెచ్చరించడం జరిగింది. ఈ విధంగా ఇది ఎంత అసాధారణమైన తీరు అని చెప్పడంలో అతిశయోక్తి లేదని నేను భావిస్తున్నాను. ఇటువంటి కొన్ని ఆత్మవిమర్శ పద్ధతులు అవలంభిస్తే మంచిదని నాకు ఉన్న అభిప్రాయం.

ఇక ఆహార ధాన్యాల ఉత్పత్తికి సంబంధించి లెక్కలు ఇచ్చారు. 2007-08 సంవత్సరంలో 198.17 లక్షల టన్నులు అని ఉంటే, 2008-09 లో 199 లక్షల టన్నులకు చేరుకున్నది అన్నారు. కాని Social and Economic Surveyలో 2008-09లో 179.01 లక్షల టన్నులు అని ఉంది. ఆ రిపోర్టులను మనకు ఇదివరకే సప్లయ్ చేయడమయింది. కాని గవర్నరుగారి ప్రసంగంలో 199 లక్షల టన్నులు అని ఉంది. అంటే ఇక్కడ మనకు తేడా కనిపిస్తోంది. నా ఇంకొక అభిప్రాయం ఏమిటంటే, 2007-08 కన్నా, 2008-09 సంవత్సరంలో నీటిపారుదల ప్రాజక్టులు ఎక్కువయ్యాయి, నీటిపారుదల ఎక్కువయింది. సేద్యం ఎక్కువైందని చెప్పారు. మరి ఎందుకు ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గింది? దానికి కారణం ఏమిటి?..

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, డేటాలో తేడాలున్న మాట వాస్తవం. ఒకటే కారణం. ఎస్టిమేట్స్ అనేవి రకరకాలుగా ఉంటాయి. అడ్వాన్స్ ఎస్టిమేట్స్ అని, క్విక్ ఎస్టిమేట్స్ అని, ఫైనల్ ఎస్టిమేట్స్ అని ఉంటాయి. ఆ విధంగా డేటాను కలెక్టు చేయడంలో రకరకాల పద్ధతులుంటాయి. గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు చెందిన స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ ఇచ్చే డేటాకు, మన రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన డిపార్టుమెంట్ ఇచ్చే డేటాకు చాలా సందర్భాల్లో వ్యత్యాసాలు వస్తుంటాయి. మీరు అన్న మాట వాస్తవం, ప్రొడక్షన్ పెరిగింది తప్ప తగ్గలేదు. రెండవది, ఇవేళ మార్కెట్లో ధాన్యాన్ని కొనడం లేదంటున్నారు. మనకు ఉన్న పరిస్థితులు ఏమిటంటే, ధాన్యాన్ని రైతుల దగ్గర నుండి మిల్లర్లు కొనాలి. లేకపోతే ఎఫ్.సి.ఐ. కొనుగోలు చేయాలి. లేకపోతే మార్క్ఫెడ్ కొనుగోలు చేయాలి. ఐ.కె.పి. కొనాలి. ఎవరో ఒకరు కొనాలి. కొని వారు ఎక్కడ పెట్టుకోవాలి? వారు ధాన్యాన్ని బియ్యంగా కన్వర్ట్ చేసుకోవాలి. ఎఫ్సిఐ వారు మనకు ఇచ్చిన టార్గెట్ అయిపోంది. ఇక మేము మీ దగ్గర కొనమన్నారు. అయితే మొన్ననే ముఖ్యమంత్రిగారు, మంత్రి కృష్ణారావుగారు అధికారులతో సమావేశమై, కేంద్ర ప్రభుత్వం దగ్గరకు వెళ్లి మరో పది లక్షల టన్నుల ధాన్యాన్ని లెవీ కింద తీసుకోమని అడిగారు. వారు ఏడు లక్షల టన్నులు తీసుకుంటామన్నారు. అయితే ఇప్పుడు ఇక్కడ గోదాముల స్పేస్ సమస్య ఉంది. కాబట్టి ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గిందనే మాట కరెక్టు కాదు. అంకెల్లో తేడాలుండొచ్చు. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా.

శ్రీ చేరుపల్లి సీతారాములు : అదే విధంగా, ఈ రాష్ట్రంలో ప్రజలపై గత అయిదు సంవత్సరాలుగా ఎటువంటి పన్నులు విధించలేదని గవర్నరుగారి ప్రసంగంలో ప్రస్తావించారు. ఆదే విధంగా విద్యుత్ వినియోగదార్లకు సంబంధించి విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే అధిక ఆధాయం సమకూర్చుకున్నామని చెప్పారు. నేను అంటున్నాను--మీరు ప్రజలపై ప్రత్యక్ష పన్నులు విధించలేదు, కాని పరోక్ష పన్నుల్ని విపరీతంగా వేశారు. మన భూముల్ని అమ్మడం ద్వారా, మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాన్ని సంపాదించుకున్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో ఇంటి పన్నులు పెంచడం కాని, క్రమబద్దీకరణ పేరుతో అయిన డబ్బులు వసూలు చేయడం కాని, రిజిస్ట్రేషన్ ఫీజుల్ని పెంచడం ద్వారా గాని ఆదాయం పెంచుకునే విధంగా అనేక రకాలుగా ప్రజల మీద భారం పడింది. అది ప్రత్యక్షంగా వేసినట్లుగా కనపడకపోచ్చు, కాని ప్రజల మీదనే ఆ భారం పడుతుంది తప్ప మరొకటి కాదు. కాబట్టి ఎటువంటి పద్ధతుల్లో మనకు ఆదాయం వచ్చిందో దృష్టిలో ఉంచుకోవాలి.

అధ్యక్షా, గృహ నిర్మాణ విషయానికి వస్తే, 80 లక్షల ఇళ్లు కట్టించడం లక్ష్యం అయితే, ఇప్పటికి 8,43,704 ఇళ్ల నిర్మాణం ఇంకా మొదలు కాలేదు. 6,11,861 ఇళ్ల నిర్మాణం ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. అంటే పదిహేను లక్షల ఇళ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంది. దానికి కారణం ఏమిటి? నేను అనుకుంటున్నాను -- ముఖ్యమంత్రిగారు నిన్న, మొన్న చెపుతున్నారు. ఒక్కొక్కరికి రెండు, మూడు ఇళ్లు ఇచ్చారు, అర్హులకు ఇవ్వలేదు, అనర్హులకు ఇచ్చారు, పరిశీలించండి అని అధికారులను ఆదేశించారు. అది వాస్తవమని మేము గతంలో చాలాసార్లు చెప్పాం. కాని అది అమలు జరగలేదు. కనుక ఇప్పుడైనా అమలు చేయండి. ఆ విధంగా ఏరివేత చేస్తే ప్రజలకు ఉపయోగపడుతుంది. పైగా ఇప్పుడు ఇచ్చిన డబ్బులు కంటే ఇంకా ఎక్కువ డబ్బులు ఇచ్చి పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది. బ్యాంకులు ఇళ్ల నిర్మాణం కొరకు లోన్లు ఇవ్వడం లేదు. బ్యాంకు ఋణాలు లేకుండా ఇళ్లు కట్టుకోవాలంటే సాధ్యమయ్యేది కాదు. రాబోయే అయిదేళ్ల కాలంలో అవి పూర్తి కావు. అందుకని ప్రభుత్వమే బాధ్యత తీసుకుని తగిన విధంగా నిధుల్ని ఇచ్చి ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయవలసిన అవసరం ఉంది.

అదే విధంగా అధ్యక్షా, పావలా వడ్డీకి సంబంధించిన విషయం. 1 కోటి 16 లక్షల మంది లబ్దిదారులున్నారు. 9 లక్షల 17 వేల గ్రూపులున్నాయి. మనం ఎంత మందికి పావలా వడ్డీ ఋణాలు ఇచ్చాం? పది శాతం సంఘాలకు కూడా పావలా వడ్డీ కింద రుణాలు రావడం లేదు. ఆ సంఘాలు పావలా వడ్డీ సంపాదించడానికి అర్హత లేకుండా పోతున్నది. ఆ సంఘాలు అర్హత సంపాదించడానికి తీసుకోవలసిన చర్యల్ని తీసుకోవలసిన అవసరం ఉంది. ఆ చర్యలు తీసుకోకపోతే, పావలా వడ్డీ కేవలం ప్రచారానికే ఉపయోగపడుతుంది తప్ప, వాస్తవానికి లబ్దిదారులకు ఉపయోగపడదు. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రయివేటు పెట్టుబడుల వల్ల ఈ రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి గవర్నరుగారి ప్రసంగంలో ప్రస్తావించలేదు. సత్యం కంప్యూటర్స్ గురించి గత సమావేశాల్లో పెద్ద చర్చ జరిగింది. దాని గురించి కూడా ఇందులో ప్రస్తావన లేదు. ఒకవైపు ఉద్యోగాలు ఎప్పుడు ఊడిపోతాయో తెలియని ఆందోళనతో ఉద్యోగులుండగా, మరో వైపు సర్కారు మాత్రం ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెపుతూ వస్తోంది. ఈ విషయానికి సంబంధించి కొంత ఇబ్బందిగానే ఉంది. పైగా ఇప్పుడు ఆర్థిక మాద్యం. ప్రయివేటు పెట్టుబడులు, ప్రపంచ బ్యాంకు నుండి పెట్టుబడులు రావడం అనేది కష్టంగా ఉంది. కాబట్టి ఆ దిశగా కూడా ప్రభుత్వం ఆలోచించవలసిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నాను. అదే విధంగా సంక్షేమ పథకాలకు సంబంధించిన అంశాలు. అనేక సంక్షేమ పథకాలు ఆచరించదగినవే. ప్రజలకు ఉపయోగపడేవే. కాని వాటి అమల్లో అనేక లోపాలున్నాయి. మేము ఆ లోపాల్ని ఎత్తి చూపించినపుడల్లా, మమ్మల్ని అపహాస్యం చేసే పరిస్థితులుండేవి. ఇప్పటికైనా, అన్ని పథకాల అమల్లో జరుగుతున్న లోపాల్ని సక్రమంగా అరికట్టి, నిజమైనటువంటి అర్హులకు అందిస్తే, అది ప్రజలకు ఉపయోగపడుతుంది. అది ప్రభుత్వం యొక్క గౌరవాన్ని పెంచడానికి అవకాశం ఉంటుంది. ఆ విషయాన్ని కూడా పరిశీలించవలసిందిగా కోరుతున్నాను.

ఉ. 11.10

ధరల విషయం తీసుకుంటే, కందిపప్పు కిలో రు.64/-, పెసరపప్పు కిలో రు.64/-, శెనగ పప్పు కిలో రు.40/-, మంచి నూనె కిలో రు.58/-, చక్కెర కిలో రు.25/-, చింతపండు కిలో రు.40/-, ఎండు మిర్చి కిలో రు.100/-, గోధుమ పిండి కిలో రు.34/-, ఇవన్నీ రిటైల్ షాపులో నిన్న నేను స్వయంగా వెళ్లి తీసుకు వచ్చాను.

హోల్‌సేల్ షాపుల్లో కొద్దోగొప్పో తక్కువ ఉండవచ్చు. రిటైల్ షాపుల్లో ఈ ధరలు ఉన్నాయి. ప్రభుత్వం చెప్పే దానికి ఆచరణకు చాలా వ్యత్యాసం ఉంది. ధరలు పెంచుతున్నారు, కల్తీ పెరిగి పోతున్నది. ఏమి చర్యలు తీసుకుంటున్నారు? దీనికి కఠినమైన చర్యలు తీసుకోకపోతే చాలా దారుణమైన పరిస్థితి వచ్చే అవకాశం ఉంది.

ప్రాజెక్టులకు సంబంధించిన అంశాల్లో నా బాధ ఏమిటంటే ఎన్నికలకన్నా ముందు ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేశారు. పెద్దలు, గౌరవనీయులు రోశయ్య గారు చెప్పారు. రు.38,500 కోట్లు అని చెప్పారు. నిజంగా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలి. ఈ 5 ఏళ్లలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేయండి. పోయిన సారి ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులను పెట్టి అమలు చేయమని చెప్పాం. కానీ ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయలేదు. ఇప్పటికైనా ప్రాధాన్యతా క్రమంలో తెలంగాణా ప్రాంత ప్రాజెక్టులను తీసుకోండి. అవి జాతీయ ప్రాజెక్టులైనా, రాష్ట్ర ప్రాజెక్టులైనా మీరు ఏవి చేస్తే, మా వైపు నుంచి సహకారాన్ని మేము అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ఆ విధంగా ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలని ఈ సందర్భంగా నేను తెలియచేస్తున్నాను.

శ్రీ పితాని సత్యనారాయణ : పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడండి.

శ్రీ చేరుపల్లి సీతారాములు : మేము ఏ ప్రాజెక్టుకి వ్యతిరేకం కాదు. పోలవరం డిజైన్‌లో మార్పు వచ్చిందని ఈరోజు పత్రికల్లో వచ్చింది. మేము కూడా డిజైన్‌లో మార్పు కావాలని కోరాం. మేము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదు. కానీ ఆ విధంగా ప్రచారం జరిగింది. కేవలం మా అభిప్రాయాలను చెప్పాం.

(అంతరాయం)

లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ అని అంటున్నారు కదా. ఇవాళ అణు ఒప్పందం అని మీ జంటకు వచ్చాం, మేము మునిగాం, మీరు గెలిచారని. ఏమి చెబుతాం. రాజకీయాల్లో ఇటుది అటు అవుతుంది. అటుది ఇటవుతుంది. ఇప్పుడు 25 సీట్లు తగ్గితే మీ సర్కారు పోయేదే. సీట్ల లెక్క చూసుకుంటే మీకు, మహా కూటమికి ఎంత తేడా? 25, 30 సీట్లు అటూ, ఇటూ అయుంటే?

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడు ఆ విషయంలోకి పోతే చాలా టైమ్ అయిపోతుంది.

శ్రీ చేరుపల్లి సీతారాములు : రోశయ్య గారు చెప్పారు. మా పార్టీలో మేము ఒక విధానం తీసుకున్నాం. మేము కొన్ని అభిప్రాయాలు చెప్పదలచుకున్నాం, చెప్పాం.

(ట్రెజరీ బెంచెస్ నుంచి అంతరాయం)

MR.CHAIRMAN: Let the debate go on. Please conclude it.

శ్రీ చేరుపల్లి సీతారాములు : కాబట్టి ఈ ప్రాజెక్టుల విషయం పరిశీలించవలసిన అవసరం ఉంది. ఎరువుల కొరత, విత్తనాల కొరత ఉంది. సాక్షి పత్రికలో పాస్ పుస్తకాలు అక్కడ పెట్టారని విషయం నిజం. లేదనంటే ఎట్లా? అక్కడ యదార్థం ఒప్పుకోండి. తప్పులు దిద్దండి. దానికి న్యాయం చేయండి. లేనే లేదంటే

అది అన్యాయం కదా? మీరు ఆ విషయాన్ని కూడా పరిశీలించండి. తరువాత చైనా, ఇజ్రాయెల్ గురించి చెప్పారు.

MR.CHAIRMAN: Please conclude.

శ్రీ చేరుపల్లి సీతారాములు : రెండు నిమిషాల్లో ముగిస్తాను.

MR.CHAIRMAN: No, no I can't give more than the allotted time. At 5' o clock the Hon'ble Chief Minister is going to give reply. Please conclude.

శ్రీ చేరుపల్లి సీతారాములు : పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా మనం సహకార క్షేత్రాలని, చైనా,ఇజ్రాయెల్ వ్యవసాయ విధానమని ఇవన్నీ కార్పోరేట్ రంగాలకు అప్పజెప్పటం తప్ప దీన్ని మన రైతాంగం అంగీకరించరు. దీని వల్ల నష్టం జరుగుతుంది. ఇందులో వేలు పెడితే చాలా ప్రమాదం. దీన్ని గురించి ఆలోచించాలని ఈ సందర్భంగా నేను తమరి దృష్టికి తీసుకు వస్తున్నాను.

అందరికీ విద్య, పది సంవత్సరాల్లో నిరక్ష్యరాస్యత లేకుండా ప్రయత్నం చేస్తామన్నారు చాలా సంతోషం. నాకు ఉన్న అభిప్రాయం ఏమిటంటే ప్రాథమిక విద్యలోనే అనేక లోపాలున్నాయి. వాళ్లకు ఉపాధ్యాయుల కొరత, పాఠశాలల కొరత, మౌలిక వసతుల కొరత చాలా తీవ్రంగా ఉన్నది. అందరూ పై చదువుల గురించి ఆలోచిస్తున్నారు తప్ప ప్రాథమిక విద్యకు తగిన ప్రాధాన్యత లేదు. తగిన బడ్జెట్ ఇవ్వండి. మౌలిక వసతులు కల్పించండి. ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో మార్పు రాకుండా మనం సంపూర్ణ అక్షరాస్యత సాధించటం అసాధ్యమని నేను ఈ సందర్భంగా తెలియ చేసుకుంటున్నాను.

(ఈ దశలో మైక్ కట్ చేయబడింది)

MR.CHAIRMAN: Please take your seat. You are not able to conclude. In a short time you have made an effective speech. రెండు సంవత్సరాలు అయింది. మీకిచ్చిన సమయంలో మీరు పూర్తి చేయాలి. Within the precise time you have to conclude it.

శ్రీ చేరుపల్లి సీతారాములు : ఈ సభ మరింత సజావుగా జరగాలంటే మా అభిప్రాయాలను ఓపికగా విని తగిన చర్యలు తీసుకోవాలి.

MR.CHAIRMAN: Don't waste the time like this. Please come to the conclusion. We have to adjust others also.

శ్రీ చేరుపల్లి సీతారాములు : అయిపోయింది సార్.

మిస్టర్ ఛైర్మన్ : ఓకె. పద్మరాజు గారు మాట్లాడండి.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (అసెంబ్లీ) : అధ్యక్షా, ఈరోజు గౌరవ గవర్నర్ గారి ప్రసంగం మీద ధన్యవాదాలు తెలియచేసే ఈ కార్యక్రమంలో నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ప్రప్రథమంగా మీకు నా

హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. గవర్నరు గారు ఆయనిచ్చిన సందేశంలో గడచిన 5 సంవత్సరాల్లో ఈ ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను సింహావలోకనం చేసుకుంటూ రాబోయే 5 సంవత్సరాల్లో ఏ విధమైన లక్ష్యాలు సాధించాలనే ఉద్దేశంతో ఆయన పొందుపరచిన సమగ్రమైన ఆ సంగ్రహ పాఠాన్ని, ఆ పాఠంలో ఉన్న అంశాలను చూసినప్పుడు సుమారుగా అన్నీ అంశాలను స్ఫురించినట్లుగా అర్ధమవుతుంది.

(గౌరవ డిప్యూటీ ఛైర్మన్ గారు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

గడచిన 5 సంవత్సరాల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను మనం ఒకసారి మననం చేసుకుంటే ఇటు అభివృద్ధిలో గానీ, అటు సంక్షేమంలోగానీ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎన్నడూ చవి చూడని అభివృద్ధిని ఈ 5 సంవత్సరాల్లో వివిధ రంగాల్లో ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని గానీ, నీటి పారుదల రంగాన్ని గానీ, సంక్షేమ రంగాల్లో గానీ చూసినట్లైతే ఈ కార్యక్రమాలన్నింటిని ఇతర రాష్ట్రాల వాళ్లు కూడా వచ్చి చూసి నేర్చుకోవలసిన పరిస్థితి తెచ్చిన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఈనాడు హరితాంధ్రప్రదేశ్‌కు నిర్మాతగా ఉండి ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు తీసుకు వెళుతున్నటువంటి మా ప్రియతమ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారికి ఈ సందర్భంగా రెండవ సారి రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకుని పగ్గాలు నడిపిస్తున్నటువంటి శ్రీ రాజశేఖర్‌రెడ్డి గారికి ఈ సభ తరపున నా హృదయపూర్వక శుభాభివందనాలు తెలియచేస్తున్నాను.

ఈ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసినట్లైతే సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ అనే ఒక సంస్థ ఉంది. ఈ రాష్ట్రంలో జరిగినటువంటి ఆర్థిక ప్రగతిని ఒక్కసారి వారంతా గణాంకాల రూపంలో చేసినప్పుడు, ఆ గణాంకాలు తెలియచేసిన అనేక నగ్న సత్యాలు మనకందరకు తెలుసు. ఆ 5 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి అటు క్రిసిల్, కేర్, ఫిచ్-ఈ సంస్థలు తీసుకొని బేరీజు వేసుకొని చేసినటువంటి గణాంక వివరాలు చూస్తే, ఫిచ్ వారు మనకు ఏ+ ఇచ్చిన సంఘటన మనకెంతో ఆనందదాయకం. మనమంతా హర్షాతిరేకాల్ని వెలిబుచ్చాల్సిన సమయం అని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను. రాజశేఖర్‌రెడ్డి గారు ఏది చెప్పినా చేస్తారనే ఒక విశ్వసనీయతతో ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లడం ద్వారా నయవంచనకు వ్యతిరేకంగా, విశ్వసనీయతకు, నయవంచనకు మధ్యన జరిగిన పోరాటంలో, మొన్న జరిగిన సమరంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి సంపూర్ణ సహకారం ఇచ్చి ఈరోజు రెండవసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుని రావడానికి కారకులైనటువంటి ఈ రాష్ట్ర ప్రజానీకానికందరికీ ఈ సభాముఖంగా మా అభినందనలు తెలియచేస్తున్నాను.

ఉ. 11 .20

అధ్యక్షా, మనం ఒకసారి1999 నుండి 2004 వరకు చూస్తే, ఆ ఐదు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి కానీ విశ్లేషణ చేస్తే, తదుపరి అభివృద్ధి కానీ గమనించినపుడు వ్యవసాయ రంగంలో యావత్‌భారదేశంలో ఉన్న సగటు అభివృద్ధి కంటే మన రాష్ట్రంలో ఎక్కువ అభివృద్ధి సాధించామని గణాంకాలు తెలియజేస్తున్నాయి. వార్షిక వృద్ధిరేటు చూస్తే సుమారు 2004-09 కాలంలో 9 శాతం గణనీయమైన అభివృద్ధి సాధించాము. జాతీయ స్థాయిలో ఇది 8.5 శాతం మాత్రమే ఉందని మనవిచేస్తున్నాను. 1999-2004 లో ఇది 6.06 శాతం గా మాత్రమే ఉంది. వ్యవసాయ రంగం దాని అనుబంధ రంగాలలో 3.46 శాతం జాతీయస్థాయిలో ఉంటే, మనం 6.46 శాతం సాధించడమనేదానికి ఈ రాష్ట్రంలో మా కాంగ్రెస్ ప్రభుత్వం కారణం. వ్యవసాయానికి

మన ప్రభుత్వం ఎంత పెద్దపీట వేసిందో దీనివలన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి, నీటి పారుదల రంగానికి ఈ రాష్ట్రం పెద్దపీట వేసిందని ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రాబోయే రోజులలో ఏ రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తే, తదుపరి విద్యుత్ రంగానికి పెద్దపీట వేయడం ద్వారా రాష్ట్రం యొక్క మౌలిక సదుపాయాలు పెరగడం తద్వారా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, మిగిలిన సమాచార, సాంకేతిక అభివృద్ధి జరుగుతుందనేది పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని తెలియజేస్తున్నాను. పారిశ్రామిక రంగంలో దేశ సగటుకంటే మన రాష్ట్రం ఎక్కువగా ఉంది. సుమారు 10 శాతం మనకు ఉంటే, 9.47 శాతం అక్కడ ఉంది. ఈ విధంగా వ్యవసాయం రంగం, పారిశ్రామిక రంగాలను ముందుకు తీసుకుని పోవడం ద్వారా రాష్ట్ర పురోభివద్ధికి, అభివృద్ధికి కృషిచేస్తున్న ఈ ప్రభుత్వాన్ని నేను మనసారా, హర్షిస్తూ, మనసారా ఆశీర్వదిస్తూ, రాబోయేరోజులలో కూడా ఇదేవిధమైన ప్రగతి సాధించడంలో అందరి సహకారం కావాలని, ముఖ్యంగా ప్రతిపక్షాల వారికి తమరిద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఎన్నికల వరకు రాజకీయ సమరంలో పోరాటం చేశాము. ఎన్నికలు ఐపోయిన తరువాత రాష్ట్రాభివృద్ధికి మనమందరం కృషి చేయాలని మనసులో పెట్టుకోవడం ద్వారా ఈ ఐదు సంవత్సరాలలో ఈ రాష్ట్రం మరింత ప్రగతిని సాధిస్తుందని భావిస్తున్నాను. ముఖ్యంగా ఆహారభద్రత, ఆరోగ్య భద్రత లకు చాలా పెద్దపీట వేయడం జరిగింది. రు. 2లకు కిలో బియ్యం ఇచ్చేదానిని, ఇదివరలో 20 కిలోలు ఇస్తే ఇపుడు 30 కిలోలు పెంచడం ద్వారా ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం జరిగింది. గడిచిన టిడిపి 9 ఏండ్ల ప్రభుత్వ పాలనలో రైతాంగం అంతా కూడా చాలా తీవ్రమైన ఇబ్బందులు కలిగి ఎంతో మనోవేదన చెందినపరిస్థితులలో ఆత్మహత్యలకు దోహదకారులైన పరిస్థితి నాకు తెలుసు. అటువంటి పరిస్థితి నుండి రైతాంగానికి కనీస మద్దతుధర వరికి రు. 930 లు అయింది. అదే తెలుగుదేశం ప్రభుత్వంలో రు. 580 లు మాత్రమే అని మనవిచేస్తున్నాను. మేము అధికారంలోకి వచ్చిన ఈ ఐదు సంవత్సరాల కాలంలో రు .350 లు పెంచడం జరిగింది. ఇది మా హయాములోనే జరిగిందని తెలియజేస్తున్నాను. ఈ రోజున వ్యవసాయ రంగానికి, రైతాంగానికి ఇతోధికమైన మేలు జరిగిందని తెలియజేస్తున్నాను. ఈనాడు సామాన్యుడికి కావలసినది కూడు, గూడు, గుడ్డ అని మనకందరికి తెలుసు. రు.2 లకు కిలో బియ్యం ఒకకోటి ఎనభై ఏడు లక్షల తెల్ల రేషన్ కార్డుల ద్వారా రాష్ట్రమంతా ఇస్తున్నాము. అదేవిధంగా మరో 12, 13 లక్షల పచ్చకార్డులు ఉన్నవాళ్లకు ఆదాయ పరిమితి పెంచిన దానిలో లోబడి ఉంది కాబట్టి వారికి కూడా తెల్లకార్డులు ఇచ్చే పరిస్థితి ఉందని మనవిచేస్తున్నాను. ఇదివరలో లేని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. పెన్షన్లకు సంబంధించి ఆనాడు 18 లక్షల 87 వేల పెన్షను రు . 75 లు ఇస్తే ఈ రోజు 71 లక్షల మందికి రు.200 ల వంతున పెన్షన్లు ఇస్తున్న ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందని గుర్తుచేస్తున్నాను. వికలాంగులకు రు. 500 పెంచిన ఘనత కూడా ఈ రాష్ట్రప్రభుత్వానికే దక్కుతుంది. ఈనాడు విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. రాబోయే రోజులలో ఈ నెలాఖరుకు విటిపిఎస్ 500 ఎంవి, జూన్ 30వ తేది వరకు ప్రొడక్షన్‌లోకి తేవడానికి వస్తుంది, భూపాల్ పల్లి లో 500 ఎంవి రాబోయే డిసెంబరు 30 వరకు ప్రారంభం కాబోతుందని, తద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక అభివద్ధి మరింత వేగంగా జరగడానికి దోహదపడుతుందని మనవిచేస్తున్నాను. రాష్ట్రంలో ప్రజానీకం అభివృద్ధి చెందాలంటే, దళితులు, బలహీనవర్గాలు, మైనారిటీలు అభివృద్ధి చెందాలంటే విద్య ఎంతో అవసరం ఉందని మనవిచేస్తున్నాను. దానిని దృష్టిలో పెట్టుకుని స్కాలర్‌షిప్స్ సుమారు 25 నుండి 40 శాతం పెంచాము. మెస్‌చార్జీలు పెంచాము. ఈ వర్గాలందరికి ఫీజు రీఇంబర్స్‌మెంట్ చేసిన ఘనత ఈ రాష్ట్రప్రభుత్వానికే దక్కుతుందని మనవిచేస్తున్నాను. ఇన్ని మంచి కార్యక్రమాలు తీసుకుని, ప్రగతి పథంలో ముందుకు వెళుతూ, క్రమశిక్షణతో అవినీతి అంతమొందించాలనే ఉద్దేశ్యంతో వున్నాము. ఇప్పుడే బియ్యం ధర ఎక్కువగా ఉందని చెప్పారు. దానికి అధికారంలోకి వచ్చిన వెంటనే మా ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు ఎక్కడయితే అవినీతి జరుగుతోందో,

అవకతవకలు జరుగుతున్నాయో అక్కడ వెంటనే రెయిడ్స్ కూడా జరుగుతున్నాయి. అవినీతి పరులను కట్టడి చేయాలని కూడా పార్టీ ఫోరంలో చెప్పడం జరిగింది. ఈ విధంగా అభివృద్ధి జరుగుతున్న ఈ క్రమంలో మీయొక్క అమూల్యమైన సహకారం అందిస్తే రాబోయే రోజులలో మరింత ప్రగతిపథం వైపు రాష్ట్రాన్ని తీసుకుని వెళ్లడానికి దేశంలో రాష్ట్రాన్ని మరింత ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి దోహదపడాలని మీ అందరినీ కోరుకుంటూ, మీ వద్ద సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కపిలవాయి దిలీప్‌కుమార్ (వరంగల్, ఖమ్మం, నల్గొండ) : అధ్యక్షా, గవర్నరు ప్రసంగంలో మొదటిపేజీలోనే ఈ రాష్ట్రప్రజలు వేర్పాటువాద రాజకీయాలను సంపూర్ణంగా నిరాకరించారు, వారి పరిపక్వస్థాయికి ఆశ్చర్యపడాలని అన్నారు. మేము ఆశ్చర్యపోతున్నాము. ఎందుకంటే తెలంగాణా ఇస్తానని కాంగ్రెస్‌పార్టీ ప్రజలలోకి వెళ్లింది. ఇన్ ప్రిన్సిపుల్ తెలంగాణాకు మేము వ్యతిరేకం కాదని అన్నారు. అదే పద్ధతిలో టిడిపి తెలంగాణా ఇస్తామని ప్రజలలోకి వెళ్లింది. పిఆర్‌పి తెలంగాణా ఇస్తామనీ, సిపిఐ కూడా తెలంగాణా ఇస్తామనీ ప్రజలలోకి వెళ్లింది. తెలంగాణా వద్దు, సమైక్యవాదానికి కట్టుబడి ఉన్నామని ప్రజల మధ్యకు వెళ్లింది పాపం సిపిఎం మాత్రమే. మీరు అన్నది నిజమైతే మా సీతారాములుగారు ముఖ్యమంత్రి కావాలి మీరు దిగిపోవాలి. తెలంగాణా ఉద్యమం, తెలంగాణా ఆకాంక్షలను ఒక జాతి వ్యతిరేక ఉద్యమం క్రింద చిత్రీకరించే ప్రయత్నం దయచేసి చేయకండి. ఇది వేర్పాటు విధానం కాదు. మీరు వాడిన పదం తప్పు. వేరే దేశం కోసం పోరాడామండీ. నార్త్ ఈస్ట్‌లో వారు ఆ విధంగా పోరాడుతున్నారు. తెలంగాణా ఏర్పాటు, ప్రత్యేక రాష్ట్రంకోసం మేము పోరాటం చేస్తున్నాము.

ఉ. 11.30

SRI PONNALA LAKSHMAIAH: Just I want to give my clarification.

SRI KAPILAVAI DILEEP KUMAR: I am not yielding. ఈ రోజు ఈ ఉద్యమాన్ని అన్ని పార్టీల వారూ అంగీకరించారు, ఒకటి రెండు తప్ప. దేశ స్థాయిలో ప్రణబ్ ముఖర్జీ కమిటీని వేయడం జరిగింది. ఇప్పుడు దేశ స్థాయి అంశాన్ని దిగజార్చి, రాష్ట్ర స్థాయికి తీసుకొచ్చారు. రోశయ్య గారు అంటే మాకు చాలా అభిమానముంది కాని రోశయ్య గారి కమిటీతో మనకు వచ్చేదేమిటి సర్ ? ..........

SRI PONNALA LAKSHMAIAH: Just I want to submit to the House.

శ్రీ కపిలవాయి దిలీప్‌కుమార్ : సర్ నేను మీ అనుమతితో మాట్లాడుతున్నాను, మీరు నా హక్కులను కాపాడాలి. నేను అనేది తెలంగాణా అంశం మీద మనం ఎలక్షన్‌కు పోయామా? తెలంగాణా మీకు కావాలా వద్దా అన్నపుడు మీరు ఈ మాట చెప్పాలి. తెలంగాణా అంశం మీద మనం ఎలక్షన్లకు పోతే ఈ వ్యాఖ్యలను మీరు గవర్నరు ప్రసంగంలో వ్రాయాలి. తెలంగాణా వాదులందరినీ ప్రజలు గెలిపించారు. కాంగ్రెస్ పార్టీలో వున్న తెలంగాణా వాదులను ప్రజలు గెలిపించారు, ఇతర పార్టీలలో వున్న తెలంగాణా వాదులను కూడా ప్రజలు గెలిపించారు. ఒక వేళ మీరు అన్నది నిజమైతే 14 మంది హేమా హేమీలను ఎందుకు మట్టి కరిపించారు? నేను గవర్నరు గారి అడ్రస్‌ను కోట్ చేసి మాట్లాడుతున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుంచి అంతరాయం)

I am not deviating from the Governor's speech. సర్ వారు నన్ను డిస్టర్బ్ చేస్తున్నారు. వారి రన్నింగ్ కామెంటరీని ఆపండి. ..........

మిస్టర్ డెప్యూటీ చైర్మన్ః మీరు మీ రన్నింగ్ కామెంటరీని ఆపండి.

SRI KAPILAVAI DILEEP KUMAR: Thanks for protecting me.

(తిరిగి అంతరాయం)

అధ్యక్షుల వారు నాకు 10 నిమిషాలే టైమ్ ఇచ్చారు. మీరు కావాలంటే తరువాత మాట్లాడండి. మధ్యలో డిస్టర్బ్ చేయవలసిన అవసరం లేదు. తెలంగాణా ప్రాంతంలో ఎలక్షన్లు అయిపోయిన మరుక్షణమే, అప్పటి దాకా మేము తెలంగాణాకు అనుకూలమే అని చెప్పి, in principle we are agreeing అని చెప్పి, ఆ సాయంత్రమే, తెలంగాణాలో ఇతర ప్రాంతాల వారు విదేశీయులలాగ బ్రతకాల్సి వస్తుందని ఎవరు చెప్పారు? పార్టీల సంఖ్య తగ్గితే తగ్గి వుండవచ్చు కాని సిఎం గారే తెలంగాణా వాదం వున్నదని చెప్పిన తరువాత, కమిటీ వేసిన తరువాత, మీరు వేర్పాటు వాదానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని ఎట్లా అంటారు? తెలంగాణా వాదం లేదని ఎట్లా అంటారు?

(అంతరాయం)

శ్రీ పొన్నాల లక్ష్మయ్య ః సర్, వన్ మినిట్

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ ః మేము ఏ రోజూ కూడా ఏ ప్రాంతానికీ వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయలేదు. తెలంగాణా ఉద్యమం అక్కడి ప్రజలకు వ్యతిరేకం కాదు. ఆంధ్ర ప్రాంతానికి వ్యతిరేకం కాదు.

(ట్రెజరీ బెంచెస్ నుంచి తీవ్ర అంతరాయం)

నేను ఈ రోజు స్పష్టంగా చెబుతున్నాను, తెలంగాణా ప్రజలు ఏ ప్రాంత ప్రజలకు వ్యతిరేకం కాదు. తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించమని తెలంగాణా ఉద్యమం ఒక పోరాటంగా జరుగుతోంది. దానిని మీరు కూడా ఆమోదించారు. మీరు కూడా in principle we are ready for Telangana అని చెప్పిన తరువాత ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎవరు ప్రసంగించారు?

సిఎం గారు చాలా స్పష్టంగా తన ప్రకటనలో చెప్పారు, తెలంగాణా వాదం వున్నదని ఆయన చెప్పారు. కాని ఇప్పుడు తెలంగాణా వాదమే లేదని అంటే ఎట్లా?

ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తరువాత చిత్ర విచిత్రమైన అంశాల మీద, చిన్న చిన్న అంశాల మీద ఒపీనియన్ పోల్స్ కండక్ట్ చేస్తున్నారు. ధోనీ జుట్టు పెంచుకుంటే అందంగా వుంటాడా, తగ్గించుకుంటే అందంగా వుంటాడా అనేది ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలుసుకుంటున్నారు. మీరు కూడా ఎస్ఎంఎస్‌లను కండక్ట్ చేయండి. తెలంగాణా కావాలా వద్దా అనేది మీకు రిప్లయ్ వస్తుంది. ఒకవేళ మీకు మేధావుల నుంచే అటువంటి

ఎస్ఎంఎస్‌లు వస్తాయని అనుకుంటే రిఫరెండం కండక్ట్ చేయండి. మన ఉపాధ్యాయులకు గ్రామీణ ప్రాంతాలలో ఇంకా అవినీతి అంటలేదు. గ్రామీణ ప్రాంతాలలో రిఫరెండం కండక్ట్ చేస్తే, గిరిజన ప్రాంతాలలో విష జ్వరాలతో బాధపడుతున్న గిరిజనులు మీకు తీర్పు చెబుతారు. రోడ్లు లేని ప్రాంతాల ప్రజలు, ఉద్యోగాలు దొరకని నిరుద్యోగ యువత, వైద్య సదుపాయాలు లేని నిరుపేద ప్రజలు, తెలంగాణా అవసరం వుందా లేదా అనేది రిఫరెండం ఇస్తారు. కాని మాకు రోశయ్య కమిటీ అవసరం లేదు.

రోశయ్య కమిటీ ద్వారా మీరు ఖచ్చితంగా అభిప్రాయాలను తెలుసుకోవచ్చు కాని, మాకు అవసరం లేదు. కార్పొరేట్ కళాశాలల్లో తమ పిల్లలను చదివించుకోలేక నిరుపేదలు తమ పిల్లలను తమ తమ ఇళ్లలోనే కూర్చోబెట్టుకుంటున్నారు. ఈ రిఫరెండమ్‌ను మీరు అంగీకరించే పరిస్థితి లేకపోతే తెలంగాణా కావాలా వద్దా అనే రిఫరెండం కండక్ట్ చేస్తే, తెలంగాణా వాసుల ఆవేదన ఏమిటో మీకు తెలుస్తుంది. ప్రణబ్ ముఖర్జీ కమిటీని వదిలిపెట్టి తెలంగాణా నిప్పుల కుంపటిని మీరు రోశయ్య గారి గుండెల మీద ఎందుకు పెడతారు? ఆయనను ఈ వయస్సులో ఎందుకు ఇబ్బంది పెడతారు? ప్రణబ్ ముఖర్జీ కమిటీ నాన్చినట్లుగానే రోశయ్య గారుకూడా నాన్చి ఆయన రాజకీయ చాతుర్యంతో చాణుక్య నీతితో పక్క దారి పట్టించడానికా? రోశయ్య గారి కమిటీ మీద మాకు గౌరవం వుంది. కాని దయచేసి ఆ కమిటీని రద్దు చేయండి. మాకు ఆ కమిటీ అవసరం లేదు, ఆ ప్రక్రియా అవసరం లేదు.

నేను ప్రాంతీయ విభేదాల గురించి మాట్లాడడం లేదు. తెలంగాణాలో తెలంగాణా అంశం వుందా లేదా అనేది తెలియడానికి ఆంధ్రప్రాంతానికి చెందిన రోశయ్య గారిని ఆ కమిటీకి అధ్యక్షునిగా వేయనక్కరలేదు. ఈ ప్రాంతానికి చెందిన పొన్నాల లక్ష్మయ్య గారు తెలంగాణా అభిమానే కాబట్టి ఆయనతో కమిటీని వేయండి.

(అంతరాయం)

మీ సెజ్‌ల విధానం తప్పు కాబట్టే జడ్చర్లలో మీ అభ్యర్థి ఓడిపోయారు. సెజ్‌ల విధానం సరియైనదైతే మీ అభ్యర్థి గెలుపొందే వారే. 14 మంది హేమా హేమీలు ఓడిపోయారు. ఎందుకు ఓడిపోయారు? ఈ అంశం మీద మీ స్టాండ్ ఏమిటో, మీ వైఖరి ఏమిటో, స్పష్టం చేయండి. తెలంగాణా ప్రజలతో దోబూచులాడడం మంచిది కాదని మనవి చేస్తున్నాను. రాజకీయ లబ్ది కోసం వాడుకుని, ఎలక్షన్లు అయిపోగానే వదిలిపెట్టడం మంచిది కాదు. తెలంగాణా ఆకాంక్ష కొనసాగుతూనే వుంది. ఒక ఎలక్షన్‌లో ఎక్కువ సీట్లు వస్తాయి, ఇంకొక ఎలక్షన్‌లో తక్కువ సీట్లు వస్తాయి. తక్కువ సీట్లు వచ్చాయి కాబట్టి తెలంగాణా వాదం వీగిపోయిందని నిర్ణయించడానికి వీలు లేదు. ఇది తెలంగాణా ప్రజల ఆకాంక్ష. తెలంగాణా కావాలని వారు ఖచ్చితంగా అడుగుతున్నారు.

అందువల్ల రోశయ్య గారి కమిటీని రద్దు చేయండి, మాకు అవసరం లేదు, ప్రణబ్ ముఖర్జీ కమిటీ ద్వారా తేల్చండి. ఇది జాతీయ స్థాయిలో, పార్లమెంటులో తేల్చవలసిన అంశమైతే, రాష్ట్ర స్థాయిలో ఈ ఉభయ సభలకూ అధికారమే లేదు. ఈ కమిటీని రద్దు చేయాని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ సభలో కూర్చున్న వారినందరినీ నేను రాజకీయాలకు అతీతంగా రిక్వస్ట్ చేస్తున్నాను. తెలంగాణా రాష్ట్రం కావాలని తెలంగాణా ప్రజలు కోరుకుంటున్నారు. తెలంగాణా ఇస్తామని మీరు ఎలక్షన్ల ముందు అన్నారు. తెలంగాణా రాష్ట్రాన్ని సాధించే క్రమంలో విద్యావంతులు, మేధావులు, పార్టీలకు అతీతంగా ఖచ్చితంగా తెలంగాణా రాష్ట్రం కావాలని కోరుకుంటున్నారు. కాబట్టి తెలంగాణా విమోచన దిశగా ఉద్యమం రూపు దిద్దుకుంటోంది కాబట్టి ఆ

సందర్భంలో మీ ఆశీస్సులను ఉద్యమానికి ఇవ్వండవి కోరుకుంటున్నాను. ఇది ఇతర ప్రాంతాలకు వ్యతిరేకం కాదు. ఆంధ్ర తెలంగాణా వారి పంచాయతీ కాదు, రాయలసీమతో వున్న పంచాయతీ కాదు, ప్రాంతాలకు, వ్యక్తులకు అతీతంగా మీ అందరి ఆశీస్సులు తెలంగాణాకు వుండాలని కోరుకుంటున్నాను. ఇటువంటి సున్నితమైన అంశాలను ప్రస్తావించి తెలంగాణా వారిని కించపరచ వద్దని కోరుతున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుంచి తీవ్ర అంతరాయం)

ఉ. 11.40

డా. కె. నాగేశ్వర్ : అధ్యక్షా, ముందుగా ఇక్కడ నిన్న చాలా మంది అడిగారు. నాకు అప్పుడు అవకాశం రాలేదు. ఈ శాసనమండలి కార్యకలాపాలకు లైవ్ టెలికాస్ట్ ఇవ్వాలని ఆ కోర్కెను మరొకసారి నా తరపున మా పి.డి.ఎఫ్ తరపున కోరుతున్నాను. లైవ్ టెలికాస్ట్ అంటే ఎక్కువగా అల్లరి చేస్తారనే ఒక అభిప్రాయం ఉండవచ్చు, కానీ ఇక్కడ లైవ్ టెలికాస్ట్ లేదని బయట టి.వి., కెమెరాలు, లైవ్ టెలికాస్ట్ ఉన్న చోట్ల మాట్లాడే వారు మాట్లాడవచ్చుకదా? దానిని ఆపలేరుకదా? నేను గత రెండు సంవత్సరాలుగా లోకసభ ఛానల్స్ చాలా తరచుగా చూస్తున్నాను. అత్యద్భుతమైన కాంట్రిబ్యూషన్. నిష్పక్షపాతమైన విలువైన చర్చ. చట్ట సభలో చర్చించిన అనేక బిల్లుల గురించి సమగ్రమైన అవగాహన రావాలంటే లోకసభ ఛానల్ చూడాలి. నేను కోరేదేమంటె, రాష్ట్రంలో కూడా ఒక లెజిస్లేటివ్ ఛానల్ శాసనసభ, శాసన మండలి కార్యకలాపాల సమావేశాలు జరుగుతున్నప్పుడు లైవ్ టెలికాస్ట్ తోబాటు సమావేశం లేనప్పుడు చట్ట సభలో రూపొందించిన అనక అంశాలను ప్రజలకు వివరించే విధంగా తెలుగులో లెజిస్టేటివ్ ఛానల్ ఉండాలని కోరుతున్నాను. రెండవది, గవర్నర్‌గారి ప్రసంగం మొత్తం చూసినట్లయితే, నిన్న పరీక్ష వ్రాసిన మన అమ్మాయోనో, అబ్బాయినో చూసినట్లయితే మన ఇంట్లో పిల్లలు వారు వ్రాసిన పరీక్ష పేపర్లు ముందు పెట్టుకొని అయిపోయిన పుస్తకాలు ముందు పెట్టుకొని ఏ పరీక్షకి ఎలా వ్రాసాను అని ఆనంద పడే అమ్మాయినో, అబ్బాయినో చూసి తల్లిదండ్రులు ఏమంటారంటే, అయిపోయినది కాదు, వ్రాయబోయే పరీక్ష గురించి ఆలోచించమని చెబుతారు. గవర్నర్‌గారి ప్రసంగం చూసినట్లయితే, భవిష్యత్తు గురించి కామెంట్ లేదు. వచ్చే పరీక్ష గురించి అంటే భవిష్యత్తు గురించి 20 శాతం కూడా లేదు. ఆర్థిక మాంద్యం రాష్ట్రాన్ని ఆవరించి ఉంది. లేదన్నట్లుగా గవర్నర్‌గారి ప్రసంగంలో భావన కలుగుతోంది.

సింగరేణి కాలరీస్ చూసినట్లయితే, యాజమాన్యం ఆర్థిక మాంద్యం వల్ల లాభాలు తగ్గించామన్నారు. రాజమండ్రిలో వస్త్ర పరిశ్రమ దెబ్బతిన్నది. కడప, కర్నూలు జిల్లాలో పరిశ్రమలు దెబ్బతిన్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ నష్టాలలోకి వచ్చింది. గల్ఫ్ నుండి బాధితులు తిరిగి వస్తున్నారు. ఆర్థిక మాంద్యాన్ని నివారించడానికి ఏమి చేస్తామన్నారు? కార్యచరణ ప్రణాళిక ఇందులో ఏమీ లేదు. వ్యవసాయ రంగం గురించి గవర్నర్‌గారి ప్రసంగంలో చెప్పారు. అధికార పార్టీ సభ్యులు పదే పదే చెప్పారు. మాకు వ్యవసాయ రంగం అత్యంత ప్రాముఖ్యత కలిగిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో లక్ష్యాల గురించి పెద్దలు రోశయ్యగారు చెప్పారు. బుక్ ఎస్టిమేట్స్, అడ్వాన్స్డ్ ఎస్టిమేట్స్ అని చెప్పారు. ఫ్యూచర్ ఎస్టిమేట్స్ తగ్గించారు. 2008 ఫిబ్రవరి 8న గవర్నర్‌గారి ప్రసంగంలో వృద్ధి లక్ష్యం 4.5 శాతం 11వ ప్రణాళికా లక్ష్యమని అన్నారు. ఈ ప్రసంగంలో రాబోయే ఐదు సంవత్సరాలలో నాలుగు శాతం వృద్ధి సాధిస్తామన్నారు. 11వ ప్రణాళికా భాగం ఉంటుంది, 12వ ప్రణాళికలో కొంత భాగం ఉంటుంది. అత్యంత కీలకమైన జల యజ్ఞం ద్వారా పెరగవలసిన రంగంలో వృద్ధి లక్ష్యం తగ్గించారు. మన రాష్ట్రంలో 63 శాతం ఉపాధి కల్పించారు. ఈ రంగంలో జల యజ్ఞం, విద్యా యజ్ఞం చూపుతున్నారు. అధికార పార్టీ సభ్యులు చెప్పారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. 2009 తాత్కాలిక బడ్జెట్‌లో

సమర్పించిన పట్టికలో చూసినట్లయితే, ప్రతీ విశ్వవిద్యాలయంలో సగానికి సగం నిధులు తగ్గించారు. ఆఖరికి కొత్తగా పెట్టిన మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, కర్నూలు విశ్వవిద్యాలయాలకు రు.11 కోట్లకు పైగా బడ్జట్ ప్రతిపాదనలు ఉంటే రు.5.77 కోట్లు సవరించిన అంచనాలు ఉన్నాయి. ఏ యూనివర్సిటీ అయినా చూస్తే, కొత్త, పాత అనేది కాకుండా నిధులను తగ్గించేసారు. మహాత్మాగాంధి యూనివర్సిటికి చూసినా సగానికి సగం నిధులు తగ్గించారు.

విద్యా యజ్ఞం చేస్తామంటే నాకు అభ్యంతరం లేదు. విద్యా యజ్ఞం అంటే ఎందుకు తగ్గించారో చెప్పమనండి. తమను నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని తెలంగాణాలో ప్రజలలో ఒక భావన ఉంది. నిజంగా విశ్వవిద్యాలయ గణాంకాలు చూసినట్లయితే, తెలంగాణా విశ్వవిద్యాలయానికి రు.4.62 కోట్లు, నల్గొండ విశ్వవిద్యాలయానికి చూసినట్లయితే రు.3.80 కోట్లు మొత్తం తెలంగాణా రెండూ కలిపి రు.8 కోట్లు కేటాయించారు. యోగి వేమన విశ్వవిద్యాలయానికి రు.18 కోట్లు. ఇది కూడా తక్కువే. కానీ ఇంత నిధుల తేడా ఎందుకు? తెలంగాణాలో 60 శాతం మండలాలలో మహిళల అక్షరాస్యత 44 శాతం తక్కువగా ఉంది. సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా కళాశాలలు అతితక్కువగా ఉన్న తెలంగాణా ప్రాంతానికి ఏమయినా చేస్తామని అన్నారా? ప్రాంతీయ అభివృద్ధి బోర్డ్ నిర్వాకం ఏమిటి? దానిని రాజకీయ పునరావాసానికి వాడుకున్నారు. ఈ గవర్నర్‌గారి ప్రసంగంలో ప్రాంతీయ అసమానతల గురించి ఒక్క మాట కూడా అనలేదు. విశ్వవిద్యాలయాలకు సంబంధించి జరిగిన అన్యాయం గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. ఆఖరికి ప్రాధమిక విద్యకు సంబంధించి మధ్యాహ్న భోజన పధకం దారుణంగా అమలు అవుతున్నదని సిఏజి 2008లోని నివేదికలో పేర్కొన్నారు. మాకు అందించిన నివేదికలో స్పష్టంగా ఉంది. ఒక చాప్టర్ అందులో ఉంది. దానిని బాగు చేస్తామని గవర్నర్‌గారి ప్రసంగంలో ఎందుకు చెప్పలేదు?

2009 తాత్కాలిక బడ్జట్‌లో ఇచ్చిన సామాజిక, ఆర్ధిక సర్వేలో చెప్పారు. ధరలన్నీ పెరుగుతున్నాయి, బియ్యం, కూరగాయలు పెరుగుతున్నాయన్నారు. వరికి రైతుకి రు.1,000 మద్ధతు ధర ఇస్తే, ఒక 100 కిలోల వడ్లతో 66 కిలోల బియ్యం వస్తాయి. నూకలు, తౌడు, మిల్లింగ్ ఛార్జీలు తీసివేస్తే కిలో బియ్యానికి రు.14 లేక రు.15కి మించి ఎట్టి పరిస్థితిలోనూ బియ్యం ధర ఉండరాదు. 40 శాతం అధికంగా మార్కెట్‌లో ఎందుకు ఈ ధర ఉంది? ధరలు తగ్గించడానికి ఏదైనా ప్రణాళిక ఉంటే బాగుంటుంది. కాబట్టి ధరలు తగ్గించడానికి నిర్ధిష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉంటే బాగుంటుందని కోరుతున్నాను. ఆర్ధిక మాంద్యం నుండి రాష్ట్రాన్ని ఎలా కాపాడతారో దానికిగాను ఏమి చేస్తున్నారో తెలపవలసిందిగా కోరుతున్నాను. దానికిగాను సభా సంఘం వేస్తారో, నిపుణుల సంఘం వేస్తారో చెప్పమనండి. ప్రాంతీయ అసమానతలకు, విద్యా రంగం అభివృద్ధికి ఏమి చేస్తున్నారో, ధరలు తగ్గడానికి ఏమిచేస్తున్నారో చెప్పమని కోరుతున్నాను. ఇక మరొక విషయం, జల యజ్ఞం గురించి చెప్పారు. నా సొంత ఊరు, ఆదిలాబాద్ జిల్లాలోని మందమర్రిలో ఒక చిన్న ఊరు, అక్కడ ఎర్ర చెఱువులో 150 ఎకరాల సాగుకి సంబంధించి చెఱువు కోసం ఆరు నెలల నుండి ముఖ్యమంత్రిగారి కార్యాలయం, నీటిపారుదల శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. సి.ఎం. పేషీ నెం॥ 1678/ii/2008 ఇచ్చి ఆరు నెలలయంది. ఇప్పటికీ దానికి మోక్షం లేదు. ప్రాణహిత, చేవెళ్ల తెస్తామంటున్నారు, ఇంతవరకూ లేదు. ఈ చెఱువు పని కూడా చేయలేదు. కాబట్టి మైనర్ ఇరిగేషన్‌ని ఏ విధంగా ఉద్ధరింపచేస్తున్నారో చెప్పమని కోరుతున్నాను. రాబోయే కాలంలో ఏమి చేస్తారో చెబితే మాకు అర్ధం అవుతుంది. ఎంతో కొంత మంచి చేయకపోతే ప్రజలు వారిని ఎందుకు ఎన్నుకుంటారు? నేను చెప్పిన విషయాల గురించి చెప్పవలసిందిగా ముఖ్యమంత్రిగారిని తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్‌రాయుడు (అసెంబ్లి) ః అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం గురించి మాట్లాడడానికి నాకు అవకాశం లభించినందుకుగాను మొట్టమొదటిసారిగా తమకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ధన్యవాదాలు తెలిపే ప్రక్రియలో మొదటగా సుధాకర్‌రెడ్డి, షేక్ హుస్సేన్, దాడి వీరభద్రరావు, పువ్వాడ నాగేశ్వరరావు, ప్రొ. నాగేశ్వర్ గార్లు మాట్లాడిన తరువాత వారందరూ చెప్పింది సబబు అనిపిస్తుంది. వారు తమ ప్రసంగాల్లో ధన్యవాదాలకు బదులు చాలా సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా కౌన్సిల్‌కి లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేయాలని చెప్పడం చాలా సబబుగా ఉందనిపిస్తోంది. దీనికి సంబంధించి నాకొక చిన్న కథ గుర్తుకు వస్తోంది. నాటు కోడి, బ్రాయిలర్ కోడి రెండూ మాట్లాడుకుంటున్నాయి. నాటు కోడి బ్రాయిలర్ కోడితో మాట్లాడుతూ' నువ్వు తెల్లగా ఉంటావు, నువ్వు గుడ్లు పెడుతూనే పిల్లలను పొదగవలసిన పని లేదు. ఎప్పుడూ షెడ్‌లోనే ఉంటావు. ఎండకి పోవలసిన పని లేదు. నీ గుడ్లు, రెట్టలూ యజమానే దూరంగా తీసుకువెళ్లి వేస్తాడు. నిన్ను కోసేటప్పుడు, ఆటోలోనో, వ్యాన్‌లోనో తీసుకువెళ్లి పట్టణం అంతా తిప్పి మాంసంగా తయారుచేస్తాడ'ని చెప్పింది. బ్రాయిలర్ కోడి నాటు కోడితో 'నువ్వు మల్టీ కలర్స్‌తో ఉంటావు. స్వేచ్ఛా జీవివి. ఎక్కడయినా భోజనం చేయవచ్చు. చెట్టు మీద ఎక్కవచ్చు, దిగవచ్చు. నువ్వు పెట్టిన గుడ్లను నువ్వే పిల్లలుగా తయారు చేస్తావు. నువ్వు చనిపోయినప్పుడు నీ మాంసం నీ యజమానే తింటాడ'ని అన్నదట. అంటే రెండు కోళ్లు నిజాలే మాట్లాడుకున్నాయి. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలక పక్షం, ప్రతి పక్షం ఒకే నాణానికి రెండు వైపులా ఉండే బొమ్మా, బొరుసులాంటి వారు.

ఉ. 11.50

అధ్యక్షా, ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలక పక్షం, ప్రతి పక్షం నాణానికి ఇరు వైపుల వున్నటువంటి బొమ్మల మాదిరి పని చేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఇంకా దోహద పడుతుందని నేను భావిస్తున్నాను. నిన్న పెద్దలు మాట్లాడినప్పుడు చాలా స్టాటిస్టిక్స్ ఇచ్చారు, రేషియోలిచ్చారు, పర్సంటేజి ప్రకారం ఎన్ని మార్కులు గత ఐదు సంవత్సరాల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం సంపాదించుకొందనే విషయాన్ని చెప్పారు. కాని ఆ విషయాల జోలికి ఇప్పుడు పోదలచుకోలేదు కాని రాజ్యాంగంలో వున్న విషయాలనూ రాజ్యాంగంలో పొందుపరచబడని కొత్త కొత్త విషయాలను కూడా సభ దృష్టికి పెద్దలు తీసుకు వచ్చారు. ఆర్టికల్ 324 ప్రకారం ఎలక్షన్ కమీషన్ అనేది అవతరించబడుతుంది. ఎలక్షన్ కమీషన్ క్రియేట్ చేయబడుతుంది. ఇంకా ఆర్టికల్ 325 ప్రకారం ఓటర్ల లిస్టులను తయారు చేయడం, 326 ప్రకారం ఎన్నికలను జరపడం ఇవ్వన్నీ పార్లమెంట్ ఇచ్చినటువంటి ప్రసాదమని నేను భావిస్తున్నాను. దానిలో ఎక్కడా కూడా ఇంత పర్సెంటేజ్ ఓట్లు వచ్చిన వారు మాత్రమే అధికారంలో వుండాలనే నిబంధన లేదు. ఇంత పర్సంటేజ్ ఓట్లు వచ్చిన వాళ్ళు అధికారంలో వుండకూడదనే మాట కూడా ఎక్కడ వాడ బడలేదు. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా వాళ్లు అధికారంలోకి రావచ్చు. నాలుగు ఓట్లు, నాలుగు సీట్లు ఎక్కువ వచ్చిన వాళ్లు ఈ ప్రక్కన కూర్చొంటారు. నాలుగు ఓట్లు, నాలుగు సీట్లు తక్కువ వచ్చిన వాళ్ళు ఆ ప్రక్కన వుంటారు. మనది ప్రజాస్వామ్య వ్యవస్థ. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఏ విధంగా ఎదిగిందనే విషయాన్ని గవర్నర్ ప్రసంగంలో బాగా విశదీకరించారనే విషయాన్ని సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఎలక్షన్ కమీషన్ వారు ఇచ్చిన రిపోర్టు ప్రకారం బీ.ఎస్.పి కి పార్లమెంట్ ఎలక్షన్స్‌కు 0.91 శాతం వస్తే అదే పార్టీకి ఎం.ఎల్.ఏ ఎలక్షన్స్‌కు వచ్చేటప్పటికి 1.05 శాతం అయింది. ఈ విధంగా తీసుకుంటూ వస్తే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఇప్పటివరకు ఇంత పర్సంటేజ్ ఆఫ్ పోల్ జరిగిన సందర్భం లేదని నేను భావిస్తున్నాను. ఓట్లు వేయలేని వారు కూడా వాళ్ళ ఆమోదం ఎవ్వరికి అనుకూలంగా వుందో వాళ్లే తెలపాలి. 28 శాతం మంది ఓటర్లు పోలింగ్ బూత్‌కు రానటువంటి పరిస్థితి ఏర్పడింది. మొట్టమొదటి సారిగా 72 శాతం ఓట్లు ఈ రాష్ట్రంలో పోలైనప్పటికినీ పార్లమెంట్ ఎలక్షన్లకు ఒక విధంగా ఓటు వేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ఒక విధంగా ఓటు

వేశారు. పార్లమెంటుకు సంబంధించి తీసుకుంటే 38.95 శాతం అంటే దాదాపు 39 శాతం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పోలయినాయి. అదే అసెంబ్లీ విషయానికి వస్తే 36.55 శాతం ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చాయి. ఆ పర్సంటేజ్ ప్రకారం పార్లమెంటుకు సంబందించి కాంగ్రెస్ పార్టీకి వేసిన వాళ్లు అసెంబ్లీకి కూడా కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా వేసి వుంటే ఇంకా 30 సీట్లు పెరిగే అవకాశం వుండేది. బీఎస్పికి వచ్చిన ఓట్లన్నీ మావేనని మేము భావిస్తే ఇంకా 20 సీట్లు పెరిగివుండేవి. వీటన్నింటి జోలికి నేను ఇప్పుడు పోదలచుకోలేదు. అయినప్పటికీ కూడా జరిగినటువంటి సత్యాన్ని మీ ముందు పెడుతున్నాను అధ్యక్షా. డిపాజిట్ కోల్పోయిన వ్యక్తి కూడా ఎం.ఎల్.ఏ గా గెలిచారనే విషయాన్ని పెద్దలు వ్యక్తం చేశారు. అసోం లో 200 ఓట్లు వచ్చినటువంటి వ్యక్తులు దాదాపు 14 మంది ఎం.ఎల్.ఏ లుగా ఎన్నిక కాబడ్డారు. ఆ నాడు ఎలక్షన్లు జరిగితే 200 ఓట్లు లోపు ఓట్లు వచ్చిన వారు కూడా ఎం.ఎల్.ఏ లయ్యారు. ఈ విషయం ప్రతిపక్ష నాయకులకు కూడా తెలుసు. వీటన్నింటి జోలికి పోకుండా క్లుప్తంగా రెండు మాటలు చెబుతాను. పర్సంటేజ్ ఆఫ్ ఓట్లలో పాజిటివ్ ఓటా నెగిటివ్ ఓటా అనే దానికి పోతే నిన్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో వచ్చిన ఆర్టికల్ ప్రకారం ఇది పాజిటివ్ ఓటుతో గెలిచినటువంటి ప్రభుత్వమని క్లియర్ పిక్చర్ ఇచ్చిందనే విషయాన్ని సభ ముందుంచుతున్నాను. ఆర్థిక మాంద్యం గురించి వ్యక్తం చేసిన దిలీప్ గారికి ఇది చిన్న సలహా మాత్రమే. ఏర్పాటు వాదం అనే పదం తెలుగులో వుంది. Politics of divisions ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల యొక్క పాత్ర చాలా పెద్దదని చెప్పేందుకు ప్రయత్నం చేస్తాను అధ్యక్షా. ప్రతి పక్షాల యొక్క పాత్రను తీసుకుంటే ప్రభుత్వాన్ని సవ్యంగా నడిపించేందుకు పాలక పక్షం పాత్ర ఎంత వుందో, ప్రతిపక్షం పాత్ర కూడా అంతే వుందని నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియ చేస్తున్నాను. ప్రతిపక్షాలు స్పందించే దానిని బట్టి ఫలితం వుంటుందనే దానికి ఉదాహరణగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారు ప్రధానమంత్రి గా వున్నప్పుడు ఇక్కడ పొట్టి శ్రీరాములు గారు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్షలో వున్నప్పుడు (ఇప్పటి మాదిరిగా ప్రధానమంత్రి దగ్గరకు వెళ్ళాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం వుండేది కాదు) సడన్‌గా ప్రధాన మంత్రిగారి ఇంటికి వెళితే అప్పుడు నెహ్రూ గారు తల స్నానం చేస్తూ తల తుడుచు కుంటూంటే 'What Mr. Nehru, అక్కడ పొట్టి శ్రీరాములు గారు ప్రత్యేక రాష్ట్రం కోసం నిరాహారదీక్షతో చనిపోతూ వుంటే నీకు తల స్నానం చేసే ఓపిక ఎక్కడ నుండి వచ్చిందయ్యా?' అని శ్యాం ప్రసాద్ ముఖర్జీ అంటే నెహ్రూ గారు 'స్నానం చేయడం తప్పా?' అని అడిగి వెంటనే ముఖర్జీ గారితో చర్చించి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చేటటువంటి పరిస్థితి వచ్చింది. అంటే, అక్కడ ప్రతిపక్షం మంచి పాత్రను పోషించడం వల్ల ఇక్కడ పొట్టి శ్రీరాములు గారు నిరాహార దీక్షలో వున్నప్పటికీ కూడా ప్రతిపక్షం మంచి పాత్రను పోషించిందనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. మొన్నటి మొన్న ఈ కౌన్సిల్ ఏర్పడిన తరువాత ప్రొ. నాగేశ్వర్ గారు రంగారెడ్డి జిల్లాలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేదని సభలో అడిగినప్పుడు రోశయ్య గారు స్పందించి వెంటనే అసెంబ్లీకి వెళ్ళి ముఖ్యమంత్రి గారితో చర్చించి ఇక్కడకిక్కడే ప్రభుత్వ డిగ్రీ కాలేజి గురించి ఎనౌన్స్ చేసిన క్రెడిట్ కూడా ఇక్కడున్నటువంటి ప్రతి పక్షానికి దక్కుతుందని మనవి చేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

అధ్యక్షా, భారత రాజ్యాంగంలో ప్రతి పక్షం యొక్క పాత్ర చాలా పెద్దదని తెలియచేస్తూ, వారు constructive side గా ఇచ్చే సూచనలను తీసుకోవడానికి ప్రభుత్వానికి అవకాశం వుంటుందని తెలియచేస్తున్నాను. నిన్ననే పెద్దలు దాడి వీరభద్రరావు గారు చాలా సున్నితంగా మాట్లాడుతూ కత్తి, కలం, శక్తి వుందని వాటిని మీరు వుపయోగించుకుంటే పరిస్థితి చాలా ఇబ్బందిగానే వుంటుందని అన్నారు. ఇక్కడ కత్తిని, కలాన్ని ఉపయోగించుకోవలసిన అవసరం లేదు కాని మన మేధావి తనాన్ని ఉపయోగించుకోవలసిన పని వుందని

తెలియచేస్తున్నాను. 8 కోట్ల ఆంధ్ర ప్రజానీకం అక్కడున్నటువంటి 294+1= 295 మంది శాసన సభ్యులు, ఇక్కడున్నటువంటి 90 మంది ఎం.ఎల్.సీలకు రాజ్యాధికారాన్ని, శాసనాధికారాన్ని ఇచ్చిన తరువాత ప్రజల యొక్క బాగోగులు చూడవలసిన బాధ్యత మనందరి మీద వుందనే విషయాన్ని మీ ద్వారా సభ్యులకు తెలియచేస్తున్నాను. గత ఐదు సంవత్సరాలుగా చేసినటువంటి పనులన్నింటిని కంటిన్యూ చేసే దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి వుందనే విషయాన్ని గవర్నరు గారి ప్రసంగంలో తెలియచేస్తే ఇది నిన్న ఇచ్చినటువంటి క్వశ్చన్ పేపరు ఈ రోజు చూచుకొనేందుకు ఉపయోగపడుతుందని ప్రొ. నాగేశ్వర్ గారు అన్నారు. It is nothing but the continuation of the previous Government's actions and activities. అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు లేవని అడిగిన దానికి ప్రభుత్వం స్పందించి మొట్టమొదటి సారిగా ఈ నెల నిన్న 4 వ తేదీన ఒక జీ.వో. జారీ చేయడం జరిగింది. సాచురేషన్ పాయింట్‌తో the saturation point is in the name of Sri Y.S.Rajayasekhara Reddy. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలున్న అన్ని గ్రామాలకు అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు వేయాలని చెప్పి ఎన్.ఆర్.ఐ.జి.పి మంత్రి గారు ఒక జీవో విడుదల చేయడం జరిగింది. దాని ద్వారా మూడు ప్రాంతాలలో అన్ని గ్రామాలకు డబ్ల్యు.బి.ఎమ్. రోడ్లు రావడానికి మంచి అవకాశం వుందని కూడా తెలియచేస్తూ ఈ అవకాశం నాకు కల్పించినందులకు ధన్యవాదాలు తెలియచేసుకొంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి: అధ్యక్షా, మొన్నటి ఎన్నికలలో రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వాన్ని ప్రజలు మరల గెలిపించారు. వారిలో ముఖ్యంగా రిటైరయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల వెల్ఫేర్ మిషన్ యొక్క కృషి కూడా వుంది. రాజశేఖర రెడ్డి గారు మరల ముఖ్యమంత్రి కావాలని ఈ మేధావి వర్గం కోరుకుంది. రాజశేఖర రెడ్డి గారు మరల ముఖ్యమంత్రిగా వస్తే డి.ఏ., పీఆర్‌సీ మొదలైనవి చాలా వరకు ఉద్యమాలు లేకుండా సాధించుకోవచ్చనే ఉద్దేశంతో, నమ్మకంతో నాలుగు లక్షల మంది రిటైర్డు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను ఏకం చేయడానికి స్థాపించిన వెల్ఫేర్ మిషన్ 23 జిల్లాలు తిరిగి మరల రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని ప్రచారం చేసి గెలిపించుకోవడం జరిగింది. వాస్తవం కూడా అదే. రాజశేఖర రెడ్డి గారి పరిపాలనను చూచి ప్రజలు మెచ్చి మరల వారి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వమే మరల వస్తుందని, రాజశేఖర రెడ్డి గారే మరల ముఖ్యమంత్రి అవుతారని మేము ప్రతి చోట ఘంటాపథంగా చెప్పడం జరిగింది. ఏదేమైనా, ఒక్క ప్రక్క ఆరోగ్యశ్రీ, పెన్షన్లు, రెండు రూపాయలకు కిలో బియ్యం, జలయజ్ఞం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తూ, మరొక ప్రక్క అభివృద్ధి పథకాలు కూడా చేపట్టడం జరిగింది కాబట్టి ప్రజలు కూడా ఈయన ముఖ్యమంత్రిగా వుంటే భవిష్యత్తులో మంచి జరుగుతుందని భావించారు.

మ. 12.00

అధ్యక్షా, రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరిగింది. ఖచ్చితంగా ఈ ప్రభుత్వం మేలు చేస్తుందని ప్రజలు భావించడం జరిగింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిగారు హోం మినిష్టరుగా ఉన్నారు. భారతదేశంలో ఇంతవరకూ ఎక్కడా ఒక మహిళ హోం మినిష్టరుగా పనిచెయ్యడం జరుగలేదు. మహిళలు ఏ విధంగా పరిపాలన చేస్తారో నిరూపించాలని, వారు సబలలు అనే ఉద్దేశ్యంతో గౌరవనీయులు డా. వై.యస్. రాజశేఖరరెడ్డి గారు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిగారిని హోంమినిష్టరుగా చెయ్యడం ఎంతో సంతోషించతగ్గ విషయం. అలాగే కొత్త కొత్త పద్ధతుల ద్వారా రాజశేఖరరెడ్డిగారు ప్రభుత్వాన్ని నడిపిస్తారని

ఆశిస్తున్నాము. అదే విధంగా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, కార్మికులకు మేలు చేస్తారనే విశ్వాసంతో వారున్నారనే విషయం తమ దృష్టికి తీసుకువస్తున్నాను.

ప్రజలకు మంచినీటి వసతి కల్పించవలసిన అవసరం ప్రభుత్వంపై ఉంది. భోలక్‌పూర్‌లో కలుషిత నీరు త్రాగి కొందరు చనిపోయారు, మరికొందరు ప్రాణాపాయ పరిస్థితులలో ఉన్నారు. సురక్షితమైన నీటిని త్రాగే హక్కు ప్రజలకు ఉంది. మంచినీటి వసతిని ఏర్పాటుచేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఉన్నది. చాలా చోట్ల వర్షాలకు రోడ్లు పాడయ్యాయి. కాబట్టి రోడ్లను కూడా త్వరితగతిని బాగుచెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉందని తమ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను.

స్కూల్ ఎడ్యుకేషన్ మినిష్టరుకు ప్రమోషన్ ఇచ్చారని ఈ రోజు పేపర్లో వచ్చిన విషయం అందరికీ తెలుసు. ఇంటర్మీడియట్ విద్యను తీసుకువచ్చి స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలిపారు. ప్రభుత్వం యొక్క ఎడ్యుకేషన్ పాలసీ ఏమిటి? ఇంటర్మీడియట్ బోర్డు లెక్చరర్ల సర్వీసు విషయాలేమిటి? వాళ్లు ఏ విధంగా విలీనమవుతారు? ఇక్కడ అనేక సమస్యలు వస్తాయి. కాబట్టి ఒక నిపుణుల కమిటీని వేసి అందులో టీచర్ ఎమ్ఎల్‌సీలను, డాక్టరేట్స్‌ను సభ్యులుగా వేసి, రెండు బోర్డుల విలీనంలో ఎదురయ్యే సమస్యలను, లోటుపాట్లను చర్చించి ఒక నెలరోజులలోగా రిపోర్టు ఇవ్వమని చెబితే బాగుంటుందని తమ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను. అలా కాకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఉదయం మా దగ్గరకు లెక్చరర్లు వచ్చి చెప్పినప్పుడు, నేను ఈ విషయాన్ని హయ్యర్ ఎడ్యుకేషన్ మినిష్టరుగారికి అదేవిధంగా ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెడతానని వారికి చెప్పడం జరిగింది. ఎయిడెడ్ టీచర్లకు జీతాలు సరిగ్గా రావడం లేదు, అన్ ఎయిడెడ్ సర్వీసు టీచర్ల సమస్య కూడా అలాగే ఉంది, స్వయంగా రాజశేఖర రెడ్డిగారు జాక్టోతో చర్చలు జరిపి ఒక అగ్రిమెంట్ చెయ్యడం జరిగింది. ఆ అగ్రిమెంట్ ప్రకారం జీవో రావలసిన అవసరం ఉందని కూడా తమ దృష్టికి తీసుకువస్తున్నాను. ఏకీకృత సర్వీసు రూల్సు రాష్ట్రంలో లేకపోవడం వల్ల మూడు లక్షల మంది ఉపాధ్యాయులకు అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమోషన్లు, బదిలీలు రాక అనేక అవస్థలు పడుతున్నారు. కాబట్టి విద్యాశాఖమంత్రిగారు, ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకుని త్వరగా ఏకీకృత సర్వీసు తీసుకువస్తే, MEO, Dy. DEO, DEO పోస్టులను కూడా భర్తీ చేస్తే విద్యా ప్రమాణాలు పెరగడానికి అవకాశముంటుంది.

సుప్రీంకోర్టు మధ్యాహ్న భోజన పథకాన్ని కంపల్సరీ చేసినప్పటినుండి మన రాష్ట్రంలో 12 లక్షలమంది విద్యార్థుల ఆకలి శాతం పెరిగింది. పేద ప్రజల మీద ఈ మధ్యాహ్న భోజన పథకం ఏ విధంగా పనిచేసిందో మనకు తెలుస్తుంది. మధ్యాహ్న భోజన పథకం అంతా బాగుంది గానీ, డబ్బులు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల వంట చేసి, ఆహారాన్ని తయారు చేసి ఇచ్చే ఏజెన్సీలకు చాలా ఇబ్బందిగా ఉందనే విషయాన్ని వారు మా దృష్టికి తీసుకువచ్చారు. అందుకని మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన నిధులను సకాలంలో విడుదల చెయ్యాలనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను. ముఖ్యంగా పండిట్లు, పీయుటి పోస్టులకు మన ప్రభుత్వమే జీవో ఇచ్చింది. వాటిని అమలు చెయ్యలేదు. ఆయా పోస్టులను అప్‌గ్రేడేషన్ చేసి పండిట్లకు, పీయుటిలకు ప్రమోషన్లు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

అసెంబ్లీ, కౌన్సిల్‌లను ఒకదానితో ఒకటి పోల్చుకున్నప్పుడు కౌన్సిల్‌కు అంత ప్రాధాన్యతని ఇవ్వడంలేదు. అధికారులు ఎమ్ఎల్‌సీలను కేర్ చెయ్యడంలేదు. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా కౌన్సిల్ రావడం

రాజశేఖరరెడ్డిగారి పుణ్యమే. ఈ విధంగా ఏర్పాటు చేశాక మరి రెండింటిని సమానంగా చూడాలి కదా? అక్కడ లైవ్ టెలికాస్ట్ ఉంది. వారి ప్రసంగాలను ప్రజలు వినే అవకాశమున్నది. కానీ కౌన్సిల్‌లో పరిస్థితి వేరుగా ఉన్నది. ఇక్కడ విషయాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. కౌన్సిల్‌ను పెద్దల సభ అంటున్నారు, ఇక్కడ మంచి మంచి ఉపన్యాసాలు జరుగుతుంటాయని, చట్టాలను బాగా పరిశీలిస్తున్నారని అంటారు కానీ, ఇవి సామాన్య ప్రజలకు ఏమాత్రం చేరడం లేదు. ఎమ్ఎల్ఏలకు మాదిరి ఎమ్ఎల్సిలకు తమ తమ నియోజక వర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదు. ఎమ్ఎల్ఏలను తక్కువ చెయ్యమని నేను కోరడం లేదు. కానీ, లైవ్ విషయంలో మాత్రం రెండు సభలు సమానంగా ఉండాలి. పెడితే లైవ్ ఇక్కడ కూడా పెట్టాలి, లేదా అసెంబ్లీలో తీసివెయ్యాలి. రెండు కళ్లు అన్నప్పుడు రెంటినీ సమానంగా చూడాలి అంతేకానీ ఒక కన్ను బాగుండి, రెండోకన్ను మెల్లకన్ను అయితే బాగుండదు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను. రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వాన్ని మేము నిండు హృదయంతో సమర్థిస్తున్నాము. రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వాన్ని మళ్లీ ఒకసారి అభినందిస్తూ, నాకీ అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మ. 12.10

శ్రీ టి. భానుప్రసాద రావు (కరీంనగర్) : అధ్యక్షా, గవర్నర్ గారి ఉపన్యాసంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. గత 5 సంవత్సరములుగా ఈ రాష్ట్రంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించినటువంటి వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు హర్షిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని ప్రకటిస్తూ, మరోసారి మరో 5 సంవత్సరములపాటు ప్రభుత్వానికి అవకాశం ఇవ్వడమంటే ఇది కేవలం ఒక ప్రభుత్వం 5 సంవత్సరములలో నిర్వహించినటువంటి వివిధ కార్యక్రమాల ఫలితమేనని చెబుతున్నాను. గడచిన 5 సంవత్సరములలో తీసుకున్నట్లయితే నేషనల్ లెవెల్‌లో యావరేజ్ గ్రోత్ రేట్ కనుక తీసుకున్నట్లయితే, 8.5 శాతం ఉంది. 1999-2004 లో తీసుకున్నట్లయితే 6.06 శాతం మాత్రమే ఉంది. కానీ ఈ ప్రభుత్వం వీటన్నింటినీ అధిగమిస్తూ 9 శాతం యావరేజ్ గ్రోత్ రేట్‌ను సాధించడం జరిగింది. ఎగ్రికల్చరల్ అండ్ ఎలైడ్ యాక్టివిటీస్‌లో తీసుకున్నట్లయితే నేషనల్ టార్గెట్ కేవలం నాలుగు శాతమే ఉన్నప్పుడు దేశంలోని ఏరాష్ట్రము సాధించని విధంగా చేసింది. ఇంతవరకు 6 శాతాన్ని మించి అగ్రికల్చరల్‌లో కాని, ఎలైడ్ యాక్టివిటీస్‌లో కాని ఏ రాష్ట్రము సాధించలేదు. మొట్టమొదటిసారిగా గత ఐదు సంవత్సరములలో ఈ రాష్ట్రం 6.38 శాతం అభివృద్ధిని సాధించి దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా ఆవిర్భవించింది. గత రెండు సంవత్సరములుగా ఫుడ్‌గ్రెయిన్స్ ప్రొడక్షన్‌లో కూడా మన రాష్ట్రం అభివృద్ధి సాధించింది. అంతేకాదు ఫుడ్ గ్రెయిన్ ప్రొడక్షన్ 199 లక్షల టన్నులకి చేరడం జరిగింది. ఈ 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో గత రెండు సంవత్సరాలలో 28 శాతం అభివృద్ధిని మన రాష్ట్రం సాధించింది.

ఇండస్ట్రియల్ సెక్టారులో నేషనల్ యావరేజ్ చూసినట్లయితే 8.8 శాతం ఉన్నది. మన రాష్ట్రం 10.19 శాతం గ్రోత్ రేట్‌ను సాధించడం జరిగింది. 1999-2004 సంవత్సరములలో చూసినట్లయితే ఇది కేవలం 5.96 శాతం. అంటే ఈ 5 సంవత్సరములలో సాధించినటువంటి అభివృద్ధికి గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి చూసుకున్నట్లయితే దాదాపు రెట్టింపుగా ఉందని చెప్పడానికి నేను చాలా గర్వపడుతున్నాను.

ఆర్థిక నిర్వహణ కోసం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నది మన రాష్ట్రం. ఈ విషయాన్ని కూడా గర్వంగా చెప్పుకోవడం జరుగుతున్నది. గౌరవ మిత్రులు చెప్పినట్లుగా A+ ర్యాంకింగ్ సాధించడం

జరిగింది. గడచిన 5 సంవత్సరములలో రాష్ట్ర రాబడులు 18 శాతానికి పెరిగాయి. ఈ పెరుగుదల కూడా దేశంలో మరే రాష్ట్రంలో లేనటువంటి విధంగా మన రాష్ట్రమే సాధించడం జరిగింది. అందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాలే ఈ అభివృద్ధిని సాధించడానికి తోడ్పడ్డాయి. మన రాష్ట్రంలో బి.హెచ్.ఇ.ఎల్., ఈ.సి.ఐ.ఎల్., బి.హెచ్.పి.వి., హెచ్.సి.ఎల్., వంటి ఎన్నో ప్రాజెక్టులు గతంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కానివ్వండి, గత ఐదు సంవత్సరముల కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే కానివ్వండి - ఈ రాష్ట్రంలో ఇండస్ట్రీస్ అన్నీ రావడం జరిగింది. అంతకు ముందు 9 సంవత్సరములు పాలించినటువంటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక్క మేజర్ ఇండస్ట్రీ కూడా ఈ రాష్ట్రంలో సాధించబడలేదని చెబుతున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే ఈ రాష్ట్రంలో ఇండస్ట్రియల్ గ్రోత్ జరిగింది. ఏ ఒక్క ఇండస్ట్రీ కూడా 9 సంవత్సరముల పాలనలో రాలేదు. ఈ రోజు సిమెంట్, స్టీల్, హెవీ ఎలక్ట్రికల్స్, ఎక్విప్‌మెంట్స్, నిన్నో మొన్నో చూశాము మనం హెలీకాప్టర్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కూడా మన రాష్ట్రంలో హైదరాబాద్‌లో రాబోతున్నది. ఈవిధంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రభుత్వ హయాములో జరిగాయి. రానున్న ఐదు సంవత్సరముల కాలంలో ఇలాగే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పడం జరిగింది. దానికి పూర్తి స్థాయిలో కట్టుబడతామని చెబుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (అసెంబ్లి) : అధ్యక్షా, ఈ రోజు ఈ సభలో మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మేము అధికారంలోకి వస్తామని ఆశించాము. అనుకోకుండా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మేము ఊహించలేదు. ఏది ఏమైనా మీకు అభినందనలు తెలియజేస్తున్నాము. గవర్నరుగారి ప్రసంగంపైన ఈ రోజు చర్చ జరుగుతున్నది. నేను ఒక విషయం చెప్పదలచుకున్నాను. నేను ఈ సభలోకి వస్తాననుకోలేదు. ఎప్పుడూ రాజ్యసభకు వెడదామని ఆశించేదాన్ని. లోక్‌సభలోగానీ, శాసన సభలో కానీ పోటీ చేద్దామంటే నాకున్న పరిస్థితులవల్ల నేను పోటీ చేయాలని అనుకోలేదు. ఏది ఏమైనా 15 సంవత్సరముల గ్యాప్ తరువాత మీ అందరి మధ్య పెద్దల సభలో మాట్లాడే అవకాశం మాకు మా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు గారు ఇచ్చారు అందుకు నేను ఎంతో ఋణపడి ఉంటాను. రాజకీయాలలో ఏదీ శాశ్వతం కాదు. వ్యాపార రంగం, సినీ రంగం, క్రీడా రంగం, రాజకీయ రంగం ఏదైనా ఎప్పుడు ఏమి జరుగుతుంది, ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు అని చెప్పలేని పరిస్థితి వచ్చిందని మీ అందరకు తెలుసు. పోనీ పనిచేస్తే గెలుస్తారని, నిజాయితీగా ఉంటే గెలుస్తారని లేదు. అవినీతిలో కూరుకుపోతే ఓడిపోతారని లేదు. అలాగే పని చేయకుండా ప్రజలకు కనిపించకపోయినా వాళ్లు గెలవకుండా ఉంటారని కూడా లేదు. మీరు కనుక వాస్తవాన్ని గమనించినట్లయితే అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఈ రోజున ఎవరూ కూడా గెలిచినందుకు పొంగిపోకూడదు, ఓడిపోయినందుకు కృంగిపోకూడదు. ప్రజల పక్షాన మేమున్నాము. ప్రజలు మమ్మల్ని గెలిపించారని అధికార పక్షం అంటున్నది. మేము ప్రజల పక్షాన వాదించడానికి ప్రతిపక్షంలో కూర్చుని ఉన్నామని మేము అనుకుంటున్నాము. కావున ప్రజల పక్షాన మాట్లాడవలసిన బాధ్యత మా మీద ఉన్నది. గవర్నరుగారి ప్రసంగంలో సమస్యలనేవి ఎక్కడా ప్రస్తావించలేదు. గవర్నరుగారి ప్రసంగం మీకు తెలుసు. ప్రభుత్వమే వ్రాసి ఇస్తే, ఆయన చదువుతారని తెలుసు. ఏది ఏమైనా గవర్నరుగారి ప్రసంగంలో అన్నీ కూడా విజయాలే తప్ప, అపజయాలు, అవినీతి, ధరల గురించి ఎక్కడా ప్రస్తావన రాలేదు. ముఖ్యంగా నిన్న సుధాకర్ రెడ్డి గారు మాట్లాడారు, పెద్దలు ముస్లిం మైనారిటీ నాయకులు అయినా కూడా చక్కని కవిత్వంతో వారు మాట్లాడారు.

మ.12.20

సుధాకర్‌రెడ్డిగారు చాలా చక్కగా మాట్లాడారు. అయితే వారు కొన్ని చురకలు అంటించారు. వారు మాట్లాడిన దాని గురించి సమాధానం చెప్పవలసిన అవసరం లేకపోయినప్పటికీ, ఈ సభలో వారు మాట్లాడిన దాన్ని అందరు విన్నారు కాబట్టి దాని గురించి కూడా ప్రస్తావించవలసిన అవసరం ఉంది. వారు ఏమన్నారంటే, బ్రహ్మాండమైన కార్యక్రమాలు చేపట్టాం, ఒక్క ఆరోగ్యశ్రీ ఏమిటి, ఒక్క పావలా వడ్డీ ఏమిటి, అన్నీ కూడా చేయడం వల్లనే మేము విజయం సాధించామని చెప్పారు. నేను ఒకటే మనవి చేస్తున్నాను. పావలా వడ్డీ గురించి మీరు మాట్లాడారు. కాని సారా బుడ్డీ గురించి మీరు మాట్లాడలేదు. పావలా వడ్డీ ఇస్తున్నామన్నారు. అక్కలకు పావలా వడ్డీ ఇచ్చి, బావలకు సారా బుడ్డీ ఇచ్చి, బాగా తాగి మహిళల్ని తన్నమని చెపుతున్నారు......

(శ్రీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తనకు అవకాశం ఇవ్వవలసిందిగా కోరసాగారు)

అధ్యక్షా, సుధాకర్‌రెడ్డిగారు మాట్లాడుతున్నప్పుడు మేము సంయమనంతో కూర్చొని విన్నాము. కాబట్టి మేము మాట్లాడుతున్నప్పుడు వారు మాట్లాడకుండా ఉంటే బాగుంటుంది.....

(శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి నుండి అంతరాయం)

అధ్యక్షా, ఇందాక మీరు మంత్రులకే అవకాశం ఇవ్వలేదు. నాగేందర్‌కు కూడా అవకాశం ఇవ్వలేదు. కాబట్టి ఇప్పుడు అతనికి అవకాశం ఇవ్వొద్దు.

అధ్యక్షా, ఈ రోజు అధికార పక్షం ఒక విషయం ఆలోచించాలి. ఆరోగ్యశ్రీ గురించి చెప్పారు. సాధారణంగా నేను చాలా ఆవేశంతో మాట్లాడుతాను. కాని నిన్ననే అసెంబ్లీలో చూశారు మా నాయకుడు ఆవేశంతో మాట్లాడకుండా ఆలోచనతో బాగా మాట్లాడారు. కాబట్టి మేము కూడా ఆవేశాన్ని తగ్గించుకుని, మేము కూడా నవ్వుతూ మాట్లాడుతూ, ఆలోచనతో ప్రభుత్వానికి సూచనలు చేయదలచుకున్నాను. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా ఉందని ఎవరైనా అనుకుంటే అది చాలా పొరపాటు. ఒక్క ఓటుతో గెలిచినా అది గెలుపు కావొచ్చు. కాని ఇక్కడ ఒకటి ఆలోచించాలి. ముఖ్యమంత్రిగారు ఇటీవల ఒక మాట చెప్పారు. మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెపుతోంది, ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండమని. కాబట్టి మొట్టమొదటి వాక్యం మీకు వర్తిస్తుంది. రెండవది ఎవరికి వర్తిస్తుందో అది మీరే ఆలోచించాలి. రెండవ వాక్యాన్ని కూడా మీరు గుర్తుంచుకోండి. కాబట్టి ఎక్కడైతే ఓటమి ఉంటుందో, అక్కడ గెలుపు బాట కూడా మనకు కనిపిస్తుంది. ఆకులు ఎక్కడైతే రాలుతాయో అక్కడే కొత్త చిగురు వస్తుంది. కాబట్టి .....

(శ్రీ డి. నాగేందర్ నుండి అంతరాయం)

నాగేందర్‌గారు, మీకు చాలా ఉన్నతమైన ఆరోగ్య శాఖ వచ్చింది. అసలు మీకు ఆ శాఖ వస్తుందని అనుకోలేదు. కాబట్టి కాస్త డిగ్నిఫైడ్‌గా ఉండండి. ....

(అధికారపక్షం నుండి అంతరాయం)

అధ్యక్షా, ఇంకొకటి. ఎవరికైతే మెజార్టీ వస్తుందో టెక్నికల్‌గా వారు గెలిచినట్లుగా అనౌన్స్ చేస్తారు. మీకు మెజార్టీ వచ్చింది కాబట్టి మీరు అధికారంలోకి వచ్చారు. ఎన్ని సీట్లు వచ్చాయన్నది ముఖ్యం కాదు, ఎంత శాతం ఓట్లు వచ్చాయో అనేది ముఖ్యం. గత అయిదు సంవత్సరాల్లో మేము చక్కగా పరిపాలించాము, కాబట్టి రాజశేఖర్‌రెడ్డిగారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిందని అంటున్నారు. నిజమే. మాకన్నా మీకు కొద్దిగా మెజార్టీ వచ్చింది కాబట్టి మీరు అధికారంలోకి వచ్చారు. మీరు ప్రమాణ స్వీకారం చేయగలిగారు. అయితే అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు. దాన్ని మనమందరం ఈవేళ గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది. ఈ పదవుల్లో శాశ్వతంగా ఉంటామని ఎవరూ అనుకోవద్దు. ఈరోజున మీరు ప్రజల పక్షాన నిలబడి, ప్రజలు ఏమైతే ఆలోచన చేస్తున్నారో, వాటి గురించి మీరు ఆలోచించండి. పథకాల అమలు తీరులో ఉన్న లొసుగుల గురించి మీరు ఆలోచించడం లేదు, సొగసుల గురించి అధికారపక్షం ఆలోచిస్తోంది. ఇక్కడ మంత్రులు ఉన్నారు. వారి తాలూకు సభ్యులు కూడా ఇక్కడ ఉన్నారు. నేను ఒకటే మనవి చేస్తున్నాను. మీరు మాట్లాడితే ప్రతిసారీ ప్రజలు మమ్మల్ని తిరస్కరించారని అంటున్నారు. అంత ఎగతాళిగా మీరు మాట్లాడవద్దు. ఎందుకంటే, 1983లో ఆంధ్ర దేశ ప్రజలు ఎవర్ని తిరస్కరించారు? 1985లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవర్ని తిరస్కరించారు? 1994 లో ఎవర్ని తిరస్కరించారు? 1999లో ఎవర్ని తిరస్కరించారు? 1994లో నీతి నిజాయితీలతో కూడిన కోట్ల విజయభాస్కరరెడ్డి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా, కేవలం 26 సీట్లు మాత్రమే వచ్చిన సంగతి గుర్తుంచుకోండి. కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాకపోతే, ఆనాడు విజయభాస్కరరెడ్డి అసెంబ్లీకి నేను రాను, చిన్నతనంగా ఉందని అంటే, జనార్దన రెడ్డిని పెట్టి అసెంబ్లీని నడిపించారు. కాబట్టి వాటన్నింటిని గుర్తుంచుకోవాలి. ఇందిరాగాంధీ అపోజిషన్‌లో ఉన్నారు. రాజీవ్‌గాంధీ అపోజిషన్‌లో ఉన్నారు. పి.వి. నరసింహారావు అపోజిషన్‌లో ఉన్నారు. సోనియా గాంధీ అపోజిషన్‌లో ఉన్నారు. అదే విధంగా ఈనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో నాలుగుసార్లు అపోజిషన్ లీడరుగా ఉన్నారు. అదే విధంగా పార్లమెంటులో ఆయన అపోజిషన్‌లో కూర్చొన్నారు. కాబట్టి ఎప్పుడూ కూడా మేమే అధికారంలో ఉంటాం, మాదే గెలుపు, ప్రజలు మాయందు ఉన్నారు అని అనుకోవద్దు. ఈవేళ నూటికి నలభై శాతం ప్రజలు కూడా మీకు అనుకూలంగా ఓటు వేయలేదు. 60 శాతం పైగా ప్రజలు మీకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీల వల్ల కావొచ్చు, బిజెపి వల్ల కావొచ్చు, టిఆర్ఎస్ వల్ల కావచ్చు, పిఆర్‌పి వల్ల కావొచ్చు, టిడిపి వల్ల కావొచ్చు, 60 శాతం ఓట్లు మీకు వ్యతిరేకంగా పడ్డాయనే విషయాన్ని మీరు గుర్తుంచుకొని పరిపాలన చేయండి.

ఈరోజు ఆరోగ్యశ్రీ పథకాన్ని బ్రహ్మాండంగా చేస్తున్నామని మీరు అనుకోకండి. ఈవేళ్టి పేపరు చూడండి. ఈవేళ గాంధీ హాస్పిటల్‌లో కాని, ఉస్మానియా హాస్పిటల్‌లో కాని, నీలోఫర్ హాస్పిటల్‌లో గాని బిడ్డలు మాయమైపోతున్నారు. పేషంట్లు చచ్చిపోతున్నారు. ఎక్కించడానికి బ్లడ్ ఉండటం లేదు. తినడానికి బ్రెడ్ ఉండటం లేదు. పడుకోవడానికి బెడ్ ఉండటం లేదు. ఒక్కొక్క బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు పేషంట్లను పడుకోబెడుతున్నారు. మీరు కేవలం కార్పొరేట్ హాస్పిటల్స్ గురించే ఆలోచిస్తున్నారు. గవర్నమెంట్ హాస్పిటల్స్ గురించి పట్టించుకోవడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైపు అసలు మీరు చూస్తున్నారా అని అడుగుతున్నాను. దయచేసి ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ గురించి ఆలోచించండి.

అధ్యక్షా, ఇందిరమ్మ ఇళ్ల గురించి చాలా చెపుతున్నారు. అసలు ఇప్పటి వరకు ఎన్ని కట్టారు? ఎన్ని లక్షల అప్లికేషన్స్ వచ్చాయి? ఎంత మంది లబ్దిదారులకు ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించారో నియోజకవర్గాల వారీగా చెప్పండి. కాంగ్రెస్ అభిమానుల్నే ఇందిరమ్మ ఇళ్ల గురించి అడిగినపుడు, మీరే రూ.30 వేలు పెట్టుకుని

పునాది వేసుకోండి అని అన్నారని చెప్పారు. పునాది వేసుకున్న తర్వాత, గోడ కట్టుకోవడానికి కొంత కాలం పట్టింది, ఆ తర్వాత పై స్లాబ్ వేయడానికి కొంత కాలం పట్టింది, తలుపులు పెట్టడానికి కొంత కాలం, లెట్రిన్ కట్ట డానికి మరికొంత కాలం, ఈలోపు మేము వడ్డీకి బయట నుండి తెచ్చుకున్న ఋణ భారం పెరిగిపోయిందని వారే చెప్పడం జరిగింది. చాలా చోట్ల చాలా మంది లబ్దిదారులు అప్పుల పాలయ్యారు. ఇప్పటికి కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. దాన్ని మీరు గమనించమని ఈ సందర్భంగా కోరుతున్నాను.

ఇక నిత్యావసర వస్తువుల ధరలు గురించి గవర్నరుగారి ప్రసంగంలో అసలు ప్రస్తావనే లేదు. ఏదైనా అంటే మేము అనేక నీటిపారుదల ప్రాజక్టులు కడుతున్నాం, దాని వల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగిందని అంటున్నారు. నేను కూడా రైతు కుటుంబం నుండే వచ్చాను. రైతు ఎన్ని కష్టాలు పడతాడో తెలుసు. రైతుగా ఉన్న మా నాన్నగారి కష్టాలు చూశాను, మా తాతగారి కష్టాలు చూశాను. కష్టాలు పడే రైతు కుటుంబం నుండే నేనూ వచ్చాను. కాని రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాల సరఫరా గురించి గవర్నరుగారి ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించకపోవడం చాలా శోచనీయం. ఈనాడు రైతు, బజార్లో ఎరువుల్ని కాని, విత్తనాల్ని కాని కొనే పరిస్థితిలో లేడు. పండించిన పంటను దాచుకొనేందుకు మార్కెట్ యార్డుల్లో స్థలం లేదు. వర్షాలకు ధాన్యం తడిసిపోయి, ఆ విధంగా కూడా రైతు నష్టానికి గురవుతున్నాడు. వీటి గురించి మీరు ఆలోచిస్తున్నారా? కేవలం ప్రాజక్టులు కడితే సరిపోతుందా? రైతు కుటుంబానికి విద్య అవసరం లేదా? వంట చేసుకోవడానికి నూనె అవసరం లేదా? కనీసం రైతు భార్య బొట్టు బిళ్ల పెట్టుకోవడానికి గాని, రుద్దుకునేందుకు సబ్బు బిళ్ల కొనుక్కోవడానికి గాని వీల్లేని పరిస్థితులున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అర్ధరూపాయి ధర ఉండే బొట్టు బిళ్ల ఈరోజు అయిదు రూపాయలయింది. టిడిపి హయాంలో .............

(కాంగ్రెస్ పక్ష సభ్యుల నుండి తీవ్ర అంతరాయం)

మీరు నిన్నటి నుండి మాట్లాడుతున్నప్పుడు మేము మాట్లాడకుండా కూర్చోన్నాం. మేము మాట్లాడుతుంటే ఎందుకు మాట్లాడుతున్నారు? దయచేసి మీరు మాట్లాడవద్దు. మేము మాట్లాడుతున్నప్పుడు మౌనంగా కూర్చొనే సంస్కారం నేర్చుకోండి. ఈరోజు నేను వాస్తవాలు చెపుతున్నాను. నేను పోట్లాడటం లేదు. నేను ప్రస్తావించే అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది. ప్రతి వారు రైతు కుటుంబాల నుండి వచ్చిన వాళ్లమే. కలెక్టర్లు కావొచ్చు, ముఖ్యమంత్రి కావొచ్చు, ప్రధానమంత్రి కావొచ్చు, ఐఏఎస్ ఆఫీసర్లు కావొచ్చు. కాని రాత్రనక పగలనక కష్టపడి పంట పండించుకునే రైతు కుటుంబంలోని ఆడవాళ్లు సబ్బు బిళ్ల రుద్దుకోవద్దా? బొట్టు బిళ్ల పెట్టుకోవద్దా? వాళ్ల ఇంట్లో కూరగాయలు తినొద్దా? నూనె వాడొద్దా? ఈ రోజు ఏ నిత్యావసర వస్తువు ధరలు చూసినా విపరీతంగా పెరిగిపోయాయి. ఉల్లిపాయలు 25 రూపాయలా? టమాటాలు 40 రూపాయలా? బెండకాయలు 38 రూపాయలా? దోసకాయలు 20 రూపాయలా? బంగాళదుంపలు 18 రూపాయలా? ఈ విధంగా ఈరోజు ఏది చూసినా విపరీతంగా ధరలు పెరిగిపోయాయి. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి. అట్లాగే పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు ఎన్నిసార్లు పెరిగాయి? ఇవేవి రైతు కుటుంబాలకు అవసరం లేదా? ఆ విషయం గురించి మీరు ఎందుకు ఆలోచించడం లేదు? మా లీడరు చంద్రబాబునాయుడుగారు తొమ్మిది సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా చేశారు. మేము వస్తేనే వర్షాలు వస్తాయి, చంద్రబాబునాయుడు వస్తే వర్షాలు పడవు అన్నారు. అయితే మా హయాంలో వర్షాలు పడకపోయినా నాణ్యమైన కరెంట్ ఇచ్చాం. వర్షాలు పడకపోయినా తాగునీరు, సాగునీరు ఇచ్చాము. కాని మీ హయాంలో పుష్కలంగా వర్షాలు పడినా, రిజర్వాయర్లు పొంగిపోర్లినా ఈవేళ

తాగడానికి తాగునీరు లేదు, సాగునీరు లేదు. కరెంట్ లేదు. వాటి గురించి ఆలోచించకుండా, సమర్థవంతమైన పరిపాలన అందించాము, అందుకే ప్రజలు మమ్మల్ని గెలిపించారు, మాకు మెజార్టీ వచ్చింది అనకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండని నేను కోరుతున్నాను. ఈవేళ అన్నిటిని కడప జిల్లాకు తరలిస్తున్నారు. పులివెందుల, ఇడుపులపాయకు పోతున్నాయి తప్ప, ఆంధ్ర దేశంలోని ఇతర జిల్లాల అవసరాల గురించి ఆలోచించకుండా, కేవలం కడప జిల్లా గురించే...........

(అధికారపక్షం నుండి అంతరాయం)

అన్ని జిల్లాలకు న్యాయం జరగాలి ఈ ప్రభుత్వంలో అని కోరుకుంటున్నాను. మళ్లీ మీరు అధికారంలోకి వచ్చారు కాబట్టి ఇకనైనా జాగ్రత్త వహించండి. మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. సక్రమంగా అన్ని జిల్లాలకు సమ న్యాయం జరిగేటట్లు ఆలోచన చేయండి. ప్రాజక్టుల నిర్మాణ విషయానికి వస్తే ఒకటి మనవి చేస్తున్నాను. అసలు ఇప్పటి వరకు మీరు ఎన్ని ప్రాజక్టులు కట్టారో గవర్నరుగారి ప్రసంగంలో చెప్పలేదు. ఎన్ని పూర్తయ్యాయో లేదు.....

(ఈ దశలో అధికారపక్షానికి చెందిన సభ్యులు ఒకరు కూర్చోండి అని అన్నారు)

కూర్చోమని చెప్పవలసింది మీరు కాదు. అధ్యక్షుల వారు నాకు పర్మిషన్ ఇచ్చారు. మీరు కూర్చోమంటే కూర్చొనే వ్యక్తిని కాదు నేను.

మ.12.30

నన్నపనేని ఇక్కడ ఉందని మీరు గమనించండి.

(ట్రెజరీ బెంచెస్ నుంచి తీవ్ర అంతరాయం)

నేను మిమ్మల్ని ఏమి అనడం లేదు. నేను నిజాలు చెబుతున్నాను. మేము ప్రజల పక్షాన మాట్లాడే వాళ్లం. మీరు అధికార పార్టీలో ఉన్న వాళ్లు. మేము ప్రజల పక్షాన వాదించే వాళ్లం.

(శ్రీ పొంగులేటి సుధాకరరెడ్డిచే సభకు అంతరాయం)

కూర్చోమని చెప్పడానికి మీరెవరు? ఛైర్మన్ గారు చెబితే మేము వింటాం. నిన్న మీరు ఎందుకు మాట్లాడారు? మీకు మాట్లాడే హక్కు ఉన్నప్పుడు మాకు మాట్లాడే హక్కు లేదా? మీకేమన్నా కొమ్ములు వచ్చాయా? నిన్న ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు? ఓటమిని ఎప్పుడూ ఎరుగనట్లు మాట్లాడారు? విజయమంటే ఏమిటో తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ తెలియనట్లు మాట్లాడారు.

(అంతరాయం)

మీరు మాట్లాడుతున్నప్పుడు మేము శ్రద్ధగా విన్నాం. అలాగే మేము మాట్లాడుతున్నప్పుడు కూడా మీరు శ్రద్ధగా వినాలి.

అధ్యక్షా, ఈరోజున ఆరోగ్యశ్రీ అనేది కడుపు నొప్పికి, తల నొప్పికి, కాలు నొప్పికి, పాము కాటుకైనా, కుక్క కరచినా, లేక గర్భిణీ స్త్రీకైనా ప్రతి గ్రామీణ ప్రాంత మండల హెడ్ కార్వర్టర్లలో వంద పడకల ఆసుపత్రిలో గానీ, రెండు వందల పడకల ఆసుపత్రిలో గానీ అన్నీ చోట్ల ఆరోగ్యశ్రీ వర్తించాలి. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి. రైతులకు త్రాగు నీరు, సాగు నీరు ఇవ్వాలి. వర్షాలు పడుతున్నాయి కాబట్టి మీరు కరెంట్ సప్లై పూర్తిగా ఇవ్వండి. విత్తనాలు సరఫరా చేయాలి. ఎరువుల కొరత లేకుండా చూడాలి అని తెలియచేస్తూ ఈ అవకాశం నాకిచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీమతి సి.హెచ్. గంగా భవాని : అధ్యక్షా, గవర్నరు గారి ప్రసంగం మీద ధన్యవాదాలు తెలిపే అవకాశం ఇచ్చిన మీకు ముందుగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. రాష్ట్రంలో మొన్న ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగిన యుద్ధంలో... ఒకసారి ధుర్యోధనుడు కురుక్షేత్రానికి ముందు తల్లైనటువంటి గాంధారిని ఆశీర్వదించమంటాడు. గాంధారి మహా పతివ్రతా శిరోమణి, మహా సాధ్వి. భర్త చూడని లోకాన్ని తను చూడకూడదని తనకు కళ్లు ఉన్నా కూడా గంతలు కట్టుకుంటుంది. అలాంటి తల్లి సాక్షాత్తూ శ్రీ కృష్ణ పరమాత్మున్ణి శపించగల శక్తి ఉన్న సాధ్వీమణి దుర్యోధనుడు ఆశీర్వదించమంటే "నాయనా ధర్మమే జయిస్తుంది" అని అంటుంది. ధర్మం అందరికీ తెలుసు పాండవుల పక్షం ఉన్నట్లు. ఇదే అక్క మేము యుద్ధానికి సిద్ధమని రవి ప్రకాష్ గారు ఇదే కౌన్సిల్ హాలులో ఉన్నప్పుడు అన్ని పక్షాలకు చెందిన మహిళలు ఉండేవారు. ప్రతి పార్టీకి చెందిన మహిళలతో పాటు రాజక్క కూడా ఉంది. నేను ఒక్క దానినే లేను. పద్మవ్యూహంలోకి అభిమన్యుడు వెళ్లినట్లు నేను వెళ్లి ప్రతిపక్ష నాయకులందరికీ చెప్పాను. ఈ యుద్ధంలో ధర్మానికే జయం వస్తుంది, కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది, రవి ప్రకాష్ గారు నూటికి నూరుపాళ్లు ఇది సత్యం అని చెప్పాను. తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత నిజమో కాంగ్రెస్ పార్టీ శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారి నాయకత్వంలో అధికారంలోకి రావడం, ఆయన ముఖ్యమంత్రి కావడం అంత సత్యమన్నాను. ఎందుకు అంత సత్యమని చెప్పానంటే , ఎందుకు అంత విశ్వాసంగా చెప్పానంటే .... ఒక విద్యార్థి తన సిలబస్ మొదటి నుంచి చివరి దాకా క్షుణ్ణంగా చదువుకొన్నప్పుడు పరీక్ష హాలుకి ఎంత ఆత్మవిశ్వాసంతో వెళతాడో .... ఆ విద్యార్థి కాపీలు ఆశించడు, పేపరు లీకేజీ ఆశించడు. అలాగే అంత ఆత్మవిశ్వాసంతో ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రపంచంలోనే లేని కార్యక్రమాలు రాజశేఖర్‌రెడ్డి గారి ఆధ్వర్యంలో పేదలకు గానీ, బడుగు, బలహీన వర్గాలకు గానీ, మైనారిటీలకు గానీ, మహిళలకు గానీ ఎన్నో చేశాం కాబట్టే ప్రజలు మమ్మల్ని తప్పకుండా ఆశీర్వదిస్తారనే ఆత్మ విశ్వాసంతో మేమున్నాం. గత సభలో కూడా ఇదే మాట్లాడాము. మేము ప్రజల దగ్గరకి వెళుతున్నాను. ప్రజల ఆశీర్వాదంతోటి అధికార పక్ష నేతగా వస్తాము, రాజశేఖర్‌రెడ్డి గారే ముఖ్యమంత్రి పదవి చేపడతారని ఆత్మవిశ్వాసంతో వెళ్లాను. ఈరోజు సగౌరవంగా నేను అధికార పక్ష శాసన సభ్యురాలిగా ఇక్కడకు వచ్చి మీ ముందు మాట్లాడే అవకాశం కల్పించిన ఈ రాష్ట్ర ప్రజలందరికీ నేను ధన్యవాదాలు అర్పించుకుంటున్నాను. శిరసు వంచి ప్రణామాలు అర్పించు కుంటున్నాను. ఎందుకంటే ఎన్నో మోసాలు మహా కూటాలని, సిద్ధాంతాలు తాకట్టు పెట్టి ఎన్నో ప్రలోభాలు పెట్టారు. ఎన్నో మెగాస్టార్లు వచ్చారు. మహా కూటాలు వచ్చినా గానీ ప్రజలు విశ్వసనీయతకు పట్టం కట్టారు. కలర్ టివిలకు గానీ, నగదు బదిలీకి గాని, లేకపోతే తొడలు కొట్టి మీసాలు మెలివేసి..... ప్రకాశం జిల్లాలో సొంత ఆడపడచు దగ్గర తొడలు కొట్టి మీసాలు మెలివేసిన ప్రకాశం జిల్లాలో 12 సీట్లకు గాను 11 సీట్లు కోల్పోయారు వాళ్లు. మహిళలు అసహ్యించుకున్నారు. కాబట్టి ప్రకాశం జిల్లాలో ఒక్క సీటుతో సరిపెట్టుకున్నారు. అలాంటి అన్న ఉన్నందుకు ఆడపడచులందరూ అసహ్యించుకుని ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం పార్టీని ఓడగట్టారు.

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

ఒక ఆడపడచు మాట్లాడుతున్నది. మీరు గౌరవమివ్వండి. గౌరవమివ్వక పోతే ప్రకాశం జిల్లాలో పరిణామాలు ఎలా ఉన్నాయో చుశారు కదా. కాంగ్రెస్ పార్టీ మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఈ దేశానికి యుపిఎ ఛైర్ పర్సన్, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఇవ్వడమే కాక అత్యున్నత స్థానమైన స్పీకర్ పదవి ఒక ఎస్సీ మహిళకు ఇచ్చే అరుదైన అవకాశం దక్కింది. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా రిజర్వేషన్ బిల్లు నినాదంతో వెళ్లాము. ప్రజలు ఆశీర్వదించారు. యుపిఎ ఛైర్‌పర్సన్ మొదటి ప్రెసిడెన్షియల్ స్పీచ్‌లో వంద రోజుల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తెస్తామని చెప్పారు. సోనియా గాంధీ గారు మహిళా పక్షపాతి అయితే నేను పదే, పదే ముఖ్యమంత్రి గారి మీద ఒక ఆరోపణ చేస్తుంటాను. ఇప్పటికి కూడా చేస్తుంటాను. ఇక ముందు కూడా చేస్తాను. నా ఆరోపణలను ఆయన నిజం చేస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక మహిళకు హోం శాఖను ఇచ్చి ఆయన మహిళా పక్షపాతి అనే నా ఆరోపణలను రుజువు చేశారు. దేశంలో ఇతర మహిళలు ఈర్ష్య పడే స్థాయిలో ఆయన ప్రవర్తన గతంలో ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోని ఇతర పురుషులు కూడా ఈర్ష్యపడే అన్ని స్థానాలు మాకిచ్చిన ఘనత మా ప్రియతమ నాయకులు రాజశేఖర్‌రెడ్డి గారికి చెందుతుందని నేను చెబుతున్నాను.

రాజక్క ఒక మాట అన్నారు. అభివృద్ధి, ఐటి వాళ్ల కాలంలో జరిగిందని. గెలుపు, ఓటములు రాజకీయాల్లో సర్వ సాధారణం. ఓడిపోయినంత మాత్రాన కళ్ల నీళ్లు పెట్టుకొని ఏడ్చి అధర్మమే నెగ్గిందని అన్నారు. వాళ్లు నెగ్గితే ధర్మం, మేము నెగ్గితే అధర్మమా? కాంగ్రెస్ పార్టీలో ఉంటేనే నాకు మంచి పదవులు వచ్చేవని మీడియా ముందు ఏడ్చి, మహిళలకు సముచిత స్థానం కాంగ్రెస్ పార్టీలో ఉంటేనే జరిగిందని ఇదే రాజక్క ఎన్‌టివి మీడియాకు సాక్షిగా చెప్పిన ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. నేను ఆ విధంగా చెప్పి ఆమెకు మనస్తాపం కలిగించను. గతంలో జరిగిందేదో జరిగింది. సాటి మహిళగా ఆమె బాధను నేను అర్థం చేసుకుంటాను. అదే విధంగా గల్లా అరుణ కుమారి గారి మీద ఓడిన రోజా కూడా ఘొల్లుమని ఏడుస్తూ అధర్మం నెగ్గిందని అన్నారు. ఏమిటండి ఓడిపోతే ఏడుస్తారా? ఇదేనా రాజకీయం? రాజకీయాలంటే గెలుస్తేనే ప్రజా సేవా?

ఇంకొక విషయం ఏమిటంటే త్రేతాయుగంలో రావణాసురిడి సోదరుడు విభీషణుడు రాముని శరణుజొచ్చి లంకా రాజ్యానికి అధిపతి అయ్యాడు. ద్వాపర యుగంలో పాండవుల అగ్రజుడు కర్ణుడు ధుర్యోధనుడి సహవాసం చేసి వారితో పాటు ఆయన కూడా పతనమయ్యాడు. కమ్యూనిస్టు సోదరులు ఎంత సిద్ధాంతాలు ఉన్న సోదరులో గతంలో మాతో స్నేహం చేసి మంచి స్థానాలు తెచ్చుకున్నారు. మాతో స్నేహబంధం పోగొట్టుకొని కుటిల కూటమి, మహా కూటమని సిద్ధాంతాలకు కూడా తిలోదకాలు ఇచ్చి ఈరోజు ఈ స్థితిలో ఉన్నారు.

(అంతరాయం)

ఇందిరమ్మ ఇళ్లను గురించి అక్క కల్లబొల్లి మాటలు మాట్లాడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా కేవలం 47 లక్షల ఇళ్లే ఉంటే, కేవలం 5 సంవత్సరాల్లో 40 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయి, 28 లక్షల ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయి. 80 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది శాచ్యురేషన్ పాయింట్‌కి తీసుకు వెళ్లాం. అభయ హస్తం ద్వారా పింఛన్లు ఇచ్చాము. ఫీజు రీఇంబర్స్‌మెంట్ వెనుకబడిన తరగతుల

విద్యార్థులకు కూడా ఇచ్చాం. వాళ్లలో పరిశోధనా జ్ఞానం పెంచటానికి, సంపూర్ణంగా తీర్చి దిద్దటానికి స్కూల్స్ ఆఫ్ ఎక్సలెన్సీలు పెట్టాం. ప్రతి జిల్లాకొక విశ్వ విద్యాలయం స్థాపించాం. అమెరికన్ ఎంబస్సీ మా హయాంలో వచ్చింది. బిట్స్ పిలానీ మా హయాంలో వచ్చింది. ఐఐటి మా హయాంలో వచ్చింది. అడిడాస్ నెల్లూరుకు వచ్చింది. ఆసియాలో పెద్ద కంపెనీ వచ్చింది. ఈ ఘనత మా వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారిదని సగర్వంగా తెలుపుతున్నాను. రాబోయే నాలుగు డికేడ్స్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వచ్చి పశ్చిమ బెంగాల్ రికార్డును బ్రేక్ చేసి డా.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి గారు ఉన్నంత కాలం ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని తెలియచేస్తూ నాకీ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

మ . 12.40

శ్రీ చుక్కా రామయ్య : అధ్యక్షా, ఈ ప్రభుత్వం చాలా ఆలోచించే ప్రభుత్వం కాబట్టి దీనిని ఎలాబరేట్ చేస్తుంది అని నేను భావిస్తున్నాను. గవర్నరుగారు స్వతహాగా దేశభక్తుడు. అతను చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే అవకాశం నాకు ఇచ్చినందుకు మొదట మీకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ఐదు సంవత్సరాలు ప్రభుత్వంలో ఉండి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేయడం వలన ప్రజలయొక్క ఆదరాభిమానాలు సంపాదించి మీరు మరో ఐదు సంవత్సరాలు ప్రభుత్వానికి వచ్చినందుకు ముఖ్యంగా డా వై.ఎస్. రాజశేఖర రెడ్డిగారికి, వారి మంత్రివర్గానికి, వారి పాలక వర్గానికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ఐదు సంవత్సరాలలో ముఖ్యంగా ఇరిగేషన్ యొక్క సదుపాయాలు పెంచేందుకు చాలా పయత్నాలు చేశారు. చాలా ప్రాజెక్టులు కట్టడానికి నిర్ణయం తీసుకున్నారు. కొన్ని సంవత్సరాల నుండి ఆయకట్టు తక్కువ అవుతుంటే, దానిని నిలపడానికి ఈ ప్రాజెక్టులు కట్టడానికి నిర్ణయం తీసుకున్నందుకు మీకు అభినందనలు. ప్రజలు ఎన్నో ఆశలు కలిగి వున్నారు. ఇంకా చాలా ప్రాజెక్టులు పూర్తి కావలసి ఉన్నాయి. ప్రాజెక్టులు మొదట ప్రారంభించడానికి, మొదట దేశంలో ఆర్థిక పరిస్థితి బాగా ఉన్నపుడు లేక అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి బాగా వున్నపుడు ఈ నిర్ణయం చేశారు. కేవలం గతాన్ని గురించి వల్లె వేసుకునేకంటే భవిష్యత్తు గురించి ఆలోచించితే మంచిది. గతంలో అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి, వర్షాలు పడ్డాయి, ఆర్థిక సంక్షోభం లేదు. కాని ఈనాడు భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందో మనకు తెలియదు, రుతు పవనాలు ఏ విధంగా ఉంటాయో మనకు తెలియదు. ఆర్థిక సంక్షోభం మాత్రం చాలా తీవ్రమైన పరిణామాలు కనపడుతున్నాయి. ఆ ఆర్థిక సంక్షోభం లోపల పూర్తి చేయాల్సిన అవసరం ఉంటుంది. ప్రజలయొక్క ఆశలను పూర్తి చేయవలసి ఉంటుంది. కాబట్టి నేను పాలకవర్గానికి ఒక రిక్వెస్ట్ చేస్తున్నాను. మీయొక్క స్వభావం, మీ ఫైనాన్షియల్ డిసిప్లిన్, మీయొక్క డిటర్మినేషన్ ప్రజలకు ఆశాజనకం. కాబట్టి ఈ మూడు లక్షణాలు తీసుకుని మీరు ఈ ప్రాజెక్టులు కట్టడానికి నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఐదు సంవత్సరాలలో మీరు పూర్తిచేయాలని మిమ్ములను ప్రజల పక్షాన ఆకాంక్షిస్తున్నాను.

రెండవది అగ్రికల్చర్ సెక్టారుకు మీరు చాలా ప్రాధాన్యత ఇచ్చారు. ఒక విషయం మీ దృష్టికి తెస్తున్నాను. రైతు చాలా అసంతృప్తిగా ఉన్నాడు. వినియోగదారుడు కూడా అసంతృప్తిగా ఉన్నాడు. దీనికి కారణం రైతుకు సపోర్టింగ్ ప్రైస్ లేకపోవడం వలన అసంతృప్తిగా ఉంటే, ధరలు పెరిగినందున వినియోగదారుడు అసంతృప్తిగా ఉన్నాడు. మన పక్కనే ఉన్న చైనాదేశం ఒకసారి చూడండి. ధరలు ఏ విధంగా ఉన్నాగాని సామాన్యమైన మనిషికి మాత్రం న్యూట్రిషియస్ చాలా చవకగా ఇవ్వబడుతుంది. మీతో ఒకటే కోరుతున్నాను. గ్రీన్ రివల్యూషన్ సాధించారు. ధరలు పెరిగాయి. ఇదీ సంక్షేమ కార్యక్రమం ఆసరా చేసుకుని పేదవాడికి కిలో రు. 2 లకు బియ్యం ఇస్తున్నందుకు అభినందనలు. పేదవాడే కాదు. చాలా మందికి ఆహారానికి ఎంత ఖర్చు

పెడుతున్నారో ఒకసారి అంచనా వేయండి. నేను యుఎస్ఏలో కూడా చూచాను. ఫుడ్‌మాత్రం చాలా చీప్‌గా ఉంటుంది. ఒక అభివృద్ధి చెందుతున్న దేశం లక్షణం ఏమిటంటే ఫుడ్ మాత్రం చాలా చీప్‌గా ఉండాలి. ఆహారంగా చవకగా, న్యూట్రిషియస్‌గా చేయండి. ఏ కులంవాడికి, లేక ఏ వర్గంవాడికి కూడా అందరికీ న్యూట్రిషియస్ ఫుడ్ గ్యారంటీ ఇవ్వాలి. ఇది డిమాండ్ కావాలని కోరుతున్నాను. ఇది ప్రధానమైనది. అగ్రికల్చర్ యూనివర్సిటీలు పరిశోధన చేస్తున్నాయి. చైనావారు ఏ కాస్ట్‌లో ఉత్పత్తి చేస్తున్నారు? మనం ఏ కాస్ట్‌లో ఉత్పత్తి చేస్తున్నాము? ఏ విధమైన టెక్నాలజీ ప్రవేశపెడితే ఉత్పత్తి చేసే వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది? ఉత్పత్తిని పెంచడమే కాదు, ఉత్పత్తి కాస్ట్‌పైన ప్రధానంగా దృష్టి పెట్టాలి. అగ్రికల్చర్ యూనివర్సిటీలు గ్రీన్ రివల్యూషన్ సాధించాయి. వారి ముందు ఛాలెంజ్‌గా విజ్ఞప్తి చేస్తున్నాను. కాస్ట్ తగ్గించండి. సామాన్యమానవుడికి ఎకౌంటబిలిటీ ఇవ్వండి. అందరికీ న్యూట్రిషియస్ ఫుడ్ అందుబాటులోకి తెస్తే ప్రజలు హర్షిస్తారు. ఈ అవకాశం పురస్కరించుకుని అగ్రికల్చర్ యూనివర్సిటీ టెక్నాలజీలో ఉండే వారినందరినీ ప్రార్థిస్తున్నాను. మీ రీసెర్చ్ పైన దేశం యొక్క ఆహార ఉత్పత్తి, భద్రత ఆధారపడి ఉంటుంది. దయచేసి వచ్చే ఐదు సంవత్సరాలలో న్యూట్రిషియన్ గ్యారంటీ ఇవ్వండి .

ఎడ్యుకేషన్‌కు సంబంధించి మీముందు 6 పాయింట్స్ పెడతాను. ఎందుకంటే ఎడ్యుకేషన్ మీద మాట్లాడకపోతే అది అసంపూర్ణంగా ఉంటుంది .

(1) Enrolling all the children in primary schools. This should be your target. (2) Improving quality and relevance of education. (3) Providing more and more better teachers (4) Removing gender disparities. (5) Building the relevant technical skills (6) Mobilizing the adequate financial resources. These are the six points, which I would like to put forth before the House.

వచ్చే ఐదు సంవత్సరాలలో ఈ 6 పాయింట్లపైన ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ దృష్టి కేంద్రీకరిస్తే చాలా బాగుంటుంది. ఈ ఉదయం ప్రభుత్వం అందరికి ఒక షాక్ ఇచ్చే న్యూస్ ప్రకటించింది. అన్ని రాష్ట్రాలలో కంటే మన రాష్ట్రంలో కాంపిటీటివ్ పరీక్షలకు ఎందుకు ఎక్కువ మంది వస్తున్నారు? గత పది సంవత్సరాల నుండి మీరు చూస్తే ఆంధ్రప్రదేశ్ విద్యార్థులలో, ఈ విప్లవాత్మకమైన మార్పు ఎలా వచ్చింది? దీనికి ప్రధానమైన కారణం పివి నరసింహారావు గారు. అతను చాలా మంచి నిర్ణయం తీసుకున్నారు. దేశం అంతా ఈ రంగంలో పోతున్నా మనకు కొత్త వెర్షన్ చూపించారు. ఇంటర్మీడియట్ వ్యవస్థకు కొన్ని ప్రయోజనాలు ఉన్నాయని చూపించారు. అక్కడ ఉండే స్టూడెంట్ వయస్సు సుమారు 15 నుండి 17 వరకు ఆ ఏజ్ అడోలైన్స్ గ్రూప్, ఎఛీవ్‌మెంట్ గ్రూప్. ఏదో సాధించాలని ఉండే గ్రూప్. అంతే కాకుండా ఆ గ్రూపులో కాంపిటెన్సీ తేవాలని స్కూలు ఎడ్యుకేషన్‌లో కలపలేదు. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో కూడా కలపలేదు. దీనికి ప్రత్యేక స్థాయి ఇచ్చారు. కాబట్టి దేశంలోని ఇతర రాష్ట్రాలలో ఈ చదువు అభివృద్ధి పెరగలేదు. మన ఆంధ్రప్రదేశ్‌లో పెరిగింది. అందువలన ఐ ఐ టి సీట్లు ఎక్కువసంఖ్యలో మనం తెచ్చుకోగలుగుతున్నాము. దీనిని దూరదృష్టితో గుర్తించాలని కోరుతున్నాను.

మ. 12.50

అది మొదటి కారణం. రెండో కారణం ఏమిటంటే, టెక్నాలజీ చాలా బాగా పెరిగింది ఇక్కడ. ఇన్ని ప్రయోగాలు చేసిన ఈ రాష్ట్రంలో ఏ కమిటీ యొక్క విచారణ లేకుండా, ఎవరి విచారణా లేకుండా, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌ను తీసేసి, ప్లస్ టు విధానం తీసేసి స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలపాలని నిర్ణయం

తీసుకుంటున్నారు. పాఠశాల విద్యలో కలపడం తప్పని అనడం లేదు. పాఠశాల విద్యలో కలిపితే ఏ పరిణామాలు వస్తాయి అనేది ఆలోచించవలసిన అవసరం వున్నది. 80 శాతం సమస్యలు మన స్కూల్స్‌లో వున్నాయి. స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ దానినే నిర్వహించలేక పోతోంది. ఇప్పుడు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కూడా తీసుకున్నట్లయితే, దాని ప్రభావం ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ మీదకు రాబోతోంది.

ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో క్వాలిటీయే ప్రధానం కాబట్టి ప్రస్తుతం వున్న వ్యవస్థను యథాతథంగా వుంచండి. మీరు మార్చదలచుకున్నట్లయితే ఒక కమిటీని వేయండి. ఆ కమిటీ రెండు సంవత్సరాలు అధ్యయనం చేసిన తరువాత స్కూల్ ఎడ్యుకేషన్‌లో వుంచాలా, లేక హయ్యర్ ఎడ్యుకేషన్‌లో వుంచాలా లేక సెపరేట్ బాడీగా వుంచాలా అనేది ఆలోచించండి. అనేక దశాబ్దాల నుంచి వస్తున్న ఈ పద్ధతిని తీసేస్తామని అంటే, విద్యార్థులకు, విద్యా రంగానికి అపకారం చేసినట్లవుతుంది.

ఈ మధ్య నారాయణ మూర్తి గారు ఒక పుస్తకం వ్రాసారు. అందులో మన ఇంజనీర్ల గురించి మన చదువుల గురించి వ్రాసారు. మన ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు ఒక సంవత్సరమో, రెండు సంవత్సరాలో ట్రైనింగ్ ఇస్తేనే ఇన్‌ఫోసిస్‌లో పనికొస్తారని చెప్పారు. మన ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ఏ విధంగా వుందో ఒకసారి ఆలోచించండి. కాబట్టి మనకు క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ పెంచవలసిన అవసరం వుంది. స్కూల్స్ సంఖ్యను పెంచడం వల్ల విద్యా వ్యాప్తి జరగదు. ఉపాధ్యాయుల క్వాలిటీ పెరగాలి. ఉపాధ్యాయులలో క్వాలిటీని పెంచకుండా ఏ దేశంలో కూడా క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ పెరగదు. దాని గురించి మీరు చాలా తక్కువగా అంచనా వేస్తున్నారు.

మీరు ఆ విధమైన జాగ్రత్తలు తీసుకోనట్లయితే మానవ సంపదలు కుంగిపోయే అవకాశం వుంది. మనకు recession వుంది. ఇతర దేశాలలో recession వుంది. The recession is appropriate time to build the human resources. ఏ దేశంలో కూడా ఎప్పుడైతే ఎక్కడైతే ఎకనామిక్ డిప్రెషన్ వస్తుందో, అప్పుడు ఆ మనుషులను ఉపయోగించుకుని దేశం యొక్క ఆర్థిక వ్యవస్థను బలపరచడానికి హ్యూమన్ డవలప్‌మెంట్ చేస్తాము. ఆ అవకాశాన్ని మనం పోగొట్టుకుంటున్నాము. దాని గురించి ఆలోచించమని చెబుతున్నాను. ఇవన్నీ కూడా నేను చెబుతున్నవి కాదు. నారాయణమూర్తి గారు పుస్తకంలోనే వివరించారు. దయచేసి ప్రభుత్వమూ, సంబంధిత డిపార్ట్‌మెంటూ ఈ విషయాలను గురించి ఆలోచించాలని కోరుతున్నాను.

శ్రీ జి. తిప్పేస్వామి (అసెంబ్లీ ) : అధ్యక్షా, గవర్నరు గారి ప్రసంగం మీద ధన్యవాదాలు అర్పించే తీర్మానంపై మాట్లాడేందుకు నాకు ఈ అవకాశం ఇచ్చిన తమకు ముందుగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. గత 5 సంవత్సరాలలో ఈ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమ, శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను ఈ రాష్ట్రంలో తీసుకొచ్చి, అభివృద్ధి చేసి, రెండోసారి వైఎస్ రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి గారికీ, మంత్రి వర్గానికీ నా ప్రత్యేకమైన అభినందనలు తెలియజేస్తున్నాను.

ఈ పథకాల జోలికి నేను వెళ్లదలచుకోలేదు. రాజకీయంలో అడుగంటుతున్న నైతిక విలువలు గురించి కాని, నీతి నిజాయితీల గురించి కాని, నీతి నియమాల గురించి కాని ఇక్కడ కూర్చున్న పెద్దల సభలో అందరూ తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం ఎంతైనా వుంది. మీకందరకీ బాగా తెలుసు. నీతికీ నిజాయితీకి,

మోసానికీ, నయవంచనకూ మధ్య జరిగిన పోరాటమే 2009 ఎన్నికలు. అందులో భాగమే వివిధ రాజకీయ పక్షాలు అనేకమైన హామీలను ఇస్తున్నాయి. ఆ ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి కొన్ని రాజకీయ పార్టీలు వాటిని అమలు పరుస్తున్నాయి. 2004లో జరిగిన ఎన్నికలలో మా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసి, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి రెండో సారి ఎన్నికలకు పోతే, ప్రజలు జేజేలు పలికి కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చిన సంగతి అందరికీ తెలిసిందే.

మరి మన ప్రతిపక్ష పార్టీ వారు 1999 ఎన్నికలలో కాని, 2004 ఎన్నికలలో కాని కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆచరణ సాధ్యం కాని హామీలను ఇవ్వడం జరిగింది. 1999 ఎన్నికలలో ఆదరణ, ముందడుగు, రోషిణి అనే పథకాల గురించి అనేక హామీలను ఇవ్వడం జరిగింది. ఎన్నికలైన తరువాత ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత మన గౌరవ ప్రతిపక్షాలదే. 2009లో ప్రజలను మోసం చేసి, అధికారాన్ని ఏ రకంగానైనా కైవసం చేసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు కాని, మహా కూటమి కాని, మోసపూరితమైన హామీలను ఇచ్చాయి. అందులో ఒక ముఖ్యమైన హామీ నగదు బదిలీ పథకం.

మన రాష్ట్రంలో వారు డబ్బు పంచారు, ఎటిఎం కార్డులను పంచారు. అందువల్లనే వారికి ఈ 90 సీట్లయినా వచ్చాయి కాని లేకపోతే కనీసం 9 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. అత్యంత వెనుకబడిన మా అనంతపురం జిల్లాలో ఈ ఎటిఎం కార్డులను ఇచ్చి, ఎన్నికలు అయిన వెంటనే, కౌంటింగ్ అయిన వెంటనే బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకోమని ఈ ఎటిఎం కార్డులను ఇవ్వడం జరిగింది. ఈ కార్డును డెప్యూటీ చైర్మన్ గారికి పంపిస్తున్నాను. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా అరికట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇటువంటి కార్డులను ఇచ్చిన వారిపై 420 కేసును పెట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. మా నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి గారు 7 గంటల పాటు నాణ్యమైన కరెంటును ఇస్తామని చెప్పారు. అందుకు భిన్నంగా ఎక్కడా కరెంటు ఇవ్వకుండా మోసగించిన దాఖలాలు లేవు. కాని తెలుగుదేశం పార్టీ ఎటిఎం కార్డులను ఇచ్చి ప్రజలను మోసగించారు. ఈ విధంగా కార్డులను ఇచ్చిన వ్యక్తులపై హోమ్ మినిస్టర్ గారు తప్పకుండా చర్యలు తీసుకోవాలని నేను కోరుతున్నాను. అధికారం వస్తుంది, పోతుంది. అది శాశ్వతం కాదు. విలువలతో కూడిన రాజకీయ విధానాలను పునరుద్ధరించవలసిన అవసరం వుంది. ఎవరైతే విలువలకు తిలోదకాలిస్తారో, విలువలను మరచి, మిట్ట మధ్యాహ్నమే ప్రజలను మోసం చేస్తారో అటువంటి వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా వుంది.

(తెలుగుదేశం సభ్యుల నుంచి తీవ్ర అంతరాయం )

ఉన్నది వున్నట్లుగా మాట్లాడితే వారికి కోపం వస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు బుద్ధిమంతులు కాబట్టి, విద్యావంతులు కాబట్టి, మళ్లీ కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. మోసం చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

(తిరిగి అంతరాయం)

మ. 1.00

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాదు) : అధ్యక్షా, గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సంబంధించి మాట్లాడడానికి నాకు అవకాశం లభించినందుకు గాను ప్రత్యేకంగా తమకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. మేము మాట్లాడుతున్నప్పుడు ఏ పక్షానికైనా ఇబ్బంది కలిగితే తరువాత మాట్లాడవలసిందిగా కోరుతున్నాను. చాలా సంతోషం, ఈ సంవత్సరం 16 ఏప్రిల్‌న జరిగిన ఎన్నికల ఫలితాలు మే నెల 16, అంటే ఒక నెల వరకూ వేచి ఉండే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినప్పుడు కొంత మంది రాజకీయ పండితులు, రాజకీయ విజ్ఞులు, అందరూ కూడా ఆంధ్రప్రదేశ్‌లో హంగ్ వస్తుందని అన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల్ హంగ్ ప్రభుత్వానికి అవకాశం కల్పించ లేదు. కాబట్టి ఆ విధమైన మాటలన్నీ ఫలితాలు వచ్చిన తరువాత నిరుపయోగమయ్యాయి. ఈ ప్రభుత్వం వచ్చినందుకు గర్వపడుతున్నాము. రాష్ట్ర ప్రజలు, వారికి అందచేసిన సదుపాయాలను వినియోగపరచుకొని సరైన నిర్ణయం చేయడం జరిగింది. ఈ రోజు ప్రత్యేకంగా తెలంగాణా ప్రాంతంలో ఎక్కువ మంది పెద్దలు మంత్రులుగా ఉన్నారు. తెలంగాణా ప్రాంతంలో ఉన్న గడ్డ ప్రాంతం, మెట్ట ప్రాంతం హుస్నాబాద్, సిద్ధిపేట, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలు ఎప్పుడూ కూడా నీటికి అవకాశం ఉన్న ప్రాంతాలు కాదు.

ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు స్వయంగా ఈ ప్రాంతం అంతా సస్యశ్యామలం కావాలనే ఉద్దేశ్యంతో రెండు మంత్రి పదవులు భారీ నీటిపారుదల, చిన్న నీటి పారుదల శాఖలను ఈ ప్రాంతం యొక్క శాసనసభ్యులకు ఇవ్వడం జరిగింది. తమ ద్వారా వారిని మరీ మరీ కోరేదేమంటే, ఈ ఐదు సంవత్సరా లలో తప్పకుండా ఈ మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అయ్యేట్లు కార్యక్రమాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తు న్నాను. నీటిపారుదల శాఖ మంత్రిగారిని మరీ మరీ కోరేదేమంటే, మా గ్రామంలో చిన్న కుంట తయారుచే సారు. రైతులకు మాత్రం ఇంతవరకూ కాంపెన్‌సేషన్ రాలేదు. చాలా సిగ్గనిపించింది. రెండు సంవత్సరాల నుండి మంత్రిగారికి చెబుతూ వచ్చాము. గతంలో ఉత్తర్వు జారీ చేసినప్పటికీ క్రింద అధికారులు అప్రమత్తంగా లేరు. కాబట్టి మంత్రిగారు దీనిని సవాలుగా తీసుకొని తప్పకుండా చర్య గైకొని రైతులను ఆదుకోవలసినదిగా కోరుతున్నాను. ఆ బాధ్యత వారి మీద ఉంది. నాకు మాట్లాడడానికి ఎక్కువగా సమయం లేదు. 5 నిమిషాలే మాట్లాడతాను.

నేను టీచర్స్ నియోజకవర్గం నుండి వచ్చాను. విద్యకు సంబంధించిన విషయం మాట్లాడతాను. ఈ రోజు గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపరచినట్లు , వచ్చే 10 సంవత్సరాలలో పూర్తి సంపూర్ణ అక్షరాస్యతను సాధిస్తామని మొదట లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. అందుకు నేను గర్వపడుతున్నాను. అయితే ఈ లక్ష్యం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వస్తోంది. 1947 నుండి 10 సంవత్సరాలు సంపూర్ణ అక్షరాస్యత సాధి స్తామన్నారు. ఇప్పుడు కూడా 10 సంవత్సరాలలో సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామన్నారు. మన రాష్ట్ర అక్షరాస్య త శాతం పురుషులలో 70.32 శాతం, స్త్రీలలో 50.43 శాతం అంటే యావరేజ్‌గా 67.47 శాతం మన దక్షిణ భారత ప్రాంతంలోని రాష్ట్రంలో ఉన్న ర్యాంకింగ్ పరిశీలిస్తే కేరళ మొదటి ర్యాంక్‌లో ఉంది. తమిళనాడు రాష్ట్రం 12వ ర్యాంక్‌లొ ఉంది. కర్ణాటక 21రాష్ట్రంలో, గోవా 4వ ర్యాంక్‌లో, మహారాష్ట్ర 10వ స్థానంలో, మధ్యప్రదేశ్ 20వ స్థానంలో, ఒరిస్సా కడుబీద స్థాయిలో ఉన్న రాష్ట్రం 26వ స్థానంలో ఉంది. మన రాష్ట్రం 28వ స్థానంలో ఉంది.

కాబట్టి ఇన్ని సంవత్సరాలు, ఇన్ని ప్రణాళికలు రూపొందించినా 28వ స్థానంలో ఉన్న రాష్ట్రానికి విద్యా మంత్రి ఎటువంటి ప్రణాళిక రూపొందిస్తారో ఈ వచ్చే 10 సంవత్సరాలలో అక్షరాస్యతా శాతం చూడాలి. మేము 30 సంవత్సరాల నుండి చూస్తున్నాము. బడి బాట కార్యక్రమం కేవలం పేపర్ల వరకే పరిమితమవుతోంది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడంలో సాధారణమైన ప్రణాళిక రూపకల్పన జరగడం లేదు. విద్యాశాఖామంత్రి ఇక్కడ లేకపోవచ్చు, వారు మంచి కార్యక్రమాన్ని రూపకల్పన చేసి మా సహాయసహకారాలు తీసుకుంటే తప్పకుండా సంపూర్ణ అక్షరాస్యత వచ్చే 10 సంవత్సరాల్లో సాధించవచ్చునని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. ఎస్.సి., ఎస్.టి, మైనారిటి బాలికల అక్షరాస్యతా శాతం తక్కువగా ఉంది కాబట్టి ఈ విషయాలన్నింటిని ప్రభుత్వం ఛాలెంజ్‌గా తీసుకొని అక్షరాస్యత రేటును మెరుగుపరచాలి. అందుకుగాను ప్రత్యేక ప్యాకేజ్ తీసుకుంటున్నామనే మాట చెప్పారు. అది ఏమిటో ఇంతవరకూ అర్థం కావడం లేదు. మంత్రిగారు దీనిని సరిగ్గా రూపకల్పన చేయాలని కోరుతున్నాను.

ప్రత్యేకంగా మా పాలమూరు జిల్లా గురించి చెప్పాలి. పెద్దలు కృష్ణారావుగారు ఉన్నారు. ఇప్పుడు అక్షరాస్యత రేటు అక్కడ పురుషులలో చూసినట్లయితే 44.72 శాతం, స్త్రీలలో 20.11 శాతం, యావరేజ్‌గా చూసినట్లయితే 32.58 శాతం మాత్రమే ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గట్టు మండలంలో ఈ రోజు అక్షరాస్యత రేటు 14 శాతం ఉంది. మనకు స్వాతంత్ర్యం వచ్చి 62 సంవత్సరాలు అయినా, ఇంకా అక్షరాస్యత రేటు పెరగడం లేదు. డి.కె. అరుణగారు వారి నియోజకవర్గంలో అక్షరాస్యత రేటును సంపూర్ణంగా సాధించాలని ఈ వేదిక ద్వారా మనవిచేస్తున్నాను. పాలమూరు జిల్లాకు ఒక ప్రత్యేక ప్యాకేజ్ ఇచ్చి అందరిని అక్షరాస్యులుగా చేయవలసిందిగా అందుకుగాను తక్షణమే కార్యక్రమాలను రూపొందించాలని మనవిచేస్తున్నాను. వసతి గృహాలన్నీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా చేస్తామన్నారు. ఇంతవరకూ ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలల్లో సరైన వసతి సౌకర్యం లేకపోవడంవల్ల ప్రతిభావంతులైన విద్యార్థుల విషయం ఇందాకే రామయ్యగారు చెప్పారు. పి.వి. నరసింహారావుగారు దేశంలోనే అగ్రగామిగా ఆంధ్ర రాష్ట్రం ఉండాలని ఇక్కడి విద్యార్థులందరూ విద్యలో అగ్రగామిగా ఉండాలనే ఉద్ధేశ్యంతో విద్యార్థులను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పిస్తూ వచ్చారు.

ఈ రోజు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను చేర్చడానికి ఎవరూ ఇష్ట పడడం లేదు. ఏ పాఠశాలల్లోనూ మౌలిక సౌకర్యాలు లేవు. టీచర్స్ లేరు అంటే ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో గెస్ట్ టీచర్స్‌ని, కాంట్రాక్ట్ టీచర్స్‌ని, టెంపరరీ టీచర్స్‌ని అపాయింట్ చేస్తున్నారు. విద్యా వాలెంటీర్లను పెడుతున్నారు. ఇటువంటి ఉండడంవల్ల ఏ విధమైన చిత్తశుద్ధి ఉంటుంది? వారికి సరైన జీతభత్యాలు ఇవ్వలేకపోవడం జరుగుతోంది. గెస్ట్ టీచర్స్‌కి రు.4,000, విద్యా వాలెంటీర్లకు రు.3,000 ఈ విధంగా ఇవ్వడం వల్ల వారికి ఏకాగ్రత కొరవడి విద్యా బోధన చేయలేకపోవడం, పాఠశాల సక్రమంగా నిర్వహించలేకపోవడం జరుగుతోంది. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌గారి ప్రసంగంలో స్పష్టంగా మనవిచేసింది. జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం చొప్పున ఇప్పటికే 18 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసామన్నారు.

ఆ విశ్వవిద్యాలయాల్లో సరిగ్గా బోధన ఉండేటట్లు, సరైన రీసర్చ్ వర్క్ జరిగేటట్లు కార్యక్రమాలు జరగడం లేదు. మా తెలంగాణా ప్రాంతంలో ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయంలో సరైన నిధులు లేకపోవడంవల్ల భవనాల రూపకల్పన సరిగ్గా జరగడం లేదు. లెక్చరర్ల నియామకం జరగడం లేదు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లు లేకపోవడంవల్ల విద్యార్థులు అక్కడ చేరడానికి ఇష్టపడడం లేదు. ఏ

తల్లిదండ్రి కూడా ఈ రోజున ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్చడానికి సుముఖత చూపడంలేదు. ఒక రకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను సమర్ధవంతంగా నిర్వహిస్తేనే అక్షరాస్యతను సాధించగలము......

( మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ నుండి బెల్..... )

అధ్యక్షా, బెల్ కొట్టినప్పుడల్లా, మాకు తల మీద మొట్టికాయ వేస్తున్నట్లుగా భావిస్తున్నాము. సమయం ఇవ్వడం లేదు. విషయాలు చెప్పాలనే భావన ఉన్నా సమయానికి అనుగుణంగా మెదిలే వ్యక్తిని కాబట్టి, నాకు ఇచ్చిన ఈ అవకాశానికిగాను కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

మ. 1.10

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ (అసెంబ్లి) : అధ్యక్షా, 2009 ఏప్రిల్ 16 వ తేదీకి ముందు ఎన్నికల ప్రచారం చాలా ఉధృతంగా జరుగుతున్న సందర్భంలో సుప్రసిద్ధ సినిమా నటులు మరియు ప్రస్తుతం ప్రజా రాజ్యం పార్టీ అధినేత శ్రీ కొణిదల చిరంజీవి గారు మా రాజమండ్రి నగరంలో ఒక అద్భుతమైన బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి అనేక వేల మంది అభిమానులు హాజరయ్యారు. చిరంజీవి గారు ఒక వేదిక మీద నిలబడి ప్రసంగిస్తున్నారు. ఆయనను చూడడానికి వచ్చినటువంటి అనేక వేల మంది అభిమానులకు స్థలం దొరకక వేదిక ముందున్న ఒక గ్యాలరీలో నిలబడి చూస్తున్నారు. సడన్‌గా వారు నిల్చున్నటువంటి వేదిక ఒకటి కూలిపోయింది. అభిమానులందరూ క్రింద పడ్డారు. తీవ్రమైన గాయాలు తగిలాయి. ఇదంతా మేము టీవీలో చూశాం. అది గమనించినటువంటి చిరంజీవి గారు ఏమి చేయాలో పాలుపోక విస్మయానికి గురై తల పట్టుకొని కూర్చొన్నారు. అందరూ కూడా భయపడుతున్నారు. అభిమానులు చాలా మందికి దెబ్బలు తగిలాయి. ఆ సమయంలో మరుక్షణంలో అక్కడకి ప్రత్యక్షమైనటువంటిది 108 అనే వాహనం.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఆ వాహనం రావడం వల్ల అక్కడున్నటువంటి అభిమానులు సకాలంలో ఆసుపత్రులకు చేర్చబడి వారి ఆరోగ్యం బాగు పరచేందుకు అవకాశం ఏర్పడింది. అదే ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వర్ధమాన హీరో తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ నందమూరి తారక రామారావు అనే జూనియర్ ఎన్.టి.ఆర్ గారు శ్రీకాకుళం జిల్లాలో ప్రచార పర్వాన్ని మొదలు పెట్టి కొనసాగించారు. ఆయన ప్రసంగానికి విశేషమైన స్పందన లభించింది. రాజమండ్రి లో ప్రసంగించారు. అక్కడి నుండి పశ్చిమ గోదావరి జిల్లా మరియు ఖమ్మం జిల్లాలకు ప్రచారం కోసం వెళ్ళారు. ఖమ్మం నుండి ఏదో పని వుండి తిరిగి హైదరాబాద్ వస్తున్న సందర్భంలో దురదృష్టవశాత్తు యాక్సిడెంట్‌తై ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. పైకి లేవలేని పరిస్థితులో వున్నాడాయన. ఆయనతో పాటు ప్రయాణం చేస్తున్నటువంటి మరో నటుడు రాజీవ్ కనకాలకు మాత్రం గాయాలు తక్కువగా తగిలినాయి. అయన వెంటనే తేరుకొని జేబులో వున్న సెల్ ఫోన్ తీసుకొని జూనియర్ ఎన్.టి.ఆర్ తండ్రి గారైన హరికృష్ణ గారికి కాకుండా వారి తల్లికి గారికి కాకుండా, వారి నాయకుడైనటువంటి చంద్రబాబు నాయుడు గారికి కాకుండా 108 అనే వాహనానికి ఫోన్ చేశాడు.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

మరుక్షణమే ఆ వాహనం అక్కడకి వచ్చి జూనియర్ ఎన్.టి.ఆర్ గారిని సకాలంలో ఆసుపత్రిలో చేర్పించడం వల్ల ఆయన ఆరోగ్యం కుదుటపడింది. డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి యొక్క నిష్పక్షపాతమైన పరిపాలనకు ఒక మచ్చు తునక ఇది అనేటటువంటి మాట తెలియ చెప్పడానికే ఈ విషయాలను తెలియచేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

(శ్రీ రాజేంద్ర ప్రసాదుగారు తన స్థానంలో నిలబడి అంతరాయం కలిగించ సాగారు)

రాజేంద్ర ప్రసాదు గారు కూర్చోండి. నేను మాట్లాడిన దానిలో తప్పు ఏమీ లేదు. చాలా మంది సభ్యులు ఇప్పటివరకు మాట్లాడుతూ ఇది సుపరిపాలన అని లేదా మరో మంచి పరిపాలన అని అన్నారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో జరిగినటువంటిది సుపరిపాలన అన్న మాట కంటే కూడా నిష్పక్షపాతమైన పరిపాలన జరిగిందనే మాటకు మాత్రమే మనందరము కూడా పూర్తిగా కట్టుబడి వున్నాం. అందుకే ప్రజలు నిష్పక్షపాతంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తిరిగి తీసుకువచ్చారు. ఈ మాటలు కేవలం గాలి మాటలు కాదు. ఏ రకమైనటువంటి ప్రాతిపదిక లేకుండా నేను చెప్పదలచుకోలేదు. సోదాహరణంగా వివరిస్తూనే చెపుతున్నాను. అధ్యక్షా, మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం చెప్పనటువంటి సాచురేషన్ కాన్సెప్ట్ అనే ఒకే ఒక మాటను రాజశేఖర రెడ్డి గారు చెప్పారు. సమాజంలో అర్హులైనటువంటి పేదలు ఎవ్వరుంటారో, ఎవ్వరైతే దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నటువంటి వ్యక్తులున్నారో వారందరికి కూడా కులంతో కాని, మతంతో కాని, పార్టీతో కాని సంబంధం లేకుండా, వారు ఏ పార్టీకి చెందిన వారైనా సరే అర్హులైన పేదలైతే వారందరికి కూడా ఇళ్ల నిర్మాణం కాని, రెండు రూపాయలకు కిలో బియ్యం కాని, వృద్ధాప్యపు పెన్షన్లు కాని, అంగవైకల్యం వున్న వారికి ఇచ్చే పెన్షన్లు కాని, వితంతువులకిచ్చే పెన్షన్లు కాని ప్రభుత్వం చేపట్టిన ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ఏ రకమైనటువంటి పక్షపాతం లేకుండా ఇవ్వండని ఆదేశాలు ఇవ్వకలిగినటువంటి ఏకైక ముఖ్యమంత్రి ఈ దేశంలో డా. రాజశేఖర రెడ్డి గారు మాత్రమే అనే మాటను మనవి చేస్తున్నాను. కాబట్టే చారిత్రాత్మక విజయాన్ని కాంగ్రెస్ పార్టీ ఈ రోజు సాధించింది. ప్రజలు మన్మోహన్ సింగ్ గారి విధానాలను మెచ్చుకున్నారని నిన్న ఎవ్వరో పెద్దలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక విధానముంటుంది. అది మన్మోహన్ సింగ్ గారిదా, లేక రాజశేఖర రెడ్డి గారిదా అనేది వుండదు. కాంగ్రెస్ పార్టీ విధానం మాత్రమే వుంటుంది. ఎన్.టి. రామారావు గారి విధానాలను తుంగలో తొక్కినటువంటి చంద్రబాబునాయుడు గారి విధానాల మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి ద్వంద్వ విధానాలు వుండవని ఈ సందర్భంగా మనవి చేస్తూ ఆ ద్వంద్వ విధానాల జోలికి వెళ్ళడం లేదు. ఆర్థిక పరంగా కాని, వ్యవసాయ రంగంలో కాని, పారిశ్రామిక రంగంలో కాని ఎలాంటి వృద్ధి రేటును సాధించామో గణాంక వివరాలున్నాయి. ఎంత వృద్ధి రేటును సాధించినప్పటికిని కూడా గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క విషయంలో కూడా పన్నులు పెంచడం జరగలేదు. విద్యుత్ టారిఫ్‌లను పెంచడం జరగలేదు. రెవెన్యూ పెంచడానికి ఏ ఇతర మార్గాలను ఆశ్రయించకుండా ఇంతటి వృద్ధి రేటును సాధించడమంటే సామాన్యమైనటువంటి విషయం కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా ఒక అభ్యర్థి శాసనసభ్యుడుగా పోటీ చేస్తే అతను కేవలం 10 ఓట్లతో మాత్రమే నెగ్గినట్లయితే అతను ఈ శాసనసభ సభ్యత్వాన్ని తీసుకోనని, నాకు ఎక్కువ మంది ఓటు వేయలేదు కాబట్టి నేను ఈ శాసనసభ్యత్వానికి తగనని అన్న సందర్భం ఎక్కడైనా వుందా? మీరే చెప్పండి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒక్క ఓటు తేడాతో గెలిచినప్పటికి కూడా అది విజయం సాధించినట్లే. ఆ రకంగా చూచినప్పుడు ఈ రోజు మాకు వచ్చిన పర్సంటేజ్ చాలా గొప్పది. కాంగ్రెస్ పార్టీ ఒకే ఒక మాట చెబుతోంది. గవర్నరు గారి ప్రసంగంలో చెప్పిన మాటల

ప్రకారం గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఏవైతే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ప్రజారంజకమైనటువంటి పరిపాలనను అందించామో అదే రకమైన ప్రజారంజకమైన పరిపాలనను మరో 20 సంవత్సరాల పాటు ఈ రాష్ట్రంలో ఆందించడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా వుందనే మాట తెలియచేస్తున్నాను. పేదప్రజల పక్షమైనటువంటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఖచ్చితంగా ప్రజలందరి ఆదరాభిమానాలతో మరింత ముందుకు వెళుతుంది. ఏవైతే సమస్యలున్నాయో వాటి పరిష్కారానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడానికి సిద్ధంగా వుందనే మాటను కూడా ఇప్పటికే గవర్నరు గారి ప్రసంగంలో తెలియచేయడం జరిగింది. అటువంటి సందర్భంలో ఈ ప్రభుత్వాన్ని మనందరం కూడా వెన్ను తట్టి ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరముంది. రెండో పర్యాయం వచ్చినటువంటి ఈ ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలివ్వండి. తప్పులుంటే సహేతుకమైన విమర్శలు చేయండి. ఏవైతే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇంత కాలంగా అమలుచేస్తున్నవంటి ఘనత ఈ ప్రభుత్వానికి దక్కిందో వాటిని మరింత ముందుకు తీసుకు వెళ్ళడంలో సహకరించండి. ముఖ్యంగా పేద ప్రజలకు దగ్గరగా వుండడానికే ఈ ప్రభుత్వం వుందనే మాటను మనందరం కలసి నిరూపిద్దామనే మాటను తమ ద్వారా సభ్యులకు మనవి చేసుకొంటూ సెలవు తీసుకుంటున్నాను.

మ. 1.20

శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడ్డి (కడప, అనంతపుర్, కర్నూలు) : అధ్యక్షా, 62 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత 50 ఏళ్ల ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రాజకీయ దురంధరుడు, మహామేధావి, స్వాతంత్ర్య సముపార్జనలో పాత్ర వహించినటువంటి గవర్నరుగారి ప్రసంగం మీద మాట్లాడడానికి అవకాశం కల్పించిన మీకు నా ప్రత్యేక నమస్సులు తెలియచేసుకుంటున్నాను. ఈ శాసనమండలిలో చాలామంది గౌరవ సభ్యులు ప్రజల అభిప్రాయాలను వారి తరపున సభలో తెలియజేశారు. ఒక్క ఓటు వచ్చినా గెలినట్లే, ఎన్ని ఓట్లు వచ్చినా గెలిచినట్లే. కొందరు ఓడినట్లు, మరికొందరు గెలిచినట్లు చాలా విషయాలు ఇక్కడ ప్రస్తావనకు వచ్చాయి. నేను వాటి జోలికి వెళ్లను. గెలుపు, ఓటములు రెండూ అనివార్యములే. గెలిచిన వాళ్లు ఒదిగి ఉండాలని చెప్పారు, చాలా సంతోషం. వై.యస్.రాజశేఖరరెడ్డి గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒదిగి ఉండి ప్రజల సంక్షేమాన్ని కోరుతుందని నేను భావిస్తున్నాను. నాకు నీటి గండం అనేది ఈ సందర్భంగా గుర్తు వచ్చింది. ఎందుకంటే ఎన్నికలకు ముందు అవినీతి, అన్నారు. నిత్యావసరవస్తువుల ధరల పెరుగుదల మరొక ముఖ్యమైన విషయం. నిజమే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. దానిని అరికట్టడానికి తీసుకునే చర్యలను స్పీడప్ చెయ్యవలసిన అవసరముంది. భోలక్‌పూర్ కలుషిత నీటి సమస్య ఎన్నికలముందు వచ్చి ఉంటే దీన్ని కూడా ఎన్నికలలో ఒక ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకునేవారేమో. అందుకని నీటిగండం ఎవరికైనా తగిలేదేమోనని నా సొంత అభిప్రాయంగా నేను మనవి చేసుకుంటున్నాను. మొత్తానికి ఏ విధమైన నీటి గండం లేకుండా ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం కలుషిత నీరు లేకుండా మంచినీటిని ప్రజలకు అందించే ప్రయత్నం ప్రత్యేకంగా చేయాలని నేను కోరుతున్నాను. ఆరోగ్యశ్రీ, 108 సేవలగురించి దుర్గేష్ గారు చాలా బాగా చెప్పారు. నేను వారు తెల్పిన విషయాలకు నా సంపూర్ణ మద్దతును తెలియచేసుకుంటున్నాను. ఆరోగ్య శ్రీ విషయానికి వస్తే, యాక్సిడెంట్లు జరిగి అప్పటికప్పుడు హాస్పిటల్‌కు తీసుకువెళ్లేటువంటి కార్యక్రమం చాలా మంచిది. అలాంటి కార్యక్రమం చేపడుతున్న ప్రభుత్వానికి నేను ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. మీదుమిక్కిలి అది కార్పొరేట్ హాస్పిటల్స్‌కు చెందకుండా ప్రభుత్వ హాస్పిటల్స్‌ను స్ట్రెంగ్తెన్ చెయ్యడానికి ప్రాధాన్యత తీసుకోవలసిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను.

గవర్నరు గారి ప్రసంగంలో ఎక్కడా పర్యావరణం గురించి పేర్కొనలేదు. ఈనాడు నీటి కాలుష్యం ధ్వని కాలుష్యం, వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నది. దానివల్ల మానవుని ఆయుర్దాయం క్షీణించిపోతున్నటువంటి ఈ దశలో వాతావరణ కాలుష్యాన్ని గురించి ప్రత్యేకించి శ్రద్ధ తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని నేను ఈసందర్భంగా మనవి చేస్తున్నాను.

ఈ రోజు ఎడ్యుకేషన్ గురించిన వార్త పేపర్లో చదవడం జరిగింది. కొఠారి గారు 10+2+3 అని సూచన చేశారు. దాన్ని పి.వి. నరసింహారావుగారు అమలు చేసి ఈ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను ప్రత్యేకంగా ఉంచాలనే నేపథ్యంలో ఉన్నప్పుడు ఈనాడు ఎందుకోమరి అకస్మాత్తుగా ఇంత భారీ మార్పును చేశారు. మేధావివర్గంతో, ఎమ్ఎల్‌సీలతో ఒక కమిటీ వేయండి. దానికి కొంత టైం ఇవ్వండి. ఆ టైం లోపల ఇతర రాష్ట్రాలలో చూసి అక్కడ ఎలా ఉన్నదో గమనించి వాళ్ళు రిపోర్టు ఇచ్చాక నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుంది. అసలు ఉపాధ్యాయ ఎమ్ఎల్‌సీలు గా ఎన్నికైన మా అభిప్రాయాలను, వాదనలను వినడానికి ప్రభుత్వం చొరవ చూపించాలి. కమిటీల ద్వారా పరిశీలించిన తరువాతనే ఇటువంటి నిర్ణయాలను తీసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం.

18 యూనివర్శిటీలను 23 యూనివర్శిలకు పెంచుతామని అన్నారు. చాలా సంతోషం. ఉన్నతవిద్యాశాఖా మంత్రి ఇక్కడే ఉన్నారు. యూనివర్శిటీలను పెంచి ఉన్నత విద్యను అభివృద్ధి చేయడమనే మంచి కార్యక్రమాన్ని మేము అభినందిస్తున్నాము. అయితే ఈ యూనివర్శిటీలలో ఈనాడు ఏ విధమైన మౌలిక వసతులు ఉన్నాయో గమనించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. నిజామాబాదునే తీసుకోండి. యూనివర్శిటీ అక్కడ ఏపరిస్థితులలో ఉన్నదో గమనించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. యూనివర్శిటీలు పెట్టడం కాదు, అక్కడ కనీస వసతులు, లెక్చరర్లను అపాయింట్ చేసే విషయాన్ని కూడా మనం గమనించవలసి ఉంటుంది. కమిటీ విషయానికి వచ్చినప్పుడు స్కూల్ బ్యాగుల గురించి 'యష్‌పాల్ కమిటీ' ని వేశారు. పిల్లల స్కూలు బ్యాగుల బరువు ఎంతుండాలని యష్‌పాల్ కమిటీని వేశారు. అంత చిన్న విషయం మీదనే దేశ వ్యాప్తంగా అధ్యయనం చేసిన తరువాత ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టు మీద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరి ఈ నాడు ఇంటర్మీడియట్ బోర్డును తీసుకువచ్చి స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలో కలపబోతున్న ఈ నేపథ్యంలో ఏ విధమైన కమిటీ వేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఆలోచించవవలసిన అవసరం ఈ ప్రభుత్వానికి ఎంతైనా ఉన్నదని నేను మనవి చేస్తున్నాను.

జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులు కట్టి వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేస్తున్నారు. అందుకు చాలా సంతోషం. ఈ రాష్ట్రంలో 58.5 శాతం మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. అలాంటి వ్యవసాయ రంగంలో పనిచేసే వారికి కాలరీస్ విషయానికి వస్తే 1979వ సంవత్సరంలో 478 కేజీలు ఇచ్చేటువంటి పరిస్థితి ఉంటే, 2004-05 లో 445 కేజీలు ఇస్తే, ఈ నాడు వెయ్యిమందికి 62 మందికి మాత్రమే పౌష్టికాహారం లభిస్తోంది. వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, తెలంగాణా ప్రాంతమైన నల్గొండ, మహబూబ్‌నగర్ మున్నగు జిల్లాలలో ఆడపిల్లలను అమ్ముకునే పరిస్థితి నేటికీ కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో గిట్టుబాటు ధర కల్పించే విషయంలో మరింత చొరవ తీసుకోవాలని తమద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆంధ్రులు ఆరుకోట్లు అన్నారు, ఆరుకోట్లనుండి ఎనిమిది కోట్లు అయ్యారు, ఇప్పుడు పదికోట్లు అయ్యారు. జనాభా నియంత్రణ గురించి గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా చెప్పకపోవడం చాలా బాధాకరం. దీనిపై ప్రత్యేకంగా

శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉందని మనవి చేస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గౌరవ ఛైర్మన్‌గారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

శ్రీ జూపూడి ప్రభాకర్ రావు (నామినేటెడ్) ః అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగంలో 29 వ పేజీ 12 లైన్ - "మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గత 62 సంవత్సరాలలో గట్టి కృషి జరిపినప్పటికీ మన జనాభాలోని అనేక వర్గాలవారు ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిల వారు విద్య, ఆరోగ్య భద్రత, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం, రక్షిత త్రాగునీరు, ఉపాధి హామీ స్థాయిలు లేకుండా దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తూనే ఉన్నారు". వారందరికి మన మద్దతు అవసరం. మన గణతంత్ర స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా అప్పటి రాష్ట్రపతి స్వర్గీయ శ్రీ కె.ఆర్. నారాయణన్ పలికిన మాటలను స్మరించుకుందాము. అవేవంటే _

'యాభై సంవత్సరాల గణతంత్ర జీవితంలో మన తోటి లక్షలాది పౌరుల జీవితాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమనేది నెరవేరని కలగానే మిగిలిపోయినట్లు కనుగొన్నాము. మన ఆర్థిక ప్రగతి ప్రయోజనాలు వారికి ఇంకా అందాల్సి ఉంది. మనకు ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో సాంకేతిక సిబ్బంది ఉన్నారు. అంతేకాక, ప్రపంచంలోని అన్ని దేశాల కంటే అత్యధిక సంఖ్యలో నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. ప్రపంచదేశాల కంటే అత్యధిక సంఖ్యలో మధ్యతరగతి వారున్నారు. అంతేకాక, అత్యధిక సంఖ్యలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు ఉన్నారు. పౌష్టికాహార లోపంతో అధిక సంఖ్యలో పిల్లలు బాధపడుతున్నారు. మన భారీ ఫ్యాక్టరీలు మురికి కూపాలనుంచే ఏర్పడ్డాయి. మన ఉపగ్రహాలు పేదల గుడిసెల మధ్య నుండి నింగికి ఎగిశాయి.'

"సోదర సోదరీమణులారా, దారిద్ర్యం, ఆకలి, అవకాశాలలో అసమానతలు తొలగించడం కోసం ప్రజలకు మనమందరం పునరంకితమై సుపరిపాలన అందిద్దామని ఈ మహత్తర సందర్భంగా సంకల్పిద్దాము." ఇది గవర్నరు గారి ప్రసంగం తెలుగు వెర్షన్‌లో చివరి పేజి.

మాజీ రాష్ట్రపతి శ్రీ కె.ఆర్. నారాయణ గారు ఉటంకించినటువంటి విధానాలను ఈ నాటి గవర్నరు గారు మనకు గుర్తు చేశారు. రెండు రోజుల నుండి మనం ఇక్కడ చూస్తూనే ఉన్నాము. ఎవరు ఎందుకు గెలిచారు, ఎవరు ఎలా ఓడిపోయారో మనం చూస్తున్నాం. గెలుపు ఓటముల మధ్య తారతమ్యాన్ని 1.06 గా వర్ణించినటువంటి మేధావులు కొంతమంది ఇక్కడ ఉన్నారు.

మ. 1.30

అయితే గెవలడానకి ఓటు వేసినటువంటి ఓటర్ల శాతం 36.56గా మాత్రమే వర్ణించారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో బిలో పావర్టీ లైన్ ఉన్న శాతాన్ని చూడండి, దాదాపు 40 శాతం బిలో పావర్టీ లైన్‌లో ఉన్నాము. ఓటు వేసిన శాతం దాదాపు దగ్గరగా ఉన్నది. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వం తిరిగి రావడానికి ఓటు వేసిన ప్రజలు ఎవరో చూడండి – పేదలు కాదా అని నేను అడుగుతున్నాను. ఏ శాతం ప్రజలైతే ఓటు వేసి మళ్ళీ రాజశేఖర్ రెడ్డి గారిని గెలిపించి అధికారంలోకి తేవడానికి ప్రయత్నించారో, ఆ పేదల తలంపులను గానీ, ఆలోచనలను గానీ, మొగ్గలోనే త్రుంచాలని ఎవరైనా ప్రయత్నం చేస్తే, చరిత్రహీనులవుతారని కూడా చెప్పదలచుకున్నాము. అదే క్రమంలో రాజశేఖర్ రెడ్డి గారి గత ఐదు సంవత్సరముల కాలంలో ఈ రాష్ట్రంలో ఉన్న 80 శాతం ఉన్నటువంటి పేద ప్రజలను ఉద్దేశించి వారికి కావలసినటువంటి అవసరాలని దృష్టిలో పెట్టుకుని, ఎవరు ఏమనుకున్నా సరే, ఒకే ఒక్కడుగా నిలబడి ఈ రాష్ట్రంలో గెలిచిన విధానం కనపడుతున్నది.

అనేక కూటములు ఏర్పడనివ్వండి, ఫెయిలయినటువంటి అనేక మార్క్సిస్టు ధోరణులు, దాడులను దాటనివ్వండి. అభివృద్ధికోసం కాంక్షిస్తున్నటువంటి వ్యక్తి మీద, కమ్యూనిస్టులమని చెప్పుకొనే మనం, ప్రాంతీయ వాదంతో రాష్ట్రం ఎటు పోయినా ఫరవాలేదనుకునే మనం, రాష్ట్రాన్ని అభివృద్ధిచేయడంకోసం కాంగ్రెస్ పార్టీ పందికొక్కుల్లాగా తినిపోయిందని, తెలుగుదేశం ప్రభుత్వం ఒక కూటమిలాగా ఏర్పడి ప్రజల మన్ననలని, పేద ప్రజల అభిమానాన్ని చూరగొనినదా అని ఒక పేదవాడిగా, ఒక దళితుడిగా నేను అడుగుతున్నాను. సమాధానాలు చెప్పవలసిన అవసరం ఉన్నది. ఈరోజు 0.2 శాతంతో ఓడిపోయామా లేకపోతే గెలిచామా అన్నది కాదు. The democracy beauty is that, even one vote is enough to get a victory, but.. ఎవరైతే గెలిచారో వారు ప్రజల పక్షాన సరైనబాధ్యత వహించాలని కోరుతున్నాను. ఈ రోజు అందరూ పేదల తరఫున మాట్లాడుతున్నారు. 62 సంవత్సరములుగా అందరూ పేదల తరఫున మాట్లాడుతున్నారు, ప్రతి వారు పేదలకి అన్నీ ఇచ్చేస్తే, పేదవాడు బుద్ధిలేక ఇంకా పేదవాడు అయిపోతున్నాడా పరిపాలించేవానికి బుద్ధిలేక ఇంకా పేదరికం అక్కడే ఉన్నదా అని మనకి మనం ప్రశ్నించుకోవాలి. పేదవాడిని మనం ఇంకా ఎంతకాలం అక్కడే పెట్టాలి? ఇళ్లు కావాలన్న ఒక కల నిర్మించి ఇస్తున్నాము. ఈ రాష్ట్రం ఒక ఫ్రీ ఎడ్యుకేషనల్ జోన్‌గా మారుతున్నది. ఇలా మార్పే క్రమంలో పేద ప్రజలకి సంబంధించి సరైన విధానాలు అందుతున్నాయా లేదా అని చూడవలసిన బాధ్యత పాలకులమీద, వారితోబాటు ప్రతిపక్ష నాయకుల మీద ఉన్నది. ఎన్నికలలో ఓడిపోయినవారు, విర్రవీగినటువంటి వారు ఈ మధ్యకాలంలో నాకు ఏ మాత్రం తిరుగులేదు అనుకున్నవారిని ప్రజలు ప్రక్కనపెడుతున్నారు. దేశం మొత్తం ఈ రోజు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకునే విధంగా మారుమూల ప్రాంతాలలో ఉన్నటువంటి వారు సుదూర ప్రాంతాలలో ఉన్నటువంటి వారు వాడుకునే విధంగా అధికారాలని ఇవ్వడం జరిగింది. 33 కేంద్రాలలో ఎం.పి.లు అనవచ్చు, లేక తగ్గినవి తారతమ్యాల చూడటానికి అనవచ్చు. పేదవాని ఆలోచనలని, ఓటర్లని గుర్తుంచుకోవలసిన అవసరం ఉన్నది. వాళ్ళలో ఉన్నది. పేదల సంఖ్య ఏదైతే ఉన్నదో, ఈ రాష్ట్రంలో ఖచ్చితంగా బిలో పావర్టీలైన్ సంఖ్యగా నేను భావిస్తున్నాను. ఎవరైతే తనకు కావాలో, ఆ కావలసినటువంటి వారిని ఓటింగ్ మిషను ద్వారా ఎన్నుకునే విధానం ఉన్నది. దురదృష్టవశాత్తు ఈవియం మిషన్స్‌ని కూడా తప్పు పడుతున్నారు. Can you identify the mistake in the science? I do not know. ఈవియం మిషన్స్‌ని మీరు ఏ విధంగా తప్పుపట్టగలుగుతున్నారు ? ఎవరు చేసినా సరే. It is not at all correct. కావున ఈ రాష్ట్రంలో వచ్చిన ఈ అధికారం, ఈ రాష్ట్రంలో గెలిచిన ఎం.ఎల్.ఏ లు Irrespective of other parties, my humble request is that ఇది నేను చెపుతున్నది కాదు, పేదరికం ఇంకా ఉన్నది. ఇది మనం అధికారపక్షంగా చెపుతున్నటువంటి విషయం. ఈ పేదరికాన్ని, బాధలనీ, దరిద్రాన్ని, ఆకలిని, నిరుద్యోగాన్ని, లేమి తనాన్ని మనం ఏ రోజు అయితే బయటకు తీయగలమో, ఆ రోజు మనము అనుకున్న ఆంధ్రప్రదేశ్ తయారవుతుంది. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, సభలో ప్రసంగించడానికి అధికారపక్షానికి సంబంధించి 7గురు సభ్యులకు అవకాశం ఇచ్చారు. మాకు మాత్రం ఒక్కరికే మాట్లాడడానికి అవకాశం ఇచ్చారు. కనీసం ఇద్దరికైనా మాట్లాడడానికి అవకాశం ఇచ్చి, మాకు తగిన సమయాన్ని కేటాయించవలసిందిగా తమరిని అభ్యర్థిస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్ : దానికి నేను బాధ్యుడిని కాను. అలా సాధ్యమా? మీరు ఛైర్మన్‌గారితో మాట్లాడండి.

శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ (కృష్ణా) : అధ్యక్షా, చాలా సంతోషం. మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. గవర్నరుగారి ప్రసంగంలోకి వెళ్లే ముందుగా నూతనంగా ఎన్నికలలో గెలిచి ప్రభుత్వాన్ని స్థాపించిన మా కాంగ్రెస్ మిత్రులందరికీ శుభాకాంక్షలు, అభినందనలు మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను. మా మిత్రుల ఉత్సాహం కనపడడం లేదు. ముఖ్యంగా మా ఎం.ఎల్.సి. మిత్రులలో. నిన్న సభలో స్పీచ్‌లు జరుగుతుంటే, దానికి కౌంటర్‌గా మంత్రులు విపరీతంగా రెస్పాండ్ అయ్యారు. కానీ మా ఎం.ఎల్.సి. మిత్రులు అంత తీవ్రంగా రెస్పాండ్ కాలేదు. అంటే వారందరి మనసులలో మా అందరికీ మంత్రి పదవులు రాలేదే, అన్నటువంటి భావన, బాధ కనపడుతున్నది. ఎందుకంటే శ్రీ గిడుగు రుద్రరాజు, శ్రీ రుద్రరాజు పద్మరాజు, శ్రీ సుధాకర్ రెడ్డి, కార్పోరేషన్ అన్నా వస్తుందని అప్పుడప్పుడు లేస్తున్నారు కాని, ఇంకా సీనియర్లు, అనేక మంది ఉన్నారు...

(అంతరాయం)

ఎం.ఎల్.సి.లకు కూడా మంత్రిపదవులు ఇస్తే గౌరవంగా ఉంటుందని నా అభిప్రాయం. అలాగే ఏ.సి.డి.ఎఫ్. ఫండ్స్ ఎం.ఎల్.సి.లకు ఇస్తే గౌరవంగా ఉంటుందని తెలియజేస్తున్నాను. అధ్యక్షా, నిన్న గవర్నరుగారి ప్రసంగంలో పాలమూరు జిల్లా నుంచి వలసలు ఆపాము, ఇతర జిల్లాల నుంచి పాలమూరుకు కూలీలు వస్తున్నారని, మెన్షన్ చేయడం జరిగింది. నెలరోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో పాలమూరుకు చెందిన 15 మంది కూలీలు మట్టిపనిచేస్తూ చనిపోయిన విషయం మరచిపోయారా! అంతే కాదు అధ్యక్షా, మేము క్రొత్త పన్నులు వేయలేదని చెప్పి రోశయ్యగారు, మన మిత్రులు కూడా చెప్పారు. గవర్నరుగారు ఈ పుస్తకంలో కూడా అలాగే చెప్పారు. గతంలో రూ. 9,000 ఉన్నటువంటి సేల్స్ టాక్స్ ఈ రోజున రూ. 25,000 కోట్లు అయింది. అలాగే ఎక్సైజ్ ట్యాక్స్ రూ. 3,000 కోట్ల నుంచి రూ.12,000 కోట్లకు పెరిగింది. స్టాంప్ డ్యూటీ ఎన్ని సార్లు పెంచారు? రూ. 1,800 కోట్లు ఉన్నది రూ. 3,500 కోట్లు అయినది. ఇవి అన్నీ పన్నులు కాదా అధ్యక్షా. మీరు కొత్త పన్నులు కొత్త పేరుతో వేయకపోయినా, పాత పన్నులు పెంచారా, లేదా? ఈ వాస్తవాన్ని ఎక్కడ చెపుతున్నారు? రోశయ్యగారు అయినా గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పవలసిందిగా కోరుతున్నాను. గవర్నరుగారు మొత్తం 30 పేజీల ప్రసంగాన్ని ఇచ్చారు. ఈ 30 పేజీల ప్రసంగంలో 559 లైన్లలో మా స్థానిక సంస్థల గురించి, అదీ పంచాయతీ రాజ్ గురించి కేవలం 4 లైన్లు మాత్రమే పేర్కొనడం జరిగింది.

మ.1.40

ఆ నాలుగు లైన్లను కూడా అటు పావు, ఇటు పావు కత్తిరించి, ఆఖరకు రెండున్నర లైన్లో మెన్షన్ చేశారు. కాపురం చేసే కళ కాళ్ల గోళ్ల దగ్గర కనపడుతుందని అంటారు. మా స్థానిక సంస్థల పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ యొక్క ప్రసంగ పాఠం ద్వారానే కనపడుతోంది. అంతేకాదు అధ్యక్షా, వీరు స్థానిక సంస్థల గురించి ఏమి చేయలేకపోయారు కాబట్టే గవర్నరు ప్రసంగంలో దాన్ని గురించి ప్రస్తావించలేకపోయారని అనుకుంటున్నాను. జలయజ్ఞం గురించి, ఇతర పథకాల గురించి చాలా చెప్పారు. కాని స్థానిక సంస్థలకు బదలాయించవలసిన బాధ్యతల గురించి చెప్పలేదు. అంతేకాకుండా, సర్పంచుల్ని నిర్వీర్యం చేసి, ఎంపిటిసిలను నిర్వీర్యం చేసి, పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కేవలం ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు కాబట్టే, ఎంపిటిసిలు, సర్పంచులు మీకు వ్యతిరేకంగా ఉండటం వల్లనే ఈరోజున మీకు సీట్లు తగ్గాయనే వాస్తవాన్ని మీరు గుర్తించాలి. కాంగ్రెస్‌కు 156 సీట్లు వస్తే, టిడిపికి 92 సీట్లు వస్తే, 45 నియోజకవర్గాల్లో దాదాపు 150 నుండి 1000 ఓట్ల తేడాతో మేము ఓడిపోవడం జరిగింది. అదే కనుక

తిరగబడితే మీరు ఏమయ్యే వాళ్లో గుర్తించండి. ముఖ్యమంత్రిగారు గుర్తించారు కాబట్టే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత అయిదు సంవత్సరాల్లో తీసుకోని జాగ్రత్తల్ని ఇప్పుడు వారు తీసుకుంటున్నారు. కాబట్టి మీరు కూడా ఆ జాగ్రత్తల్ని తీసుకుంటే బాగుంటుంది. ఇటువంటి స్వల్ప మెజార్టీతో గెలిచిన గెలుపూ ఒక గెలుపేనా? మీరు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవలసిందిగా కోరుతున్నాను.

చివరగా, ఒక మాట చెప్పదలచుకున్నాను. మీరు ఎలా గెలిచారో అందరికీ తెలుసు. పి.ఆర్.పి., లోక్‌సత్తా వంటి ఒకటి, రెండు పార్టీలను శిఖండీలుగా పెట్టుకుని గెలిచిన మీ గెలుపు కూడా ఒక గెలుపేనా? దాని గురించి మీరు ఆలోచించవలసిందిగా కోరుతూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీమతి సిహెచ్. గంగా భవాని : అధ్యక్షా, శిఖండీ అనే పదాన్ని రికార్డుల నుండి తొలగించండి.

శ్రీ బొమ్మిడి నారాయణరావు (అసెంబ్లి) : అధ్యక్షా, కొత్తగా వచ్చిన సభ్యులందరికీ కూడా అభినందన మందారమాల తెలుపుతున్నాను. గవర్నరుగారి అడ్రసులో చివరగా స్వర్గీయ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్‌గారి చెప్పిన పలుకుల్ని ఇందాక మిత్రుడు జ్ఞాపకం చేశారు. దాదాపు 62 సంవత్సరాల స్వతంత్ర భారత ప్రజాస్వామ్యంలో సామాన్యుడు ఇంకా సామాన్యుడుగానే ఉన్నాడు. అతనికి దొరకవలసిన ప్రయోజనాలు లభింపచేయడంలో మనం ఇంకా వెనుకంజలో ఉన్నాం అని ఆయన చెప్పిన మాటల్ని మన ముందు ఉంచారు. అధ్యక్షా, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, దాదాపు ఒక పదహారు, పదిహేడు సంవత్సరాలు తప్పించి, తక్కిన కాలమంతా ఏకపార్టీ కింద దాదాపు 45,46 సంవత్సరాలపాటు ఈ రాష్ట్రంలో కొనసాగింది. ఈనాడు ఈ పరిస్థితులన్నింటికి కూడా పరోక్షంగా ఆ పార్టీయే కారణమని హెచ్చరిస్తూ ఆయన అన్నారు. అందుకే ఆ కొటేషన్‌ను మన ముందు ఉంచారేమో అని అభిప్రాయపడుతున్నాను. అదే నిజమైతే, ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

మిత్రులారా! చాలా మంది పెద్దలు మాట్లాడారు. ప్రగతి ప్రగతి అంటూ పెద్దల సభలో పాలనాధిపతులు బల్లలు గుద్దిరి......

(అధికారపక్షం నుండి అంతరాయం)

నాటకాలు వేయడానికి కూడా ఒక ప్రత్యేకమైన అర్హత ఉండాలి. దానికి పూర్వ జన్మ సుకృతం ఉండాలి. అదొక పరిపూర్ణమైన కళ.

ప్రగతి ప్రగతి అని పెద్దల సభలో పాలనాధిపతులు గుద్దిరి. ధరలు పెంచి, అవినీతి పెంచి, ఆత్మహత్యలు పెంచి, పెద్దలు మనసారా సారా రేట్లు పెంచి, ప్రగతిని దానిలో చూపించారే తప్ప, పాలనలో కరవు అయింది. వినుము వినుము అయ్యా కాంగ్రెస్ పెద్దలారా! మరొకసారి చెప్పమంటారా?......

(వద్దు వద్దు అని గౌరవ సభ్యులు అనసాగారు)

చాలా మంది కాంగ్రెస్ పెద్దలు మాట్లాడారు. అయితే ఏ ఒక్కరు కూడా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల గురించి మాట్లాడలేదే? పెరుగుతున్న రేట్లను చూసి భయపడి మాట్లాడలేదా? లేకపోతే మాట్లాడితే తప్పు అవుతుందని మాట్లాడలేదా? ఈమధ్య నేను ఒక పెళ్లికి వెళ్లాను. సాధారణంగా భారతీయ సాంప్రదాయం ప్రకారం, హిందూ సాంప్రదాయ ప్రకారం నెత్తి మీద జీలకర్ర, బెల్లం పెట్టి ప్రమాణ స్వీకారం చేయిస్తారు ...........

(సభలో నవ్వులు)

అది కూడా ఒక ప్రమాణస్వీకారం లాంటిదే. ఆ మాట అనడంలో తప్పు లేదు. నాతి చరామి నాతి చరామి అంటూ ప్రమాణం చేయిస్తారు. అయితే జీలకర్ర, బెల్లం తల మీద పెట్టించకుండానే ఆ పెళ్లిలో అక్కడి బ్రాహ్మణుడు పెళ్లి జరిపించేశాడు. నేను అడిగాను అయ్యా పౌరహిత్యం ఏదైనా మారిందా అని. అప్పుడు అతను అన్నాడు, అయ్యా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత అయిదు సంవత్సరాల్లో రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి, బెల్లం కొనలేని పరిస్థితి ఉంది. జీలకర్ర కొనలేని పరిస్థితి ఉంది. జీలకర్ర రూ. 200 అయింది. చింతపండు కొనలేని పరిస్థితి ఉంది. కాబట్టి జీలకర్ర, బెల్లం లేకుండానే మామూలు పూల దండలతో పెళ్లి జరిపించాను అని చెప్పాడు. అటువంటి దౌర్భాగ్య పరిస్థితి ఈరోజు ఈ రాష్ట్రంలో ఉంది. మీరు ఇంకా మీ పిల్లలకు పెళ్లిళ్లు చేయలేదు కాబట్టి మీకు తెలిసి ఉండకపోచ్చు.

మిత్రులారా! ఈరోజు మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల పరిస్థితి ఎలా ఉందంటే, రోశయ్యగారు కాని, మరొకరు గాని గతంలో పర్సు నిండా డబ్బులు పట్టుకుని బజారుకు వెళ్లితే, సంచి నిండా సరుకులు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ఈనాడు సంచి నిండా డబ్బులు తీసుకుని వెళ్లితే, పర్సులో ఏ ఉల్లిపాయ తొక్కో, ఆవకాయ చెక్కో తెచ్చుకునే దౌర్భాగ్య పరిస్థితి ఉందని తెలియచేస్తున్నాను. ఎవరు దీనికి కారణం అని ప్రశ్నిస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు పెద్దలకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) : అధ్యక్షా, అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు నా ధన్యవాదాలు. యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, జయప్రకాష్ నారాయణ్‌గారి ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి, ఈరోజు రాష్ట్రంలో ఎంతో మంది పేదలకు సహాయం చేస్తూ, మడమ తిప్పని ముఖ్యమంత్రిగా, తిరిగి కాంగ్రెస్ పార్టీ రెండవసారి అధికారంలోకి రావడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారికి, మంత్రివర్గ బృందానికి, ఇక్కడకు కొత్తగా వచ్చిన సభ్యులకు నా హృ దయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను.

ఈ సందర్భంగా మీ ద్వారా ఒక విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకుని రాదలిచాను. ఇప్పుడు మనం గ్రామీణ, పట్టణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించేందుకు 104,108 సర్వీసులను ప్రవేశపెట్టాం. వాటి ద్వారా రోగుల్ని ఆసుపత్రులకు చేరవేస్తున్నాం. అదే విధంగా చనిపోయిన తర్వాత, పోస్టుమార్టమ్ జరిపి, మృతదేహాల్ని స్వస్థలాలకు ఈ వాహనాలు ద్వారా తరలిస్తున్నాము. ఆ విధంగా పేద ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అదే మాదిరిగా, పశు సంపదను కాపాడే చర్యల్లో భాగంగా 104,108 సర్వీసుల మాదిరిగానే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి, పశు సంపదను కాపాడి, దానిపై ఆధారపడిన పేద ప్రజల్ని ఆదుకోవాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మ.1.50

శ్రీ ముండ్ల వెంకట శివారెడ్డి : అధ్యక్షా, గవర్నరు ప్రసంగంపై వైండింగ్ అప్ స్పీచ్‌కి అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి కూడా అభినందనలు తెలియచేస్తున్నాను. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ముగిసాయి. Reality is fact. We have to accept the reality. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని చేపట్టింది. ప్రతిపక్ష హోదాలో మహా కూటమి సభ్యులంతా కూర్చోవడం జరిగింది. మా పాత్రను మేము పోషించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అలాగే మీ మీద బాధ్యత పెరిగింది. మీ పాత్ర ఇంకా ఎక్కువ పోషించవలసిన ఆవశ్యకత ఉందనేది ఒక్కసారి గుర్తు చేసుకొని ముందుకు పోవలసిందిగా పెద్దలందరినీ కోరుకుంటున్నాను.

గవర్నరు ప్రసంగంలోని కొన్ని అంశాల గురించి ప్రస్తావిస్తున్నాను. ముఖ్యంగా మహిళల సమస్య గురించి కొంచెం మాట్లాడాల్సి ఉంది. ఎందుకంటే మొట్టమొదటి మహిళా హోం మంత్రి ఇక్కడ ఉన్నారు కాబట్టి. ఎందుకంటే రాజశేఖర్‌రెడ్డి గారు మహిళా మంత్రిని పెట్టారు. ఎందుకు పెట్టారో డీప్‌గా మనమంతా ఆలోచించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ రాష్ట్రం 13.3 శాతంతో మహిళలపై అత్యాచారంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఒకసారి గుర్తించాలి. మహిళలపై గృహ హింసలు, భార్యా,భర్తల వేధింపుల్లో పోలీస్ రికార్డుల్లో 11,355 కేసులతో ఈ సంవత్సరం ప్రథమ స్థానంలో మన రాష్ట్రం ఉంది. అలాగే వరకట్న చావుల్లో నాలుగవ స్థానంలో ఉన్నామని గ్రహించి ఒక మహిళను హోం మంత్రిగా పెట్టారని అనుకుంటున్నాను. దీన్ని పూర్తి స్థాయిలో హోం మంత్రి గారు పర్యవేక్షించి ఈ స్థానం నుంచి ఈ రాష్ట్రాన్ని బయట పడవేసి మంచి దిశగా మహిళలకు రక్షణ కల్పించడంలో ముందుకు పోవాలనేది గుర్తించాలని మాత్రమే నేను తెలియచేసుకుంటున్నాను. కేవలం మహిళా సాధికారత పావలా వడ్డీకే పరిమితం చేయకుండా వాళ్ల రక్షణ కోసం కల్పించిన చట్టాల అమల్లో గానీ, ప్రైవేట్ యంత్రాంగాన్ని నిర్మించైనా గానీ, ప్రభుత్వ యంత్రాంగాన్ని పటిష్టం చేసైనా గానీ వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని మాత్రమే ఈ సందర్భంగా తెలియచేసుకుంటున్నాను.

వ్యవసాయం విషయానికొస్తే, ఇంతకు ముందే చెప్పారు. నాలుగేళ్లు వర్షాలు బాగా పడ్డాయి, ఉత్పత్తి బాగా పెరిగింది. 2004 లో ఉన్న 136 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి ఈనాడు 199 లక్షల మెట్రిక్ టన్నులకు ప్రొడక్షన్ పెంచారు. ఇంత పెంచినప్పటికీ ఎందుకు బజారులో కేజీ బియ్యం ధర రు.30/- నుంచి రు.35/- దాకా ఉన్నది, ఎందుకు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో మనకు లోపం కనపడుతున్నదని ఒక్కసారి చిత్తశుద్ధితో ఆలోచించుకోవలసిన అవసరం ఉందని మాత్రమే నేను తెలియచేసుకుంటున్నాను. ఆహార భద్రత పటిష్టం చేయవలసిన బాధ్యత ఉంది. దాని కోసం రీసెర్చ్ చేసుకొని తగు చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఉంది. నిర్మాణాత్మకమైన విమర్శలు చేసే ప్రతిపక్షాలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పడం లేదు. కానీ వారి విమర్శలను అర్థం చేసుకొని ముందుకు పోవలసిన బాధ్యత ఉందని తెలియచేస్తున్నాను. ఈరోజు ఒక నిధిని ఏర్పాటు చేసి రెగ్యులైజేషన్ ఆఫ్ ప్రైసెస్‌కి స్పెషల్‌గా ఏవన్నా స్కీములు చేసుకోగలమా చూడాలి. ఇంతకు ముందే చెప్పారు, వంద అన్నారు, మూడొందలన్నారు. రెగ్యులరైజేషన్ ఆఫ్ ప్రైసెస్‌కి ఎంత నిధి పెట్టారో తెలియదు. తెలుగుదేశం ప్రభుత్వం Research Analysis Wing for Essential Commodities (RAWEC) అనే ఆర్గనైజేషన్ మొదలు పెట్టింది. దాన్ని తెలుగుదేశం ప్రభుత్వం మొదలు పెట్టిందని పక్కన పెట్టకుండా ఎప్పుడూ ధరలు ఎందుకు పెరుగుతున్నాయి, ఎట్లా కంట్రోల్ చేయాలి, దీనికి ఎంత నిధి వెచ్చించాలనే ఉద్దేశంతో ముందుకు పోతే ఖచ్చితంగా ఈ prices ని కంట్రోల్ చేయవచ్చు అని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను.

బడ్జెట్‌లో రెండు అంశాలను మనం ప్రస్తావించాం. Agriculture and Allied Sector కి ఈరోజు కేటాయించిన బడ్జెట్‌లో రు.4993 కోట్ల నుంచి రు.2927 కోట్లకు తగ్గించారు. అలాగే గ్రామీణాభివృద్ధిని రు.6272 కోట్ల నుంచి రు.5913 కోట్లకు తగ్గించారు. దీనికి ప్రజలు ఆలోచిస్తున్నారు, రైతుల మీద మీలో చిత్తశుద్ధి ఏమన్నా తగ్గిందా అని. వారికి సమాధానం చెప్పవలసిన బాధ్యత ఉంది. ఇందిరమ్మ హౌసింగ్ గురించి గొప్పగా చెప్పుకుంటున్నాం. అందరికీ ఇళ్లు ఉండాలనేది మంచి పద్ధతే. కానీ మీ లక్ష్యమేమిటి? 5 ఏళ్లలో 80 లక్షల గృహాలు కట్టాలనేది. ఇప్పటికి పూర్తయిన గృహాలు 36 లక్షల నుంచి 40 లక్షలని మీరే చెప్పుకుంటున్నారు. కాబట్టి ఈ గృహ నిర్మాణ పద్దుల్లో ఒక్కసారి ఆలోచించండి. సవరించిన అంచనాలు అనగా రివైజ్డు ఎస్టిమేట్స్ ఎంతున్నాయి? రు.5997 కోట్లు రివైజ్డు అంచనాలు ఉంటే పెద్దలు రోశయ్య గారు మొన్న ఇచ్చిన బడ్జెట్‌లో రు.5001 కోట్లకు తగ్గించమన్నారు. అంటే సుమారు వెయ్యి కోట్లు తగ్గించారు. ఇంకా రు.1500 కోట్లు పెంచాల్సింది పోయి, అంటే సుమారు రు.2500 కోట్లు తగ్గితే మీ లక్ష్యాన్ని మీరు చేరగలరా? వోట్ ఆన్ అకౌంట్ కావచ్చు, ఇంకొకటి కావచ్చు. మీ దిశ, ఆలోచన, పయనం ఏ విధంగా పోతున్నదో అనేది వెయ్యి కోట్లు తగ్గించడం ద్వారా ఒక నిదర్శనంగా కనపడుతున్న విషయాన్ని గ్రహించవలసిందిగా ఒక్కసారి మిమ్మల్ని కోరుతున్నాను. రు.2500 కోట్లు తగ్గితే 80 లక్షల లక్ష్యాన్ని మీరు ఎప్పుడు చేరతారు అది వాస్తవం అవుతుందా లేదా అనేది గ్రహించాలి.

ఇంతకు ముందు మంత్రిగారు ఇందిరమ్మ హౌసింగ్‌లో ఏదన్నా అవినీతి ఉంటే అడగమన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి గారి జిల్లాకు ఒకసారి వస్తే చాలు. రాయచోటి గానీ లక్కిరెడ్డిపల్లి నియోజక వర్గంలో గానీ ఎన్ని అవినీతులు జరిగాయో చూపించడానికి సిద్ధంగా ఉన్నాం. కలెక్టర్ గారి దృష్టికి కూడా తీసుకు వెళ్లాం. సాక్షాత్తూ కడప జిల్లాలో అర్బన్ హౌసింగ్‌లో 4000 నుంచి 5000 ఇళ్లు కట్టారు. కనీసం 2 నుంచి 5 శాతం కూడా ఆక్యుపెన్సీ లేదు. ఎందుకు ఆ విధంగా ప్లాన్ చేయవలసి వచ్చింది. డిమాండ్ అండ్ సర్వే పద్ధతిలో కాకుండా ఎందుకు ఇళ్లు కట్టారని కూడా ఒకసారి ఆలోచించుకోవాలి. ఇంతకు ముందు కూడా దీని గురించి సభలో ప్రస్తావించడం జరిగింది కానీ దాని మీద యాక్షన్స్ ఏమీ లేకుండా పోయాయని ఒకసారి మీ దృష్టికి తీసుకు వస్తున్నాను.

సోదరులారా, సోదరీమణులారా, ఒక గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీగా విద్యా రంగం, వైద్య రంగం గురించి కూడా ఒకసారి ప్రస్తావించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే మిత్రులు చెప్పారు. గత 5 సంవత్సరాల్లో మీరు అక్షరాస్యత కోసం ఎంత ఖర్చు పెట్టారు? ఎందుకా లక్ష్యాల్ని చేరుకోలేక పోయారు? ఈరోజు 28 వ స్థానంలో ఉన్నామని సభ్యులు చెప్పారు. ఇది గొప్పతనమా? ఆయన 28 అని చెప్పారు కానీ నా రికార్డుల ప్రకారం 23వ స్థానంలో ఉన్నట్లు అర్థమవుతున్నది. ఇది గొప్పతనమా? 5 ఏళ్లుగా నిరక్షరాస్యత నిర్మూలన కోసం ఎంత ఖర్చు పెట్టాం? ఆ నిధులు ఏమయ్యాయని ఒకసారి మనమంతా ఆలోచించుకోవలసిన అవసరం ఉందని గుర్తు చేస్తున్నాను. అంతే కాకుండా బాల కార్మిక వ్యవస్థలో ఈ రాష్ట్రం రెండవ స్థానంలో ఉంది. ఇది సిగ్గుచేటు కాదా అని ప్రశ్నిస్తున్నాను. ఇది వెంకట శివారెడ్డి రికార్డులు కాదు. ఖచ్చితమైన రికార్డులు. కాబట్టి ఒకసారి ఆలోచించుకోండి. ఇది ఖచ్చితంగా ఆలోచించాల్సిన విషయం. అలాగే హెచ్ఐవి ఎయిడ్స్ బాధితుల్లో కూడా ఈ రాష్ట్రం రెండవ స్థానంలో ఉంది. అది గొప్పతనమా? నిర్మూలించాల్సిన అంశాలను పక్కన పెడితే, వీటి మీద సీరియస్ యాక్షన్స్ లేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మీరు ప్రాథమిక వైద్యాన్ని ఖచ్చితంగా చిన్నచూపు చూస్తున్నారు.

ఒక్కసారి ఆలోచించండి. 2004 వ సంవత్సరంలో 13.3 శాతం విద్యా రంగం మీద ఖర్చు పెడితే ఈరోజు అది 11 శాతానికి తగ్గి పోయింది. మీరు ఫిగర్లు చెబుతున్నారు కానీ ఎంత శాతం తగ్గిందో ఒక్కసారి ఆలోచించండి. 13.3 శాతం నుండి 11 శాతానికి ఎడ్యుకేషన్‌లో తగ్గింది. వైద్య రంగంలో ఆనాడు 4.5 శాతం ఉండేది. ఇప్పుడు కేవలం 3.3 శాతం మాత్రమే ఉన్నది. మీరు వేల కోట్ల సంఖ్యలు చెప్పవచ్చు. రు.3 ఉన్నప్పుడు రు.3 ఖర్చు పెట్టటం వేరు, లక్ష రూపాయలు ఉన్నప్పుడు రు.50 ఖర్చు పెట్టటం వేరు. కాబట్టి ఆరోజుకు అనుగుణంగా ఉన్న శాతాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రైమరీ హెల్తు మీద, ప్రైమరీ ఎడ్యుకేషన్ మీద ఎందుకు తగ్గించాల్సి వచ్చిందో ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీ మీద ఉందని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అలాగే 18 యూనివర్సిటీలు పెట్టారు, సంతోషం. కాదనలేం. మిత్రులంతా అడిగారు. దానికి బడ్జెట్ ఎంతో, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంతో ఒకసారి ఆలోచించండి. పెట్టిన బడ్జెట్ 50 శాతం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఉపయోగ పడలేదు. How can we make centres of excellence అని మిమ్మల్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ట్రిపుల్ ఐటిని ఏర్పాటు చేశారు. ఇంతకు ముందే ఈ కౌన్సిల్‌లో చెప్పాం. ట్రిపుల్ ఐటి ఒక మంచి అంశం. గ్రామీణులకు సెక్యులర్ ఎడ్యుకేషన్ ఇచ్చే ఒక మంచి అంశమని భావించాం. కానీ మంత్రి గారిని మరొకసారి అడుగుతున్నాను, ట్రిపుల్ ఐటిల్లో స్పోర్ట్స్ కోటా ఇంతకు ముందు కూడా డిమాండ్ చేశాం. ట్రిపుల్ ఐటిలో స్పోర్ట్స్ కోటాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ముఖ్యమంత్రి గారు ఈ సభలో ఉన్నప్పుడే గతంలో అడిగాం, ఖచ్చితంగా ఇంప్లిమెంట్ చేస్తామన్నారు. ఈసారి కూడా ట్రిపుల్ ఐటిలో స్పోర్ట్స్ కోటాను ఇంప్లిమెంట్ చేసే ఆలోచన అధికారులకు ఉన్నట్లు లేదని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. కాబట్టి దాని మీద చిత్తశుద్ధితో స్పోర్ట్స్ కోటాను ఇంప్లిమెంట్ చేయవలసిందిగా కోరుతున్నాం.

రీఇంబర్స్‌మెంట్ ఆఫ్ ఫీజులు, స్కూళ్లను రెసిడెన్షియల్‌గా చేయడం అనే ఆలోచనా విధానం మంచిగా ఉన్నప్పటికీ ఇంకా మనం ఎంప్లాయ్‌మెంట్ దిశగా కొంచెం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్ని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేస్తున్నారు. ఆ రోజు గవర్నమెంటు చేపట్టినప్పుడు 11,98,000 మంది ఉద్యోగులు ఉంటే ఈరోజు 11,48,000 కి తగ్గాయి కాబట్టి దయచేసి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ రంగంగా చేయకుండా ఎంప్లాయ్‌మెంట్ గురించి ఆలోచన చేయవలసిన ఆవశ్యకత ఉందని మనవి చేస్తున్నాను. డిగ్రీ పూర్తయ్యి ......

మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్ : హెల్తు మినిస్టర్, ఎడ్యుకేషన్ మినిస్టర్ కొత్తగా మంత్రులు అయ్యారు. కొంచెం ఓపిక పట్టండి.

శ్రీ ముండ్ల వెంకట శివారెడ్డి : నిరుద్యోగుల గురించి ఇంతకు ముందు మా ఎలక్షన్ మేనిఫెస్టోలో మా గవర్నమెంటు వస్తే డిగ్రీ పూర్తయిన వారికి ఖచ్చితంగా నిరుద్యోగ భృతి వెయ్యి రూపాయలు ఇస్తామని చెప్పడం జరిగింది. నిరుద్యోగ భృతి వారిని సోమరులను చేసేందుకు కాదు. వారి ఉద్యోగ అన్వేషణలో ఎంతో ఉపయోగపడుతుంది కాబట్టి నిరుద్యోగ భృతిని ఖచ్చితంగా ఇవ్వవలసిందిగా ప్రభుత్వాన్ని మీ ద్వారా డిమాండ్ చేస్తున్నాను. అలాగే డిఎస్సీలను ప్రతి సంవత్సరం నిర్వహించి ఉపాధ్యాయులను నియమించవలసిందిగా కోరుతున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో కేవలం ఒక్క డిఎస్సీ మాత్రమే 2006లో జరిగింది. కొత్త డిఎస్సీ ఇంకా పూర్తిగా నెరవేరలేదు. అదే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏడు సార్లు సక్రమంగా డిఎస్సీని కండక్ట్ చేసి 1,67,000 మంది టీచర్లకు ఉద్యోగం ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కిందని ఈ సందర్భంగా తెలియ చేసుకుంటున్నాను. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోని మునిసిపాలిటీ టీచర్లను 2000 సంవత్సరంలో భర్తీ

చేసారు. తరువాత ఇంత వరకు భర్తీ కాలేదంటే మున్సిపాలిటీలో అర్బన్ పరిస్థితి ఎలా ఉందో ఒకసారి మీరు గ్రహించాలి.

టెర్రరిజమ్ మీద గవర్నరు ప్రసంగంలో...... లా అండ్ ఆర్డర్ మీద ప్రజలు ఎంత భయ భ్రాంతులవుతున్నారో ఒక్కసారి గ్రహించాలి. టెర్రరిజాన్ని అరికట్టేందుకు ఏదో ముందు రోజు పోలీస్ వ్యవస్థను అప్రమత్తం చేయడం, ప్రజలను అప్రమత్తం చేయడం కాకుండా లాంగ్ టర్మ్ ప్రాసెస్ కావాలి. బయో మెట్రిక్ కార్డులు ఇస్తామంటున్నారు. దానితో పాటు వేలి ముద్ర కలిగిన బయో మెట్రిక్ కార్డులు లాంగ్ టర్మ్‌లో ఇవ్వగలిగితే ఇది చాలా ఉపయోగపడే పద్ధతి. మల్టీ పర్పస్ కార్డులో వేలి ముద్ర ఎప్పుడు వస్తుందో అప్పుడు మనం ఐడెంటిఫై చేయగలం. మన సిటిజన్స్, ఎవరు దొంగలు, ఎవరు మంచి వాళ్లు ఎవరనేది ఐడెంటిఫై చేయగలం. కాబట్టి ఆ దృష్టితో ఇప్పటి నుంచే ఖర్చు పెట్టుకుంటే లాంగ్ టర్మ్‌లో అది సహాయపడుతుంది. ఆక్టోపస్ ఏజెన్సీని బలోపేతం చేయాలి. మీ ప్రభుత్వం వచ్చింది. సెంట్రల్ గవర్నమెంటు నుంచి నిధులు రావడానికి అవకాశం ఉంది. ఆదాయం పెరిగింది. పెరిగిన ఆదాయం, వనరులు సద్వినియోగ పరచి, పూర్తి స్థాయిలో అవినీతిని అరికట్టి ముందుకు పోవలసిన బాధ్యత మీ మీద ఉందని తెలియచేసుకుంటూ నాకు ఈ అవ కాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

మ . 2 . 00

MR. DEPUTY CHAIRMAN: The House is adjourned to meet again at 5.00 p.m., today.

(Then the House adjourned at 2.01 p.m., to meet again at 5.00 p.m., on Wednesday the 10th June, 2009)

సా. 5.00

**(సభ తిరిగి సాయంత్రం 5.00 గంటలకు సమావేశమైనది )**

**( మిస్టర్ చైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు )**

గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ముఖ్యమంత్రి ప్రత్యుత్తరం

డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి (ముఖ్యమంత్రి) : అధ్యక్షా, రాష్ట్ర గవర్నర్ శ్రీ నారాయణ్ దత్ తివారీ గారు ఆంధ్రప్రదేశ్ శాసన సభ, శాసన మండలిలను ఉద్దేశించి 8వ తారీఖు నాడు చేసిన ప్రసంగంలో గడచిన 5 సంవత్సరాల రాష్ట్ర ప్రగతిని నివేదిస్తూ, రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రాన్ని ఏ విధంగా ప్రగతి బాటలో తీసుకెళ్లగలుగుతామనేది నిర్దేశించే ప్రయత్నం చేసారు. గడచిన 4 మాసాలలో గవర్నరు గారు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడం ఇది రెండవ సారి. మొన్న ఫిబ్రవరి మాసంలో జరిగిన మొదటి సమావేశంలో ఆయన మాట్లాడడం జరిగింది. మళ్లీ ఎన్నికలు అయిన సందర్భంగా కొత్త సభ ఏర్పాటయింది కాబట్టి రెండవసారి మాట్లాడ వలసిన అవసరం వచ్చింది.

గడచిన 5 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ పరిపాలన పట్ల ఈ రాష్ట్ర ప్రజలు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ తీర్పునిచ్చారు. జనరల్‌గా ఎప్పుడైనా ఒక ఇన్‌కంబెంట్ గవర్నమెంటు పైన, అధికారంలో వున్న ఏ ప్రభుత్వం పైన

అయినా ఆ ప్రాంతానికి సంబంధించిన, ఆ రాష్ట్రానికి సంబంధించిన, ఆ దేశానికి సంబంధించిన ప్రజలు గడచిన 5 సంవత్సరాల కాలంలో బాగా చేసారని అనుకుంటే, మళ్లీ కొనసాగమని కోరతారు. లేనట్లయితే ప్రజలకు బాగా చేయలేదని అనిపిస్తే, మార్చుకోడానికి కూడా ఒక అవకాశం వచ్చేది ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల ద్వారానే.

గడచిన ఎన్నికలలో ఈ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని, కేంద్రంలో వున్న యుపిఎ ప్రభుత్వాన్ని కూడా ఈ రాష్ట్ర ప్రజలు మళ్లీ కొనసాగమని చెప్పారు. గడచిన 5 సంవత్సరాలుగా మీ పరిపాలన బాగానే వుంది, మరింత మెరుగైన పరిపాలనను ఇవ్వండని కోరారు. సోనియా గాంధీ గారి ఆధ్వర్యంలో మన్‌మోహన్ సింగ్ గారి ప్రభుత్వాన్ని కూడా కొనసాగించమని తీర్పును ఇచ్చారు. మైనారిటీ గవర్నమెంటయినా కూడా దేశ ప్రగతి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, అధికారంలో వుండడమే పరమావధి కాదు, ప్రజలకు సేవ చేయడం మంచిది, మరీ ముఖ్యంగా అభివృద్ధి పథంలో పోవడానికి కేంద్రంలో మరింత పటిష్టవంతమైన ప్రభుత్వం వుండవలసిన అవసరం వుందనే విషయంలో అన్నీ కూలంకషంగా పరిశీలించి డెసిసివ్ తీర్పును ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, ఈ రాష్ట్రంలో మేము అనుకున్న మేరకు ఫలితాలను సాధించలేకపోయాము. ముఖ్యంగా దానికి ప్రధానమైన కారణం, పోయిన ఎన్నికలలో మాతో వున్న పక్షాలు ఈ రోజున మాతో లేకపోవడం. కమ్యూనిస్టులు, టిఆర్ఎస్ పార్టీలు రెండూ మాతో లేవు. తెలుగుదేశం పార్టీతో కలసి పోటీ చేయడం వల్ల మేము అనుకున్నంత మేరకు సీట్లను, ఓట్లను సాధించలేకపోయాము. ఈ ఎన్నికలలో 2004వ సంవత్సరం కంటే టిఆర్ఎస్, కమ్యూనిస్టులు కొన్ని సీట్లను కోల్పోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీకి కొన్ని సీట్లు పెరగడం జరిగింది. కాంగ్రెస్ పార్టీకి కూడా కొన్ని సీట్లు తగ్గడం జరిగింది. ప్రజారాజ్యం పార్టీ కొత్తగా రావడం జరిగింది. ప్రజా రాజ్యం పార్టీకి 17 శాతం ఓట్లతో 18 సీట్లు రావడం జరిగింది. ఆ వచ్చిన 17 శాతం ఓట్లలో సిఎన్ఎన్, ఐబి చేసిన సర్వే ప్రకారం, వారి ఒపీనియన్ పోల్ ప్రకారం దాదాపు 11 శాతం ఓట్లు కాంగ్రెస్ పార్టీ నుంచి, 6 శాతం టిడిపి నుంచి వారు తెచ్చుకోగలిగారని తెలుస్తోంది.

ఏది ఏమైనప్పటికీ కూడా గడచిన 5 సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఒక క్రెడిబిలిటీ, కంపాజన్ అండ్ కరేజ్ – ఈ మూడు ప్రధాన సూత్రాలపైన పరిపాలనను అందించడం జరిగింది. చెప్పిన మాట పట్ల విశ్వశనీయత వుంచుకుంటూ, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని మరచిపోకుండా, ప్రజలకు కావలసిన వాటిని గమనించి, ఎన్నికలకంటె ముందు, ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేయకపోయినా కూడా ఎప్పటికప్పుడు కార్యక్రమాలను అమలు చేయడం జరిగింది. A Government is a dynamic process. ప్రజలకు వున్న సమస్యలు కూడా అంతే డైనమిక్‌గా వుంటాయి. Challenges are ever evolving. ప్రతి రంగానికి ఒక సమస్య వుంటుంది, ప్రతి కుటుంబానికీ ఒక సమస్య వుంటుంది, ప్రతి ప్రాంతానికీ ఒక సమస్య వుంటుంది. ప్రతి సీజన్‌కు కూడా ఒక సమస్య వుంటుంది.

So, dynamic process challenges are evolving. అటువంటి ఛాలెంజ్ ఎప్పుడు, ఎక్కడ వచ్చినా కూడా దానికి జవాబు చెబుతూ, ఒక కంపాషనేట్ గవర్నమెంట్‌గా మా దృష్టికి వచ్చిన ఎటువంటి సమస్యనైనా, పేద వారికి సంబంధించిన ఎటువంటి సమస్యనైనా సరే మేము స్పందించి పరిష్కరించే ప్రయత్నం చేసాము. చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించాలని కొన్ని వేల మంది పిల్లలను రోడ్ల మీదకు తీసుకువస్తే, 12 సంవత్సరాల పిల్లలందరికీ గుండె ఆపరేషన్లు చేయించాలి, వారు చేయించుకోలేకపోతున్నారు వారు

బ్రతకాలంటే గుండె ఆపరేషన్లు చేయించాలని కొన్ని సంస్థలు ఊరేగింపు చేయిస్తే, వెంటనే అందుకు స్పందించాము, వారికి కావలసిన విధంగా గుండె ఆపరేషన్లు చేయించే కార్యక్రమం చేసాము.

సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి అంతో, ఇంతో డబ్బు కూడా ఇచ్చాము. మేము ఇచ్చిన 30 శాతం, 40 శాతం డబ్బులపై మిగిలిన అమౌంట్ వేసుకుని కార్పొరేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు కాబట్టి రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం పెట్టి వారికి వైద్యం అందించాము. అట్లాగే పిల్లలు చదువుకోడానికి, ముఖ్యంగా, బిసి విద్యార్థులకు చదువుకోడానికి సాట్యురేషన్ అమౌంట్‌లో ఎంత వరకూ కావాలో అంత వరకూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లు ఇచ్చే ఏర్పాటు చేసాము. అంతకు ముందు ఆ సదుపాయం ఎస్‌సిలకు మాత్రమే వుండేది, ఈ మధ్య కాలంలో బిసిలకు, మైనారిటీలకు కూడా కొనసాగించడం జరిగింది. ఈ సంవత్సరం నుంచి వెనుకబడిన అగ్రవర్ణాల పిల్లలకు కూడా ఇస్తున్నాము.

సా. 5.10

అంతో ఇంతో ధరలు పెరిగి పేదవర్గాలవారు ఇబ్బంది పడుతున్నారంటే, రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని పెట్టడంవల్ల వారు ప్రతి నెలా కడుతున్న రు.5.25 పైసలు ఖర్చుకు రు.2లకు ఇస్తే నెలకు రు.60 వరకూ తగ్గినా ఫరవాలేదని అనుకున్నాము. తప్పనిసరి పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం రు.50 గ్యాస్ మీద పెంచితే వెంటనే స్పందించి పేద మహిళల మీద పడకూడదని అది భరించే ఏర్పాటు చేసాము. ఆ విధంగా మ్యానిఫెస్టోలో ఎన్నికల కన్నా ముందు చేసిన వాగ్దానాలన్నీ కూడా తీర్చగలిగాము. ప్రజలకు అవసరమైనవన్నీ ఏ ఒక్క రోజూ కూడా వెనుకాడలేదు. ప్రజల అవసరాలు తీర్చడానికి ఎంత కష్టమైనా నష్టమైనా ఆ కార్యక్రమం చేసాము. మొన్న జరిగిన ఎన్నిక నిజానికి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మా ప్రభుత్వానికి, మహాకూటమికి సంబంధించిన వంచనకు మధ్యన జరిగినది. మేము ఏ విధమైన కొత్త వాగ్దానాలు చేయకుండా అంతకు ముందు ఐదు సంవత్సరాలుగా చేసిన పరిపాలనను చూడమన్నాము. మేము బాగా పరిపాలించామని అను కుంటే ఓట్లు వేయండని చెప్పాము. కొత్తగా పెద్ద వాగ్దానాలు చేయలేదు. 20 కేజీల బియ్యం 30 కేజీలు చేస్తా మన్నాము. 7 గంటలు రైతులకు ఇచ్చే ఉచిత కరెంటు 9 గంటలు చేస్తామన్నాము. అంతకుమించి కొత్తగా ఏమీ చేయలేదు. ఉన్న కార్యక్రమాలన్నీ కొనసాగించడానికి గడచిన ఐదు సంవత్సరాలు చూసినదానికన్నా నాణ్యమయిన విధంగా నైపుణ్యంగా చేయడానికి అవకాశం ఇవ్వమని కోరాము. కానీ మహాకూటమి రకరకాలైన వాగ్దానాలు చేసి క్యాష్ ట్రాన్స్‌ఫర్, ఉచిత టి.వి.ల పంపిణీ, రెండు రూపాయలకు కిలో బియ్యం ఉచితంగా ఇవ్వడం, నిరుద్యోగులకు రు.1,000 భృతి మొదలైనవి చాలా చాలా ఉచితమైన వాగ్దానాలు చేసారు. ఇవి చేయగ లుగుతామా లేదా అనే విషయంలో చూసుకోకుండా ఆర్థికమైన వెసులుబాటు ఉంటుందో లేదో ఏ మాత్రమూ చూసుకోకుండా చేశారు. ఎన్ని వాగ్దానాలు చేసినా ప్రజలు వారిని నమ్మలేదు. కాంగ్రెస్ పార్టీలో 5 సంవత్సరాల పాలనలో విశ్వసనీయత బాగా ఉందని, అభివృద్ధి సంక్షేమం చేకూర్చారనీ, మంచి పాలన కొనసాగిందని, ప్రజ లంతా ఈ పరిపాలనే కొనసాగించడానికిగాను మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. కానీ తెలుగుదేశం పార్టీ మహాకూటమి చేసిన వాగ్దానాలు నమ్మకపోవడానికి కారణం ఏమంటే, వారు 1994-95లో చేసిన ఏ ఒక్క వాగ్దా నాన్ని నిలబెట్టుకోలేకపోయారు. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం, రు.50 కే హార్స్ పవర్ ఇచ్చే కార్య క్రమం, సంపూర్ణ మద్యపాన నిషేధం, పుట్టిన ఆడపిల్లకు రు.5,000 ఇవ్వడం, మహిళలకు బ్యాంక్ పెడతామన్న విషయం, సంవత్సరానికి 7 లక్షల ఇళ్లు కట్టిస్తామన్న విషయం, 25 లక్షల ఎకరాలకు సేద్యపు నీరు కల్పిస్తామన్న విషయం, ఈ విధంగా ఎందులోనూ, ఏ ఒక్క విషయంలోనూ వారు వాగ్దానాలు నిలబెట్టుకోలేకపోయారు, ఆఖ రుకి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ కావాలంటే, మీ గ్రామంలో ఉన్న పెన్షన్ వస్తున్నవారు ఎవ

రైనా, ఏ ఒక్కరయినా చనిపోతే ఆ ఖాళీలో ఇస్తామన్నారు. లేదూ, రు.50, రు.70 మూడు నెలలకో, ఆరు నెలలకో ఇవ్వడానికి కష్టపడ్డారు. ఒక్కో ఇంటికి రు.1,000 ఇస్తామంటే ఏ విధంగా ఇవ్వగలుగుతాము? ఉచితంగా ఇస్తామన్నా ఏ విధంగా నమ్ముతాము? ప్రజలు ఏ ఒక్కటీ నమ్మలేదు. కానీ మేము చేసిన ప్రతీ వాగ్దానం, 2004లో చేసిన ప్రతీ వాగ్దానం నిలబెట్టుకున్నాము. ఉచిత కరెంటు, వ్యవసాయ రుణాలు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అన్నాము, పూర్తిగా మాఫీ చేశాము. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీకి రుణ సహాయాన్ని అందించడమే కాకుండా రైతులకు, ఇతర వర్గాలకు అన్ని విధాలుగా సహాయసహకారాలను అందించాము. ఆసుపత్రులలో యూజర్ ఛార్జీలను తీసివేస్తామన్నాము. తీసివేసాము. వృద్ధులకు, వితంతువులకు, పెన్షన్ రు.200 చేస్తామన్నాము. చేసాము. అది ఎంత మంది ఉంటే అంత మందికీ చేసాము. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ ఏర్పాటు చేసాము. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తామని వాగ్దానం చేయకపోయినా అదీ చేసాము. ఇవన్నీ చేసాము. చెప్పిన ప్రతీ వాగ్దానాన్ని నిలబెట్టుకోగలిగాము. వారు నిలబెట్టుకోలేదు. ప్రజలు మా మీద విశ్వాసం ఉంచారు. ముఖ్యంగా, క్రాప్‌లోన్ వీవర్ చాలా బాగా అయింది. కేంద్ర ప్రభుత్వం, సోనియాగాంధీగారి నాయకత్వంలో, మన్‌మోహన్‌సింగ్‌గారి నాయకత్వంలో రైతులకు సంబంధించి వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తే, మన రాష్ట్రంలో చాలా మేలు జరిగింది. 43 లక్షల మందికి రు.11,150 కోట్లు లాభం జరిగింది. లాభం వర్తించని రైతులకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రు.5 లక్షలు ఇస్తామన్నారు. కనీస మద్ధతు ధర ధాన్యానికి పెంచబట్టే ఉత్పత్తులు బాగా పెరిగాయి. ఒక వరి ధాన్యానికి చూసినట్లయితే ఐదు సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో రు.310 పెరిగితే అది రు.930 అయింది. అంతకు ముందు 5 సంవత్సరాలు చూస్తే కేవలం రు.90 ఉన్నది.

(గౌరవ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరి నుండి తీవ్ర అభ్యంతరాలు)

యాదగిరిగారు అటు నుండి మాట్లాడుతున్నారు. రు.1,000 తప్పకుండా అవుతుందని తమ ద్వారా వారికి తెలుపుతున్నాను. వారిని కొంచెం ఓపిక పట్టమనండి. ఇది చేయవలసింది కేంద్ర ప్రభుత్వం. మేము తప్పకుండా ప్రయత్నం చేస్తాము. అలాగే సేద్యపు నీటి రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పనులు చాలా బాగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. కళ్ల ముందే అన్ని ప్రాజెక్టులు కడితే చాలా సంతోషపడ్డారు. మొత్తం మీద అన్ని రకాలైన మేళ్లు రాష్ట్ర ప్రజలకు చేయగలిగాము, ఒకవైపు ఇన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతోబాటు స్టాటిస్టిక్‌గా పోయాము. రాష్ట్రానికి సంబంధించి ఆదాయ వనరులు పెరగాలి. ఆ విధంగా పెరిగినప్పుడే ఆదాయాలు పెంచగలిగినప్పుడే ఆ పెరిగిన ఆదాయాన్ని పేదవారికి ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ఎన్ని రకాలుగా మాట్లాడినా పెరిగిన ఆదాయం పేదవారికి చెందినప్పుడే సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పడానికి అవకాశం ఉంది. మేము చేసిన ప్రతీ కార్యక్రమంలో కూడా అభివృద్ధి కనిపించింది. ఎక్కడ ఎప్పుడు ఏ విధమైన అవసరం వచ్చినా పేదవారికి మేలు జరుగుతుందని చేసాము. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఆదాయ వనరులు పెరగడానికి రాష్ట్రానికి ఆదాయాలు అందించడానికి మేము చేసిన ప్రయత్నాలన్నీ ఫలితాలనిచ్చాయి. ముఖ్యంగా గడచిన 5 సంవత్సరాలుగా వీలయినంత పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ పెంచడం జరిగింది. ఎప్పుడయితే పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ పెరుగుతుందో అప్పుడు ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కూడా వస్తుంది. ఉదాహరణకి సేద్యపు నీటి రంగంలో, హౌసింగ్ రంగంలో చాలా ఎక్కువగా సిమెంట్, స్టీల్ వాడుతున్నాము కాబట్టి సిమెంట్, స్టీల్‌కి సంబంధించి కొత్త ఫ్యాక్టరీలు రావడానికి అవకాశాలు వచ్చాయి. ఈ ఐదు సంవత్సరాలకన్నా ముందు భారతదేశంలో మహారాష్ట్ర సిమెంట్, స్టీల్ కన్జమ్షన్‌లో మొదటిస్థానంలో ఉంది. గడచిన నాలుగు సంవత్సరాల్లో మనం మొదటి స్థానానికి వచ్చాము. ఉత్తరప్రదేశ్‌లో సిమెంట్ వాడకం లేదు. మహారాష్ట్ర మనకన్నా ధనవంతమైన పెద్ద రాష్ట్రం, దాదాపు 10, 20 శాతం మనకన్నా పెద్ద రాష్ట్రం. అక్కడ కూడా సిమెంట్, స్టీల్ వాడకం లేదు.

సా. 5.20

అధ్యక్షా, ఎప్పుడైతే సిమెంట్, స్టీల్ వాడకం పెరుగుతుందో దానికి సంబంధించిన టాక్సేషన్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా ఆదాయం వస్తోంది. మేము చేసిన ప్రతి పని కూడా, రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చామంటే ఆలోచన లేకుండా చేయలేదు. అదే విధంగా, రైతుకు సంబంధించి రుణాలు మాఫీ చేసామంటే ఆలోచన లేకుండా చేయలేదు. రైతులకిచ్చిన అప్పులపై వడ్డీలు తగ్గించామంటే అది కూడా ఆలోచన లేకుండా చేయలేదు. ఎం.ఎస్.పి పెంచామంటే ఇవన్నీ ఒక ఆలోచనతో చేశాం. మొత్తం మీద రైతుకు ఆదాయం పెరిగితే, తన చేతిలో డబ్బు పెరిగితే, దానిని మరల పొలం మీద పెడుతాడు. ఎక్కువగా పంటను పండించడానికి ప్రయత్నం చేస్తాడు. ఆ విధంగా పంట పండించ కలిగాడు కాబట్టే, ఈ ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి వరకే లెక్క వేసుకుంటే దాదాపు సగటున 165 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. అంతకు ముందు ఐదు సంవత్సరాల కాలంలో సగటున 130 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి మాత్రమే జరిగింది. అంటే, ఒక్క ఆహార ధాన్యాల ఉత్పత్తే సగటున గడచిన ఐదు సంవత్సరాల కంటే ఈ ఐదు సంవత్సరాల కాలంలో సంవత్సరానికి 35 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పతి పెరిగింది.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

అధ్యక్షా, రాష్ట్రానికి సంబంధించి ఆదాయం పెరిగింది. ఎప్పుడైతే ఉత్పత్తి పెరిగిందో ఆ ఉత్పత్తి అంతా మార్కెట్‌లోకి పోతుంది. తద్వారా టాక్సేషన్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరుగుతుంది. Last year domestic product వంద రూపాయలుంటే దానిలో 10, 15 రూపాయలు ఏదో రూపంలో టాక్సేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చింది. ఆ విధంగా ఫోకస్‌గా కలసి పని చేసి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుకోగలిగాం కాబట్టే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరిగింది. మేము తీసుకున్న మరో మంచి ఇనిషియేటివ్ ఏమిటంటే మహిళల సాధికారత. మహిళల సాధికారత కేవలం మాటల్లో కాదు చేతల్లో వస్తుంది. ఆ చేతల్లో రావడం కోసం ప్రత్యేకంగా పావలా వడ్డీ అనే ఇన్సెంటివ్‌ను ఇవ్వడం జరిగింది. మేము చేసిన ప్రతి పనిలో కూడా ఒక discipline inculcate చేయడానికి ఇచ్చిన ఇన్సెంటివ్ కాని, ప్రొడక్షన్ పెరగడానికి ఇచ్చిన ఇన్సెంటివ్ కాని, ఫుడ్ సెక్యూరిటీకి సంబంధించి రెండు రూపాయలకు కిలో బియ్యానికి సంబంధించి ఇచ్చే ఇన్సెంటివ్‌లో కాని ప్రతి దానిలో ఒక ఫోకస్ వుంది అధ్యక్షా. డ్వాక్రా మహిళలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్న 9 సంవత్సరాల కాలంలో వాళ్లకు బ్యాంకుల నుండి ఇప్పించిన అప్పులు రూ.1709 కోట్లు వుంటే ఈ ఐదు సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.20 వేల కోట్ల రూపాయలు.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఆ 20 వేల కోట్ల రూపాయలు డ్వాక్రా మహిళల చేతుల్లో పడేటప్పటికి ఆ సొమ్ముతో వాళ్లు గొర్రెలు కొన్నారు, బర్రెలు కొన్నారు, కూరగాయల వ్యాపారం మొదలైన చిన్న చిన్న వ్యాపారాలు చేయడం ద్వారా సంపదను పెంచుకునే ప్రయత్నం చేశారు. అధ్యక్షా, కొన్నిచోట్ల డ్వాక్రా మహిళల యొక్క సాధికారతను నిజంగా చూస్తే కాని నమ్మలేం. కరీంనగర్ లాంటి జిల్లాల్లో అయితే డ్వాక్రా మహిళలు ధాన్యం వ్యాపారులయ్యారు. ఈ డ్వాక్రా మహిళలు చాలా జిల్లాలలో మిల్క్ యూనిట్ సెంటర్లను రన్ చేస్తున్నారు. కొన్ని ట్రైబల్ ఏరియాలలో మినీ హైడల్ పవర్ ప్లాంట్లను కూడా నిర్వహించే స్థాయికి ఎదిగారు. నిజంగా సాధికారత బాగా రావడంతో పాటు వారిసంపద కూడా పెరిగింది. వీటన్నింటికి తోడు భగవంతుని ఆశ్వీర్వాదం వల్ల గడచిన ఐదు సంవత్సరాల్లోను

మంచి వర్షాలు పడ్డాయి. అంతకు ముందున్న 9 సంవత్సరాల తెలుగుదేశం పార్టీ పాలనతో పోల్చి చూస్తే, ఈ ఐదు సంవత్సరాల కాలంలో మేము చేసిన మంచి కార్యక్రమాలతోపాటు బాగా మంచి వర్షాలు కూడా పడ్డాయి. అంతకు ముందు 10 సంవత్సరాలకు లెక్క వేసుకున్నా, సగటున gross State domestic product యొక్క పెరుగుదల భారత దేశానికి సంబంధించిన పెరుగుదల కంటె 0.5 శాతం తక్కువ వుంటే, అంటే (భారతదేశం యొక్క సగటు పెరుగుదల అంతకు ముందు) 2004 సంవత్సరాని కంటె ముందు గడచిన 10 సంవత్సరాల కాలంలో భారతదేశంలో సగటు పెరుగుదల 6 శాతంగా వుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 5.5 శాతంగా వుంది. ఈ ఐదు సంవత్సరాల కాలంలో మేము చేసిన మంచి కార్యక్రమాల వల్ల భారతదేశ సగటు పెరుగుదల 6 నుండి 8.5 శాతం అయితే ఆంధ్రప్రదేశ్‌లో సగటు పెరుగుదల అంతుకు ముందు దేశ పెరుగుదల కంటే 0.5 తక్కువగా ఉంటే ఇప్పుడు 0.5 శాతం ఎక్కువగా పెరిగింది. సగటు పెరుగుదల ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 9 శాతం అయింది.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఆ విధంగా పెరిగింది కాబట్టే రాష్ట్రానికి వచ్చే ఆదాయం కూడా పెరిగింది. రాష్ట్రంలో నివసిస్తున్న ప్రతి వారికీ మేలు జరిగింది. రాష్ట్రానికి పెరిగిన ఆదాయాన్ని పేద వారికి చేరేటట్లు చేశాం. కొత్త పన్నులు వేయకుండా, ఆర్టీసీ చార్జీల పెంపు లేకుండా, విద్యుత్ చార్జీల పెంపు లేకుండా ఆదాయాన్ని పెంచుకోగలిగాం. తెలుగుదేశం ప్రభుత్వ పాలన 9 సంవత్సరాల కాలంలో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచితే ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదు. యూపిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వ్యవసాయానికి సంబంధించి 4 శాతం పెరుగుదల వుండాలని టార్గెట్ పెట్టుకుంటే మన రాష్ట్రానికి సంబంధించిన పెరుగుదల 6.7 శాతంగా వుంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

అధ్యక్షా, ఇవన్నీ జరిగాయి కాబట్టే రాష్ట్రానికి ఆర్థిక మేళ్ళు బాగా వచ్చాయి. అంతకు ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రానికి సంబంధించిన ఆదాయాలు, రెవెన్యూ ఖర్చు చాలక వారి 9 సంవత్సరాల కాలంలో రూ. 22 వేల కోట్లు రెవెన్యూ డెఫిసిట్ వస్తే ఈ ఐదు సంవత్సరాల కాలంలో చేసిన అప్పు కంటే క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ క్రింద అదనంగా రూ.16 వేల కోట్లు పెట్టగలిగాం. ఎంత తేడానో గమనించండి అధ్యక్షా.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

కాబట్టి ఇన్ని మేళ్ళు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు 26 ప్రాజెక్టులను రూ.46 వేల కోట్లతో పూర్తిచేయాలనే తలంపుతో పనులు మొదలు పెట్టాం. కాని, స్థానికంగా వచ్చిన ఒత్తిడుల మేరకు ఆ 26 ప్రాజెక్టులల్లా 81 ప్రాజెక్టులయ్యాయి. వ్యయ అంచనా రూ. 46 వేల కోట్ల రూపాయల నుండి రూ.1.73 లక్షల కోట్లకు పెరిగింది. అంతకుముందున్న 9 సంవత్సరాల కాలంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కొరకు కేవలం రూ.10 వేల కోట్లు ఖర్చు పెడితే ఈ ఐదు సంవత్సరాల కాలంలో అదే ఇరిగేషన్ ప్రాజెక్టుల కొరకు రూ. 41 వేల కోట్లు ఖర్చు పెట్టాం.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఆ విధంగా చేయకలిగాం కాబట్టే ఈ రోజు ప్రాజెక్టుల పనులు శరవేగంతో జరుగుతున్నాయి. ఇప్పటికే 81 ప్రాజెక్టులలో 12 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. నీళ్ళు వస్తున్న వాటిల్లో 13 ప్రాజెక్టులు పాక్షికంగా పూర్తయ్యాయి. ఇదే ఒరవడి కొనసాగితే వచ్చే నాలుగైదు సంవత్సరాల కాలంలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అవకాశం వుంటుంది. భగవంతుని దయవలన, మన అదృష్టం వల్ల కేంద్రంలో కూడా మరల యూపీఏ ప్రభుత్వం ఇంతకు ముందు కంటె మరింత బలోపేతంగా అధికారంలోకి వచ్చింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వుంది కాబట్టి ఆ మేరకు ఉపయోగం వుంటుంది. రాష్ట్రంలో కడుతున్న ప్రాజెక్టులలో పోలవరం, ప్రాణహిత-చేవెళ్ళ, కాంతనపల్లి, ఎల్లంపల్లి మొదలైన ఐదారు ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా ఇంక్లూడ్ చేసే ప్రయత్నం చేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అన్ని ఫార్మాలిటీస్ మరొ రెండు నెలల్లో పూర్తవుతాయనుకుంటున్నాం. మిగిలిన వాటికి కూడా వచ్చే సంవత్సరం లోపు ఫార్మాలిటీస్ పూర్తి చేసుకోగలిగిన వాటిని జాతీయ ప్రాజెక్టులుగా ఇంక్లూడ్ చేయించుకోగలిగితే 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి తీసుకురావడానికి అవకాశం వుంటుంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

దాదాపు 50, 60 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు సంబంధించి 90 శాతం నిధులను కేంద్రప్రభుత్వం నుండి తీసుకురాగలిగితే మనకు ఏ ఇబ్బంది లేకుండా అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసుకోగల్గుతాం. గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో రూ.41వేల కోట్లు రాష్ట్ర బడ్జెట్ నుండి ఖర్చు పెట్టుకోగలిగినప్పుడు వచ్చే ఐదు సంవత్సరాల కాలంలో మన ఇంటర్నల్ సోర్సు నుండి దాదాపు 80, 90 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర బడ్జెట్ నుండి ఏర్పాటుచేసుకోవచ్చు. అది అంత పెద్ద కష్టమైన పని కాదు. దాదాపు 90 వేల కోట్ల రూపాయలు మనం ఏర్పాటు చేసుకుంటే మరో రూ. 50, 60 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి తెచ్చుకోగలిగితే ఈ ప్రాజెక్టులన్నీ వచ్చే నాలుగైదు సంవత్సరాలలో పూర్తి చేసుకోవచ్చు అధ్యక్షా.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

వచ్చే ఐదు సంవత్సరాలలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు మొదలు పెట్టిన ప్రభుత్వం కాదు, ప్రాజెక్టులు పూర్తి చేసిన ప్రభుత్వమని అనిపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

సా. 5.30

అధ్యక్షా, మేమేమీ కొత్తగా వాగ్దానాలు చెయ్యలేదు. గతంలో చేసినవాటినే మరింత సమర్థవంతంగా నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నాము. ఇక్కడ చాలామంది వ్యవసాయ కుటుంబంనుండి వచ్చినవాళ్లము ఉన్నాము. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీ రావుగారు ఇక్కడ ఉన్నారు. మన వ్యవసాయ రంగంలో ఉన్న మేజర్ బాటిల్ నెక్ ఏమిటంటే ల్యాండ్ హోల్డింగ్స్. ఒక్కొక్క రైతుకు సగటున భూకమతం కేవలం మూడు ఎకరాలు. ఇంత చిన్న భూకమతాలున్న రైతులు ఏదైనా మెకనైజేషన్ చేసుకోవాలనుకుంటే కష్టం. ప్రెసిషన్ ఫార్మింగ్ చేయాలంటే కష్టం. తన ఉత్పత్తులను మార్కెట్‌కి తరలించాలన్నా కష్టమే. కాబట్టి మొత్తంమీద ప్రొడక్టివిటి అనేది తగ్గిపోతోంది.

ప్రొడక్టివిటి పెంచుకోవడానికి ఇవన్నీ ఫార్మింగ్‌లో వాడడం తప్ప వేరే మార్గం లేదు. వ్యవసాయమంటే కేవలం వరి, వేరుశనగ పండించడం ఒక్కటే కాదు. వ్యవసాయంలో రకరకాల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలను ఉపయోగించడం కూడా. గ్రీన్ హౌస్ వ్యవసాయం చేసుకోగలిగితే ప్రొడక్టివిటి పదిరెట్లు పెరుగుతుంది. ఎక్కువగా హార్టీకల్చర్ పంటలకు గ్రీన్ హౌస్ కల్టివేషన్ చేసుకోవడానికి అవకాశముంటుంది. వ్యవసాయంతోపాటు ఫిషరీస్, డెయిరీ కూడా కలుపుకుంటే ఆదాయం బాగా పెరిగే అవకాశముంటుంది. కానీ, ఇవన్నీ చేసుకోవడానికి చిన్న కమతాలు అడ్డు వస్తున్నాయి. మనదేశంలో, గతంలో కోపరేటివ్ సొసైటీ ద్వారా చేసిన ప్రయత్నాలు కొన్ని సక్సెస్ కాలేదు. నా దృష్టిలో ఆ రోజు సక్సెస్ కాలేకపోవడానికి కారణం కావల్సినంత ఆర్థిక వెసులుబాటు వారికి ఇవ్వలేకపోవడమే. Discipline inculcate చెయ్యలేకపోవడమే. నా ఉద్దేశమేమిటంటే నేను మిగతా అన్ని పార్టీల నాయకులతో కూడా కలిసి మాట్లాడతాను. రాష్ట్రం మొత్తం మీద అన్ని జిల్లాలు కవరయ్యేట్లు 30,40 గ్రామాలను తీసుకొని గ్రామస్తులంతా కలిసి ఇష్టపడినట్లైతే వారి యొక్క మొత్తం ఆస్తిని ఆ గ్రామానికి సంబంధించిన కోపరేటివ్ సొసైటీకి ఇచ్చివేయడము జరిగితే అది వారి పెట్టుబడి అవుతుంది. దానికి జతగా ప్రభుత్వం కూడా అవసరమైనంత అయిదు కోట్లు గానీ, పది కోట్లుగానీ పెట్టుబడి పెట్టి, బ్యాంకులనుండి తగినంత రుణం తీసుకొని మొత్తానికి వ్యవసాయాన్ని corporatize చేసి..... ఉదాహరణకు చెరకు పంట పండిస్తే కటింగ్‌కు మనిషి దొరకడం లేదు. చెరకు పంట కోతకు ఎంతో కష్టపడవలసి వస్తోంది. ఒక్క మన భారతదేశంలో తప్ప, ప్రపంచంలోని అన్ని దేశాలలో చెరకు పంట కటింగ్‌కు యంత్రాలను ఉపయోగిస్తారు. మన దేశంలో వాడకపోవడానికి ముఖ్య కారణం స్మాల్ ల్యాండ్ హోల్డింగ్స్. గట్లను దాటలేకపోవడము, extensive areas ను ఆనుకొని ఉన్న ప్రాంతాలలో యంత్రాలతో కటింగ్ చేయలేకపోవడము, ఇటువంటి పరిస్థితులలో మెకనైజేషన్ చాలా పెద్ద సమస్యగా ఉంటుంది. వాటన్నింటికీ జవాబు వస్తుంది. ఎప్పుడంటే if only all the small farms in that particular village can be clubbed together. అధ్యక్షా, ఇందులో ప్రధాన సమస్య ఏమిటంటే గ్రామస్తులకు చెందిన భూమిని ఆ గ్రామానికి చెందిన, సొసైటీకి గానీ, కంపెనీకి గానీ అప్పజెపితే రైతుకు తన భూమి ఎక్కడికో పోతోంది అన్న భావన ఉంటుంది. కానీ, అది ఎక్కడకు పోవడం లేదు, అది అక్కడే ఉంటుందన్న ఆలోచన రైతులకు రావాలి, ఎప్పుడైనా అవసరమైతే తన భూమిని అమ్ముకోవాలంటే దానికి ఒక exit route కూడా ఉండాలి. కాబట్టి ముందుగా ఒక ట్రయల్ బేసిస్‌లో ఇలాంటి కార్యక్రమాలు చేసి ప్రొడక్టివిటీని పెంచే ప్రయత్నం చేస్తాము. త్వరలోనే అన్ని పార్టీల నాయకులతో కలిసి మంచి ఆలోచన చేసే ప్రయత్నంలో మా ప్రభుత్వమున్నది. ఇదే విషయాన్ని గవర్నర్ అడ్రసులో కూడా కొద్దిగా చేర్చడం జరిగింది.

ప్రాణహిత-చేవెళ్ల, దుమ్ముగూడెం, దేవాదుల, ఎల్లంపల్లి వంటి పెద్ద పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకోసం నీటిని లిఫ్ట్ చెయ్యడానికి కొత్తగా పదివేల మెగావాట్ల విద్యుత్తు కావలసి వస్తుంది కదా దానిని ఎక్కడ నుండి ఏర్పాటు చేసుకున్నారని కొంతమంది గౌరవ సభ్యులు అడగడం జరిగింది. అందుకు ప్రభుత్వం తగిన ఏర్పాటు చేసుకున్నది. దాదాపు పదివేల మెగావాట్ల అదనపు విద్యుదుత్పత్తి చేసే కార్యక్రమాన్ని మొదలు పెట్టాం. By the time these projects are completed, we will be able to take care of that also.

(గౌరవ సభ్యులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.)

World wide, there is economic recession. I am sure that Andhra Pradesh will come out fast. India will also come out fast. దీని మీద ప్రధానమంత్రిగారు మాట్లాడుతూ దాదాపు 8 నుండి 9 శాతం వరకు గ్రోత్‌ను సాధించడానికి ప్రయత్నిస్తామని చెబుతున్నారు. అంతకంటే ఆంధ్రప్రదేశ్ ఇంకో 0.5 శాతమైనా ఎక్కువ గ్రోత్‌ను సాధించినట్లైతే మనకు ఎంతో మేలు జరుగుతుంది. మనకున్న

ఆర్థికమైన పాయింట్స్‌ను బట్టి Financial Management of Budget అనే చట్టం ఒకటి ఉంది. దానికి కొంచెం వెసులుబాటు ఇవ్వమని కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నాము. మనకు రీపేమెంట్ కెపాసిటీ ఎక్కువగానే ఉంది కాబట్టి ఇంకొంచెం ఎక్కువ అప్పు తెచ్చుకునేందుకు వీలవుతుంది. ప్రతి సంవత్సరం మన రాష్ట్రానికి సంబంధించిన సొంత వనరులు సంవత్సరానికి సుమారు రు. 64 వేల కోట్ల రూపాయలు ఉండేది. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికైతే మనకున్న దాంట్లో సగం అంటే రు.36 కోట్లు ఉన్నాయి. కానీ ఆ రాష్ట్ర జిడిపి, మన రాష్ట్ర జిడిపి ఒకే విధంగా ఉన్నది. వాళ్లు పదివేల కోట్లు అప్పు తెచ్చుకోవచ్చు, మనం కూడా పదివేల కోట్లు అప్పుతెచ్చుకోవచ్చు. కానీ మనకు repayment capacity ఎక్కువ ఉన్నది కాబట్టి మనకు ఇంకొంచెం ఎక్కువ బారో చేసుకోవడానికి అవకాశం ఇస్తే, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం మనం ఎంత ఎక్కువ ఖర్చు పెట్టగలిగితే అంత ఎక్కువ గ్రోత్ రేటును సాధించవచ్చు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో తీవ్ర వాదులను నియంత్రణలో ఉంచగలిగాము. 47 వేలమంది పోలీసులను కొత్తగా రిక్రూట్ చేసుకుని ప్రత్యేక బలగంతో పోలీసు వ్యవస్థను మరింత పకడ్బందీగా ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేస్తున్నాము. గవర్నర్ అడ్రస్‌లో divisive forces అనేది ఉంది, అది న్యాయమా, భావ్యమా అని కొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. అది తెలంగాణాను ఉద్దేశించి చెప్పినది కానేకాదు. Divisive forces అనేది తీవ్రవాదులను, ఉగ్రవాదులను అదుపులో పెట్టాలని ప్రధానమంత్రిగారు కూడా పార్లమెంటులో మాట్లాడేటప్పుడు అన్నారు. అంతేకానీ demand for Telangana cannot be clubbed into that. This is totally a different issue.

అధ్యక్షా, నేను నంద్యాలలో మాట్లాడిన విషయంపై కొంతమంది సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ మాట్లాడినప్పుడు నేను ఏమన్నానంటే - మహాకూటమి గనక గెలిచి, వారి ఆధ్వర్యంలో తెలంగాణా వస్తే - ఇప్పటికీ చంద్రశేఖర్ రావు గారు కాలేజీలను మూసివేయిస్తాము, వారిని బయటకు పంపిస్తాము అని అంటున్నారు - అంటే ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాళ్లు వీసా తీసుకొని ఉండాలా? వాళ్లు అధికారంలోకి వస్తే ఇబ్బంది అవుతుంది. పోతిరెడ్డిపాడు, పోచంపాడు, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాలు ఆగిపోతాయి, ఈ ప్రాంతమంతా ఎడారి అయిపోతుంది, తెలుగుగంగలో నీళ్లే ఉండవు అనే పద్ధతిలో మాట్లాడాను. కరెక్టే. కానీ నేను మాట్లాడిన దాంట్లో అర్థమేమంటే టీఆర్ఎస్ మద్దతుతో మహాకూటమి అధికారంలోకి వస్తే అప్పుడేవిధంగా ఉంటుంది, టీఆర్ఎస్ మాట్లాడుతున్నటువంటి అడ్డగోలు మాటలను ఆపకపోతే మనం ప్రమాదంలో పడతామన్నాను కానీ వేరే రకంగా కాదు.

సా. 5.40

అసెంబ్లీలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. రోశయ్యగారి కమిటీలో మీరందరూ సహకరిస్తే మిమ్మల్నందరినీ సభ్యులుగా తీసుకుంటారు. దీనికి సంబంధించి అల్టిమేట్‌గా in principle, we are for Telangana ఇప్పుడు ఈ పని చేసినప్పుడు క్రొత్త సమస్యలు ఉత్పన్నం కాకూడదు. కాబట్టి క్రొత్త సమస్యలు ఏ విధంగా ఉత్పన్నం అవుతాయి? ఆ సమస్యల పరిష్కారం ఏమిటి? ఆ సమస్యల పరిష్కార మార్గాలు కనుక్కున్న తరువాత then we can go ahead with this procedure అన్నామే తప్ప వేరే ఉద్దేశ్యం కాదు. కాంగ్రెస్ పార్టీ క్రెడిబులిటీ ఇంత బాగా ఉంది కాబట్టే ఆ రోజు, ఈ రోజు కూడా చెప్పిన మాట మీద నిలబడుతోంది. మేము అనుకున్నట్లు సెకండ్ ఎస్.ఆర్.సి. 2004వ సంవత్సరంలో దీనికి సంబంధించిన సమస్య పరిష్కారం కూడా అయ్యేదేమో. సెకండ్ ఎస్.ఆర్.సి. తెలంగాణా అవసరమా, కాదా అన్నది చెప్పేదేమో. కాని దానికి అడ్డుపడ్డది టి.ఆర్.ఎస్సే. ఆ రోజు ఏమన్నారు కన్‌సెన్సెస్ చేసుకోమన్నారు. కన్‌సెన్సెస్ కోసం ప్రయత్నం చేస్తే ఈ రోజు భారతదేశంలో మొత్తం 30 పార్టీలున్నాయి. 15 పార్టీలు అవునన్నారు, 15 పార్టీలు

కాదన్నారు. కొన్నీ పార్టీలు కాదన్న తరువాత కన్‌సెన్సెస్ ఎలా అవుతుంది అధ్యక్షా. కన్‌సెన్సెస్ అంటే ఏకాభిప్రాయం. దానికి వీలు కాలేదు కాబట్టి హైకమాండ్ మన విజ్ఞతకు వదిలేసింది. కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ – మీరే అసెంబ్లీలో, కౌన్సిల్‌లో వివిధ పార్టీల వారున్నారు కదా మీరందరూ కలిసి, మీ తలలన్నీ ఒకచోట చేర్చి ఈ సమస్యకు పరిష్కారం చెప్పండి అన్నారు. తెలంగాణా అంటూ ప్రత్యేకంగా ఇస్తే, రాబోతున్న సమస్యలేమిటి? ఎక్కడెక్కడ ఏమేమి సమస్యలు ఉంటాయి? ఆ సమస్యలకు పరిష్కారాలు కూడా ఆలోచన చేసుకుని, we can go ahead. So అటువంటి కార్యక్రమాలు చేయడానికి వెనుకాడబోము. అధ్యక్షా, కేవలం రాజకీయాలకు వాడుకోవడం వలన ప్రయోజనం ఏమి ఉండదు. 2001వ సంవత్సరంలోనే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సెకండ్ ఎస్.ఆర్.సి. ఇవ్వమని చెప్పి, ఆ రోజు అధికారంలో ఉన్న బి.జె.పి. ప్రభుత్వానికి తీర్మానం పంపిస్తే, శ్రీ వాజ్‌పేయ్‌గారు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీకి శ్రీ వాజ్‌పాయ్ పేరుతో ఉత్తరం వచ్చింది. We do not want to reopen the subject of separation of the States. అంతేకాదు ఆయన హైదరాబాదు వచ్చినప్పుడు కూడా ప్రత్యేకంగా అన్నారు. తెలంగాణా డిమాండేమో this is the demand along with capital. కాపిటల్‌తోపాటు ప్రత్యేకంగా తెలంగాణా ప్రాంతం అంటే, ఇటువంటిది ఎక్కడా జరగలేదు. ఎక్కడైనా ఒక రాష్ట్రంలో ఒక పోర్షన్ తక్కువైపోయిందంటే, ఒక ప్రక్క సెపరేట్ అయింది కానీ, కాపిటల్‌తోపాటు పోతామంటే చాలా చాలా సమస్యలు వస్తాయి అంటే ఆ రోజులలో వీలు కాదు అన్నవారు, ఈ రోజున బి.జె.పి. తరఫున ఏమంటారు? మా పార్టీ వస్తే 100 రోజులలోనే తెలంగాణా ఇచ్చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు తెలంగాణా సమస్యని కేవలం రాజకీయ ప్రయోజనాలకు వాడుతున్నారు. 1999వ సంవత్సరంలో రెండవసారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు శ్రీ చంద్రబాబు నాయుడు శ్రీ చంద్రశేఖర్ రావుని మంత్రిగా తీసుకుని ఉండి ఉంటే, అసలు ఈ టి.ఆర్.ఎస్. అనేది పుట్టి ఉండేదా? వారి దగ్గర దీనికి జవాబే లేదు. దీనిని రాజకీయాలకు వాడుకోకుండా ఉంటే ఓ.కే. We are aware that Telangana is backward. గడచిన 5 సంవత్సరములలో ఒక్క ఇరిగేషన్ లెక్కలు చూసుకుంటే మొత్తం రూ. 40,000 కోట్ల రూపాయలలో సగం కేవలం తెలంగాణా ప్రాంతంలోనే పెట్టాము.

(సభలో సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధిని గురించి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నది కేవలం కాంగ్రెస్ పార్టీనే అన్న విషయాన్ని మనవి చేస్తున్నాను. బాబ్లీ కానివ్వండి, మరోచోట కానివ్వండి రాష్ట్రానికి సంబంధించిన ప్రతి హక్కును పరిరక్షించే విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క రోజు వెనకడుగు వెయ్యలేదన్న విషయాన్ని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజు నేను శాసన సభలో తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ చంద్రబాబు నాయుడుని కోరడం జరిగింది. కొంత మంచి వాతావరణంతో మేము ముందుకు పోదామని ప్రయత్నం చేస్తున్నాము. అదేవిధంగా మీరు కూడా సుహృద్భావ వాతావరణంతో ముందుకు వస్తున్నారు. పేదవాళ్ళకు మన దగ్గర ఉన్న డబ్బు ఏదో విధంగా చేద్దామని, అది చాలా అవసరమని అనుకుంటున్నాను. వేరే స్కీమ్స్ అనేది పెట్టాము అంటే 'ఆరోగ్యశ్రీ' ఉన్నది. ఒక కుటుంబానికిగాని, ఒక వ్యక్తికి గాని రెండు లక్షల రూపాయలైనా ఖర్చుపెట్టవలసిన అవసరం ఉంది. రైతులకు సంబంధించి ఫ్రీ పవర్ ఇస్తున్నాము. ఫ్రీ పవర్ ఇస్తుంటే ఒక్కొక్క మోటర్‌కు ఒక్కొక్క పంపు సెట్ సంవత్సరానికి దాదాపు రూ. 15,000 అవుతున్నది. రెండు రూపాయలకు కిలో బియ్యము ఇస్తున్నాము అంటే... ఇంతకు ముందు 20 కేజీలు ఇచ్చాము. మరో రెండు మూడు మాసాలలో 30 కేజీలు

ఇవ్వబోతున్నాము. దానికి అయ్యే సబ్సిడీ ఇక్కడ ఎడ్జెస్ట్ చేసుకుంటామంటే బాగుండదు. కనీసం ప్రతి ఒక్కరికీ తక్కువ ధరకు బియ్యం చేరితే బాగుంటుందనే ఉద్దేశ్యంతో అటువంటిది ఏర్పాటు చేశాము. ఈరోజు ఫీజు సబ్సిడీ కానివ్వండి, ఎరువుల సబ్సిడీ కానివ్వండి, రకరకాల ఫోకస్ సబ్సిడీలు ఉన్నాయి. ఈ విధంగా ఫోకస్ సబ్సిడీలు కాకుండా స్కాలర్ షిప్‌లు, ఫీజు రీ-అంబర్స్‌మెంట్ కానీ, పావలా వడ్డీకి సంబంధించిన సబ్సిడీలు, అభయ హస్తానికి సంబంధించిన ఖర్చు కానీ, ఇవన్నీ ఫోకస్‌గా ఉన్నాయి. మీరు మీ క్యాష్ ట్రాన్స్‌ఫర్స్‌తో వస్తే, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అకౌంటింగ్ కానీ, లేకపోతే ఫైనాన్షియల్ విషయాలు గానీ మొత్తం మీకు తెలుసు. ఆదాయాలు ఎక్కడ నుంచి వస్తున్నాయి? ఖర్చులు ఏ విధంగా పోతున్నాయో అంతా మీకు తెలుసు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆర్థిక వనరులు మంచి, చెడు ఆలోచన చేసి, మీరు ఒక క్రిటికల్ పేపర్ ఒకటి తయారు చెయ్యండి. ఇంతకు ముందు రాష్ట్రంలో ఆర్థిక మంత్రులుగా పనిచేసిన శ్రీ యనమల రామకృష్ణుడుగానీ శ్రీ అశోక్ గజపతి రాజు గానీ, ఇంకా కావలసినంతమంది ఆర్థిక నిపుణులు మీ దగ్గర ఉన్నారు. 'మనీ ట్రాన్స్‌ఫర్' అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? మనీ ట్రాన్స్‌ఫర్ అంటే మీరేమన్నారు? హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ మానిఫెస్టో రిలీజ్‌చేసిన రోజున మనీ ట్రాన్స్‌ఫర్ మరియు రెండు రూపాయలకు కిలో బియ్యము, నిరుద్యోగ భృతి ఇస్తామని వ్రాశారు. మరుసటి రోజు మహబూబ్ నగర్ జిల్లాలోనో, రంగారెడ్డి జిల్లాలోనో ఎక్కడో రెండు రూపాయలకు కిలో బియ్యమునకు ఇచ్చే సబ్సిడీ దీనిలో ఎడ్జస్ట్‌మెంట్ అన్నారు, మేము వెంటనే అదేమిటి ఇక్కడ ముందురోజు మానిఫెస్టోలో ఇది సెపరేట్, అది సెపరేట్ అన్నారు, అక్కడేమో అడ్జస్ట్‌మెంట్ అంటున్నారు అంటే లేదు లేదు పొరపాటైంది, మానిపెస్టోలో ఉన్నదే కరెక్ట్. అన్నీ ఫ్రీ, ఆల్ ఫ్రీ అని చెపుతున్నారు. మేము అదే అడుగుతున్నాము మరో మూడు, నాలుగు రోజుల తరువాత ఎక్కడ నుంచి వస్తుందయ్యా ఈ డబ్బు అని ఎవరో అడిగితే, స్విస్ బ్యాంక్‌లో కాంగ్రెస్ వాళ్ళకు శ్రీమతి సోనియా గాంధీ నుంచి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వరకు కావలసినంత డబ్బు ఉన్నది. ఆ డబ్బు అంతా వాళ్లు దాచిపెట్టుకున్నారు. ఆ డబ్బు తీసుకువచ్చి అందరికీ పంచేస్తామన్నారు.

(సభలో సభ్యుల నవ్వులు)

మేము అడుగుతున్నది అదే. రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక వనరులు, ఖర్చు, ఆదాయం అన్నీ తెలుసు కదా. మీరు ఆలోచన చేసి చెప్పండి. అసలు యాక్చ్యువల్‌గా...

(సభలో ప్రతిపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

MR CHAIRMAN: You cannot intervene. Let him complete, please do not disturb. Please take your seat.

(గౌరవ ప్రతిపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

MR CHAIRMAN: (addressing the Treasure Benches) Please sit down, Chief Minister is there.

(గౌరవ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరి నుంచి అంతరాయం)

MR CHAIRMAN: (addressing the Members of Telugu Desam Party) I won't allow this side talk. What is objectionable there?

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : అధ్యక్షా, అసలు ఈ క్యాష్ ట్రాన్స్‌ఫర్స్ లాంటివి ఎక్కడ మొదలయ్యాయంటే... Latin America country's లో administration లో చాలా చోట్ల నామమాత్రంగా ఉంది. ఎక్కడ ఏ పథకం పెట్టినా, పేదవాడి దగ్గరకి చేరనే చేరడం లేదు. అందుకని అక్కడ ప్రభుత్వాలు ఇంతకు ముందు దీని గురించి ఆలోచన చేశాయి. మనము ఏదైతే పథకం ద్వారా ఇచ్చే డబ్బు పేదవారికి ఇవ్వాలి అంటే అది ఆ పథకానికి సంబంధించినది అయినా, లేక అడ్మినిస్ట్రేషన్‌కి సంబంధించినది అయినా ఖర్చులు మంచి చెడ్డ అన్నీ ఉంటాయి. ఈ న్యూసెన్స్ అంతా లేకుండా ఆ పథకానికి సంబంధించిన డబ్బు నేరుగా వాళ్ళకే ట్రాన్స్‌ఫర్ చేసే ఏర్పాటు చేస్తే బాగుంటుందనే పద్ధతి ఆలోచన చేశారు.

సా. 5.50

కాని దీంట్లో ముఖ్యమైన విషయం ఏమిటంటే, మొత్తానికి మొత్తం మార్కెట్ ఎకానమికి అప్పజెప్పేస్తున్నాం. పేదవాడి బతుకు మొత్తాన్ని మార్కెట్ ఎకానమికి అప్పజెప్పేస్తున్నాం. వాడికి కూడు ఉంటుందో, వైద్యం ఉంటుందో, విద్య ఉంటుందో అనే విషయాలు ఎవరూ పట్టించుకోవడం లేదు. మొత్తం అంతా మార్కెట్ ఎకానమి అంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది మనకు. అటువంటి పరిస్థితులు ఇక్కడ లేవు. అన్నింటి కంటే ప్రధానంగా పేద వాడికి సంబంధించిన ఇబ్బందులు గమనించుకునే ప్రభుత్వాలు మనవి. అటువంటి ఫోకస్ ఫోర్స్ ఉంది కాబట్టే ఈ పథకాలన్నింటి తీసేసి క్యాష్ ట్రాన్స్‌ఫర్ పెడదామంటే ఎవరికీ ఇష్టం లేదు. ఈ పథకాలను కొనసాగిస్తూనే క్యాష్ ట్రాన్స్‌ఫర్ పెట్టగలిగితే, దానికి కావలసిన డబ్బును ఎట్లా తీసుకుని వస్తారో దయచేసి చెప్పించమని కోరుతున్నాను. రేపు బడ్జెట్ సమావేశాలు అయిపోయిన తర్వాత, 2010-11 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రిపరేషన్స్ డిసెంబరు మాసానికల్లా మొదలవుతాయి. ఈ సంవత్సరపు బడ్జెట్ సెషన్ ఆగస్టుకల్లా అయిపోతుంది. ఫైనల్ ఫిగర్స్ వస్తాయి. కాబట్టి సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో మీరందరూ కూర్చొని వర్కవుట్ చేయండి. మీరొక డిటేల్డ్ క్రిటికల్ అనాలిసిస్ ఇవ్వండి. చేయగలిగే అవకాశం ఉంటే తప్పకుండా చేద్దామనేదే మా ఉద్దేశ్యమల్లా. ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా అవసరం ఉంటే ఆ విధంగా చేయడానికి సిద్ధంగా ఉన్నాము. డబ్బు అన్నది పేదవాడికి చేరాలి. పేదవాడికి డబ్బు చేరితేనే డబ్బు రొటేట్ అవుతుంది. ఏ పది, ఇరవై మంది ధనవంతుల దగ్గర బాగా ఎక్కువగా డబ్బు ఉంటే, ఎకానమి బయన్సీ రాదు. పేద వాడి దగ్గర డబ్బు ఉంటే, పర్చేజింగ్ పవర్ పెరుగుతుంది. డబ్బు మళ్లీ రొటేషన్‌లోకి వస్తుంది. డబ్బు అన్నది రొటేట్ కాకపోతే మటుకు ఎకానమి బయన్సీ ఉండనే ఉండదు అన్న దాన్ని అందరూ ఒప్పుకునే ఎకానమి పాలసీ. దానికి సంబంధించి ఒక క్రిటికల్ ఎనాలిసిస్ చేసి మాకు డిటేల్స్ ఇవ్వమని కోరడం జరిగింది....

శ్రీ దాడి వీరభద్రరావు : ఆ ఎక్సర్‌సైజ్ మీరు చేస్తే బాగుంటుంది.

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : మేము చేద్దామనుకుంటున్నాము. కాని మా ఆలోచనకు తట్టడం లేదు. మా అజ్ఞానం అపారమనుకోండి.

శ్రీ దాడి వీరభద్రరావు : ఈ స్కీమ్ గురించి మీరు బాగా స్టడీ చేసినట్లుగా స్పష్టంగా కనపడుతోంది. కాబట్టి మీరు ఇంకా దీని గురించి థరోగా ఎగ్జామిన్ చేస్తే బాగుంటుంది.

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : వీరభద్రరావుగారూ, మీ చంద్రబాబునాయుడుకి ఉన్నంత ఆలోచన, అనుభవం మాకు లేదు. ఆయన ఎకనామిక్ స్టూడెంట్. నేనేమో మామూలు డాక్టర్ని. మాకు అంతో ఇంతో ఉంటే ఒక్క కామన్‌సెన్స్ ఉంది తప్ప, మరొకటి లేదు......

(సభలో నవ్వులు)

అధ్యక్షా, మొత్తానికి మేము చాలా చాలా మంచి మేళ్లే చేశాము. గత 150 సంవత్సరాలుగా అడవుల్లో నివసించే గిరిజనులు తమ భూములపై హక్కులు కల్పించమని అడుగుతూ ఉన్నారు. ఆనాడు అల్లూరి సీతారామరాజు కూడా దీని గురించి ఎన్నో ఉద్యమాలు చేశారు. కేంద్రంలో యు.పి.ఏ. గవర్నమెంట్‌కు సారథ్యం వహిస్తున్న మన్మోహన్‌సింగ్, యు.పి.ఏ. ఛైర్‌పర్సన్ సోనియాగాంధీగార్ల చొరవ వల్ల కేంద్రం చట్టం చేసినప్పటికీ, భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా ఆ చట్టాన్ని అమల్లోకి తెచ్చి, గిరిజనులకు తాము సాగుచేసుకుంటున్న అటవీ భూములపై హక్కులు కల్పించిన ఘనత మనకే దక్కుతుంది....

(అధికారపక్ష సభ్యుల నుండి హర్షాతిరేకం)

అట్లాగే అధ్యక్షా, కొంత మంది సభ్యులు బెల్టు షాపుల ఎత్తివేత గురించి మాట్లాడారు. బెల్టు షాపులు ఉండాలన్నది మా సిద్ధాంతం కాదు. ఎక్కడ బెల్టు షాపులున్నా వాటిని మూయించే ప్రయత్నం గట్టిగా చేద్దాం. మీ దగ్గర ఇన్‌ఫర్మేషన్ ఉంటే మాకు చెప్పండి, తప్పకుండా చేద్దాం. అట్లాగే మంచినీటి సమస్య, గ్రామీణ రహదార్ల విషయంలో మేము ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాము. హైదరాబాద్ నగరానికి సంబంధించి, పి.వి. నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పనులు కానివ్వండి, హైదరాబాద్‌కు గోదావరి జలాల్ని తీసుకుని వచ్చే విషయంలో కానివ్వండి, మురికివాడల అభివృద్ధి విషయంలో కానివ్వండి ఒక ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నాము. కేవలం హైదరాబాద్ నగరమే కాకుండా, విశాఖపట్టణం, విజయవాడ వంటి నగరాల అభివృద్ధి విషయంలో కూడా మేము ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాము. అట్లాగే ఇండస్ట్రియల్ గ్రోత్ బాగా పెంచవలసిన అవసరం ఉంది. ఈవేళ ఉన్న పరిస్థితుల్లో 15% of the GDP is from the Industrial field. దాన్ని 25% కు తీసుకుని వెళ్లే ప్రయత్నం చేస్తాం. దాని వల్ల ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. ఐ.టి. గ్రోత్‌ను కూడా బాగా పెంచవలసిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీ పరిపాలన చివరి సంవత్సరంలో భారతదేశానికి సంబంధించి మొత్తం ఐ.టి. ఎక్స్‌పోర్టుల్లో ఆంధ్రప్రదేశ్ భాగం 8.6% అయితే, ఈవేళ అది 14% అయింది. Quite improvement. పోయిన సంవత్సరం రూ.32 వేల కోట్ల విలువ గల ఐ.టి. ఎక్స్‌పోర్ట్స్ జరిగాయి. దానికి కూడా కావలసిన ఫోకస్ ఇస్తున్నాం. సాఫ్ట్‌వేర్ కాకుండా, హార్డ్ వేర్‌కు సంబంధించి పార్కులు పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. ఏదో విధంగా చేసి, సామాన్య మానవుడికి సంబంధించి అన్ని మౌలిక వసతులు కల్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని మనవి చేస్తున్నాను.

గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఈ సభలో చాలా మంది సభ్యులు బాగా మాట్లాడారని చెప్పారు. ఆవేశకావేశాలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా మంచి సుహృద్భావ వాతావరణంలో మాట్లాడిన సభ్యుల్ని ఒక్కొక్కర్ని పేరు పేరున అభినందిస్తున్నాను. మాట్లాడిన గౌరవ సభ్యులు -- ప్రసంగాన్ని ప్రారంభించిన పొంగులేటి సుధాకర రెడ్డి, బలపరుస్తూ మాట్లాడిన షేక్ హుస్సేన్, దాడి వీరభద్రరావు, పువ్వాడ నాగేశ్వరరావు, చెరుపల్లి సీతారాములు, రుద్రరాజు పద్మరాజు, కె. దిలీప్ కుమార్, డా.కె. నాగేశ్వర్,

చెంగల్‌రాయుడు, బి.వి. మోహన్ రెడ్డి, భాను ప్రసాదరావు, నన్నపనేని రాజకుమారి, గంగాభవాని... ఇద్దరూ పక్క పక్కనే మాట్లాడారు ...చుక్కా రామయ్య, తిప్పేస్వామి, పి. సుధాకర్ రెడ్డి, కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్, పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు నాయుడు, ముండ్ల వెంకట శివారెడ్డి, మొత్తం 23 మంది సభ్యులు మాట్లాడారు. వారందర్నీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. రాబోయే అయిదు సంవత్సరాల్లో మరింత మెరుగైన పరిపాలన అందించేందుకు మీరందరూ కృషి చేయాలని కోరుతున్నాను. ప్రజలు మనకు ఇచ్చిన మంచి తీర్పును గౌరవించడంవల్ల మనం ఈనాడు ఈ చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నాము. కాబట్టి ప్రజలు ఇచ్చిన అవకాశం దుర్వినియోగం అయిందని అనిపించుకోకుండా, ప్రజా సేవకు మనం బాగా ఉపయోగపడ్డాము, చట్టాలు చేయడంలో మనం బాగా ఉపయోగపడ్డామని, ప్రజా సమస్యల్ని ప్రొజక్టు చేయడంలో మనం బాగా ఉపయోగపడ్డామని ఋజువు చేసుకోవడానికి వచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు మీరంతా హృదయపూర్వకంగా సహకరించాలని కోరుతున్నాను. కొత్తగా వచ్చిన సభ్యులతోపాటు, సభా నాయకుడుగా ఎన్నుకోబడిన రోశయ్యగారిని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. ఈ హౌజ్‌లో మీరంతా బాగా మాట్లాడగలిగి, బాగా ఉపయోగపడే విధంగా సమయస్ఫూర్తిని భగవంతుడు మీకు ఇవ్వాలని, భగవంతుడు మీకు అన్ని రకాలుగా మేలు చేయాలని కోరుతూ, గవర్నరుగారి ప్రసంగానికి సభ ఏకగ్రీవంగా ధన్యవాదాలు తెలపాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, కౌన్సిల్ నూతన భవన నిర్మాణం గురించి గతంలో ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకుని వెళ్లినపుడు, మేము తిరిగి అధికారంలోకి వస్తే, వెంటనే చేపడతామని హామి ఇచ్చారు. ఇప్పుడు మీరు తిరిగి అధికారంలోకి వచ్చారు కాబట్టి వెంటనే కౌన్సిల్ కొరకు ఒక కొత్త భవన నిర్మాణానికి మీరే శంకుస్థాపన చేయవలసిందిగా కోరుతున్నాను. అలాగే హాస్టల్ బిల్డింగు విషయానికి వస్తే, సభ్యులకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. వాటి గురించి తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : ఆర్థిక మంత్రి మీ నాయకుడే....

(సభలో నవ్వులు)

ఆర్థిక వెసులుబాటు చూసుకుని వీలైనంత త్వరలో ఆ ఏర్పాటు చేయమని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, కూరగాయల ధరలు బాగా విపరీతంగా పెరిగిపోతున్నాయి. వాటిని కంట్రోలు చేయండి. ప్రాజక్టులు ఎంత ముఖ్యమో, ప్రజలకు కావలసిన నిత్యావసర వస్తువుల్ని తక్కువ ధరలకు లభించేలా చేయడం కూడా ముఖ్యమే. మహిళలందరూ ఈ సమస్య పరిష్కారం కొరకు ఎదురుచూస్తున్నారు.

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : అట్లాగేమ్మా! అన్ని రకాల వస్తువుల ధరల్ని కంట్రోలు చేయడానికి మంత్రిగారి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేకమైన మెకానిజమ్ ఏర్పాటు చేసి, ప్రతి వారం దాన్ని రెవ్యూ చేసేందుకు చర్యలు తీసుకుంటాము. సమస్య ఏమిటంటే, పంటల ఉత్పత్తి ఎక్కువగా ఉండి డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు ధరలు పడిపోతాయి, పంట దిగుబడి తక్కువగా ఉండి, డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు రేట్లు పెరుగుతాయి. కాబట్టి అటువంటి సమస్యల్ని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవలసి ఉంటుంది. హార్టికల్చర్

మరియు అగ్రికల్చర్ డిపార్టుమెంట్లను ఇప్పటికే కోరడం జరిగింది. మీరు చేసిన సూచనను తప్పకుండా స్వీకరిస్తాము.

సా. 6.00

(శ్రీమతి సి.హెచ్.గంగా భవానిచే సభకు అంతరాయం)

MR.CHAIRMAN : Ganga Bhavani garu, please take your seat.

(Interruptions)

Don't go into that aspect again. Please take your seat.

ముఖ్యమంత్రి గారూ, ఒక సూచన వచ్చింది. రాష్ట్రంలో చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులలో కొన్నింటిని జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడానికి ఒక డెలిగేషన్‌ను ఢిల్లీకి లీడ్ చేయటం గురించి.

డా. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి : రిసొల్యూషన్ విషయంలో మీకు ఎప్పుడు అనుకూలంగా ఉంటే అప్పుడు రిసొల్యూషన్ పాస్ చేయండి. డెలిగేషన్ విషయంలో కూడా ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు తప్పకుండా తీసుకు వెళతాం. There is no problem.

మిస్టర్ ఛైర్మన్ : సీతారాములు గారూ, మీ అమెండ్‌మెంట్లన్నిటికీ జవాబులు వచ్చాయి. Why don't you withdraw your amendments as a goodwill gesture for the first session? I hope you have withdrawn your non-official amendments to the Motion of Thanks to the Governor's Address.

శ్రీ చేరుపల్లి సీతారాములు : వరల్డ్ బ్యాంకుకి సంబంధించిన కండిషన్స్ గురించి.

(అంతరాయం)

**Non-Official Amendments:**

SRI CHERUPALLY SEETHARAMULU: Chairman Sir, I beg to withdraw the following ammendments:

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the change of Government policy to charge water supplied for irrigation on volumetric basis at the instance of World Bank to enable availment of its loan for modernization of Nagarnuna Sagar Canal System."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the action contemplated to complete the implementation of recommendations of Koneru Ranga Rao Commission report on land issues."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about action taken to resettle the displaced persons under various irrigation and other developmental projects, including Special Economic Zones."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the likely submission of Pay Revision Commission report to the Government employees in the State."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the steep raising of prices of all daily necessities in spite of increase in their production causing untold misery to the poor and middle-class sections in the State."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the resolve of the Government to fulfill its election promises in the recent elections."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the non-functioning of Regional Boards, which have been specifically constituted to promote equitable development of all regions in the State."

Add the following at the end ---

"It is however, regretted that no mention has been made in the address about the hardships and continuing suicides of many farmers, handloom workers, rural artisans and poor people unable to bear the harshness of poverty and indebtedness."

MR. CHAIRMAN: The non-official amendments have been withdrawn.

Now, the question is:

That an Address be presented to the Governor as follows:

"That the Members of Andhra Pradesh Legislative Council assembled in this Eighth Session are deeply grateful to the Governor for the Address which he has been pleased to deliver to the legislative Council on 08-06-2009. "

(PAUSE)

The motion was adopted and the address was presented.

8వ సమావేశపు గణాంక వివరముల పట్టిక

MR. CHAIRMAN: The statistics for the eighth session held on 09-06-09 and 10-06-09 are:

| | | |
|---|---|---|
| 1. | Number of days for which the Council sat | 2 |
| 2. | Number of hours for which the Council worked | 8 Hrs.18 Mts. |
| 3. | Number of speeches made by the members | 23 |
| 4. | Number of statements made by the Ministers | 1 |

**PARTY POSITION IN THE A.P. LEGISLATIVE COUNCIL AS ON 10-06-2009**

| | | |
|---|---|---|
| 1. | Indian National Congress | 35 |
| 2. | Telugu Desam Party | 16 |
| 3. | Telangana Rashtra Samithi | 02 |
| 4. | Communist Party of India (Marxists) | 01 |
| 5. | Communist Party of India | 02 |
| 6. | All India Majlis Ittehad-Ul-Muslimeen | 01 |
| 7. | Progressive Democratic Front | 07 |
| 8. | Democratic Peoples Front | 03 |
| 9. | Independents | 06 |
| 10. | Nominated | 12 |
| 11. | Vacant | 05 |

MR. CHAIRMAN: Now, with the consent of the House, I adjourn the House sine die.

(Then the House adjourned sine die at 6.04 p.m.)